మానుష్ గత నాగరికతల పై విలక్షణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam , Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

23-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 204 పేజీలు: 16 వెల: 8.00

మరో రెండు వారాల్లో జిన్‌పింగ్ అమెరికా పర్యటన

అన్ని ఎయిర్‌పోర్టుల్లో ఇ-బోర్డింగ్ పాస్

5లో

10 వేల పోస్టులకు గ్రీన్ సిగ్నల్

నిరుద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు

గ్రూప్-1లో 149, గ్రూప్-2లో 673 ఉద్యోగుల భర్తీ

డిఎస్సీ ద్వారా 2991 ఉపాధ్యాయ నియామకాలు

సెప్టెంబరు, అక్టోబరులో నోటిఫికేషన్లు: జాబ్ కేలండర్ విడుదల

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: నిరుద్యోగులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. 10,060 పోస్టుల వివరాలతోకూడిన జాబ్ కేలెండర్ 2026ను విడుదల చేసింది. నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ నోటిఫికేషన్లు రానున్నాయి. గ్రూప్1లో 149 పోస్టులు, గ్రూప్2లో 673 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. అలాగే పోలీసు, ఫైర్, జైళ్లు, అటవీ, పశు సంవర్ధకశాఖ, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. డిఎస్సీ ద్వారా 2,991 ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో చూడాలని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఆర్థికశాఖ అధికారులు జీవో విడుదల చేశారు. శాసనసభలో ప్రకటించినట్లుగానే జాబ్ క్యాలెండర్2026 విడుదలకు అనువుగా ఆర్థికశాఖ 10,060 పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. విద్య, వైద్యం, శాంతి భద్రతల విభాగాలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చింది. జాబ్ క్యాలెండర్ 2026 విడుదలకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ జీవో నంబర్ 81 జారీ చేశారు. ఎపిపిఎస్సి, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, డిఎస్సీ ద్వారా ఈ పోస్టులు భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. నాలుగు దశల్లో ఈ నియామకాలు జరగనున్నాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మొదటి దశలో ఉన్నత విద్యాశాఖకు చెందిన 1,523 పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఉన్నత విద్యాశాఖ ద్వారా మే 15నే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ ప్రక్రియ ప్రారంభించారు. మిగిలిన మూడు దశల నోటిఫికేషన్ల కోసం ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెండో దశ నోటిఫికేషన్ సెప్టెంబర్ 15 విడుదలకానుంది. ఈదశలో మొత్తం 3,231 పోస్టులకు నోటిఫికేషన్లు రానున్నాయి. ఇందులో 149 గ్రూప్1 పోస్టులు ఉన్నాయి. డిప్యూటీ కలెక్టర్లు 11, డిఎస్పీ సివిల్ 36, పంచాయతీ రాజ్ డిడిఒలు 35 పోస్టులతో పాటు మున్సిపల్ కమిషనర్, కమర్షియల్ >>2



శనివారం విజయవాడలో వెలిగొండ ప్రాజెక్టునిర్వాసితులకు చెక్కును అందజేసిన సిఎం చంద్రబాబు

వారంలో వెలిగొండ సాకారం

31న ప్రాజెక్టు మొదటిదశ ప్రారంభించి నీరు విడుదల చేస్తా: సిఎం చంద్రబాబు

నిర్వాసితులకు 3వ విడతలో రూ. 250 కోట్లు చెల్లింపు

విజయవాడ.ఆగస్టు 22:, ప్రభాతవార్తప్రతినిధి: మూడు దశాబ్దాల వెలిగొండ కల సాకారమయ్యిందని సిఎం చంద్రబాబు అన్నారు.ఈ వెలగొండ ప్రాజెక్టుకు తానే శంకుస్దాపన చేసానని,తానే ప్రారంభిస్తున్నానని సిఎం స్పష్టం చేసారు. మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల 30 యేళ్ల ఆకాంక్షలు నెరవేరేలా వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కానుంది. ఆగస్టు 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశను ప్రారంభించి నీళ్ల విడుదలచేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. క్యాంపు కార్యాలయంలో శనివారం వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం చెక్కును సిఎం చంద్రబాబు అందించారు. దీంతో ఇప్పటి వరకూ 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మొదటి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు పరిహారాన్ని సిఎం చేతుల మీదుగా అందించారు. 48 రోజుల్లోనే నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.768 కోట్లను చెల్లించింది. నిర్వాసితులకు మరో రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లా >>2

శనివారం గుంటూరులో నిరసన చేస్తున్న వైద్యులు

జూడాల సమ్మె ఉధృతం

గుంటూరులో కొనసాగిన నిరసనలు

గుంటూరు మెడికల్ , ఆగస్టు 22, ప్రభాత వార్త: జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె 13వ రోజుకు, మూడో దశ ఆందోళన ఆరో రోజుకు చేరుకుంది. గుంటూరు వైద్య కళాశాలకు చెందిన రెసిడెంట్ వైద్యులు, ఇంటర్న్లుగుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని సూపరింటెండెంట్ >>2

టైమ్, డేట్ ఫిక్స్‌చెయ్.. వస్తా

డిఎస్సీపై జగన్‌కు ఐదోసారి సవాల్ విసిరిన మంత్రి లోకేష్

కార్యకర్తల సంక్షేమానికి రూ. 160 కోట్లు ఖర్చు చేసామన్న మంత్రి

విజయనగరం, ఆగస్టు 22 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తను గుర్తించి సముచిత స్థానం కల్పించే బాధ్యత తనదేనని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. కార్యకర్తలు తనను వెతుక్కుంటూ రావాల్సిన అవసరం లేదని, కష్టపడే కార్యకర్తలను తానే వెతుక్కుంటూ వస్తానని స్పష్టం చేశారు. విజయనగరం నియోజకవర్గంలో పర్యటించిన నారా లోకేష్ కార్యకర్తల >>2

శనివారం విజయనగరంలో కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేష్

విశాఖ వేదికగా బ్రిక్స్ కొత్త క్రీడా బంధం ఆవిష్కరిద్దాం

2లో

బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్వర్క్ ఏర్పాటుకు పిలుపు

బ్రిక్స్ దేశాల యువజన, క్రీడల మంత్రుల సాంస్కృతిక కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

23-8pg2exHMNWJQE.qxd:23-8pg2exHMNWJQE.qxd 1/1/02 6:54 AM Page 1

శనివారం విశాఖలో బ్రిక్స్ దేశాల యువజన, క్రీడా మంత్రుల సమావేశంలో సిఎం చంద్రబాబు

విశాఖ వేదికగా బ్రిక్స్ కొత్త

క్రీడా బంధం ఆవిష్కరిద్దాం

విశాఖపట్నం, ఆగస్టు 22 ప్రభాతవార్త: భాష, సంస్కృతి, భౌగోళికంగా విభిన్నమైన బ్రిక్స్ దేశాలను క్రీడలు, యువత ఒక్కటిగా కలుపుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బ్రిక్స్ దేశాల యువజన, క్రీడా మంత్రుల సమావేశాలకు విశాఖ వేదిక కావడం గర్వకారణమని సిఎం వ్యాఖ్యానించారు. క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాదని. అవి సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానానికి ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య క్రీడా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు విశాఖ కేంద్రంగా 'బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. బ్రిక్స్ యువజన, క్రీడామంత్రుల సమావేశాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం, అధికారిక విందు కార్యక్రమంలో సిఎం చంద్రబాబు మాట్లాడారు. విశాఖపట్నంనగరానికి సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుందని.. భారత తూర్పు తీరానికి ఈ నగరం ఆభరణమని సిఎం అభివర్ణించారు. ఉద్యోగాలు, ప్రతిభకు సంబంధించి వరుసగా రెండో యేడాది విశాఖ దేశంలోనే నంబర్‌వన్ సిటీ ఆన్ ద రైజ్‌గా గుర్తింపు పొందిందని, మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లోనూ విశాఖకు స్థానం దక్కిందని తెలిపారు. వ్యూహాత్మక మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీఇన్నోవేషన్ హబ్‌గా ఎదుగుతోందని చెప్పారు. సుదీర్ఘ తీరప్రాంతం, నైపుణ్యం కలిగిన యువత, ఆతిథ్యంఇచ్చే ప్రజలతో విశాఖ నూతన భారతదేశ స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరిజానికి విశాఖలో అపార అవకాశాలున్నాయని పేర్కొన్నారు. క్రీడలతో ఆరోగ్యం, ఉపాధి, ఆర్థిక ప్రగతిసాంకేతికత ఆధారిత జీవన విధానంలో యువతలో ఒత్తిడి పెరుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. ఒత్తిడిని అధిగమించి మానసిక దృఢత్వాన్ని పెంచుకోవడానికి క్రీడలు, యోగా, ధ్యానం దోహదపడతాయని చెప్పారు.ఆరోగ్యవంతమైన పౌరులతో ఆరోగ్యకరమైన సమాజం, ఓ బలమైన ఉత్పాదకశక్తి కలిగిన దేశం నిర్మితం అవుతుందన్నారు. క్రీడల ద్వారా అథ్లెట్లు, కోచ్‌లు, ట్రైనర్లు, ఫిజియోథెరపిస్టులు, ఈవెంట్ మేనేజర్లు, పారిశ్రామికవేత్తలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. అపెక్స్ 2036 ద్వారా గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకూ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వ్యవస్థను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రతిభను గుర్తించి శాస్త్రీయ శిక్షణ ద్వారా 2036 ఒలింపిక్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ క్రీడా పోటీలకు సిద్ధం చేస్తామని అన్నారు. 28 జిల్లాల్లో 56 రెసిడెన్షియల్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ స్కూళ్లను ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి అకాడెమీలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లతో వాటిని అనుసంధానిస్తామన్నారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ.. నెల్లూరులో క్రీడా తయారీ హబ్‌అమరావతి స్పోర్ట్స్ సిటీని కేంద్రంగా పూర్తి స్థాయి స్పోర్ట్స్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సిఎం వివరించారు. నెల్లూరులో క్రీడా ఉపకరణాల తయారీ, అపారెల్ టెక్నాలజీ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. విశాఖను అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎపిలో శిక్షణ, ఆవిష్కరణ, తయారీ అనే విధానంలో ఓ సమగ్ర ఎకో సిస్టమ్‌ను రూపొందిస్తామన్నారు. బ్రిక్స్ దేశాల్లో ఉన్న ప్రపంచ స్థాయి నైపుణ్యాన్ని కలసి నేర్చుకోడానికి సహకరించడానికి దీర్ఘ కాలిక భాగస్వామ్యాలకు ఏపీ సిద్ధంగా ఉందని వివరించారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ద్వారా అథ్లెట్లు, కోచ్‌లు, విశ్వవిద్యాలయాలు, స్పోర్ట్స్ నిపుణులు, స్టార్టప్‌లు, పారిశ్రామిక వేత్తలను అనుసంధానించాలని అన్నారు. క్రీడా ఉపకరణాల తయారీ, హై పెర్ ఫార్మెన్స్ ట్రైనింగ్, వాటర్ స్పోర్ట్స్, అంతర్జాతీయ ఈవెంట్లు, స్పోర్ట్స్ టూరిజంలో భాగస్వామ్యాలకు ముందుకు రావాలని బ్రిక్స్ దేశాలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేయటమే లక్ష్యంగా బ్రిక్స్ సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రి మన్సుక్ మాండవియా, సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే రాష్ట్ర మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, రాంప్రసాద్ రెడ్డి గాలా డిన్నర్ లో భాగస్వామ్యమయ్యారు.

10 వేల పోస్టులకు గ్రీన్ సిగ్నల్

>> టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఇందులో ఉన్నాయి. ఇక ఇదే దశలో పోలీస్, ఫైర్, జైళ్ల శాఖలో భారీగా కొలువులు భర్తీ చేయనున్నారు. 542 సివిల్ కానిస్టేబుల్స్, 205 ఏఆర్ కానిస్టేబుల్స్, 182 సివిల్ ఎస్సై, 116 ఏఆర్ ఎస్సై పోస్టులు నోటిఫై కానున్నాయి. ఫైర్ మెన్, జైలు వార్డర్ పోస్టులు, 164 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఈ ఫేజ్ లోనే భర్తీ కానున్నాయి.

మూడో దశ అక్టోబర్ 15న నోటిఫికేషన్ రానుంది. ఈ దశలో మొత్తం 2,311 పోస్టులను భర్తీ చేస్తారు. ప్రధానంగా గ్రూప్2 అభ్యర్థులకు ఇది కీలకమైన దశ. 673 గ్రూప్2 పోస్టుల్లో రెండు వందలు డిప్యూటీ తహసీల్దార్, 176 డిప్యూటీ ఎంపీడీవో, 40 జీఎస్టీ ఆఫీసర్ (ఎసిటిఒ) పోస్టులు ఉన్నాయి.ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్లు 25, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు 400 పోస్టులు భర్తీ చేయనున్నారు. అలాగే ఇంజనీరింగ్, విద్యుత్ శాఖల్లో ఎఇఇ పోస్టుల భర్తీ కూడా ఇదే దశలో ఉండబోతోంది. ఇరిగేషన్‌లో 224, పంచాయతీరాజ్‌లో 173, రోడ్లుభవనాల శాఖలో 79 ఎఇఇ పోస్టులతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో ఏకంగా 629 ఎఇఇ పోస్టుల భర్తీకి అక్టోబర్ 15న ప్రకటన వెలువడనుంది. నాలుగో దశ అక్టోబర్ 15న నోటిఫికేషన్ రానుంది. ఈ దశ పూర్తిగా ఉపాధ్యాయ కొలువులకు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా డిఎస్సీ ద్వారా 2,995 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ తదితర ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను జిల్లాల వారీగా డిఎస్సీలు త్వరలోనే ప్రకటించనున్నాయి. ప్రెసిడెన్షియల్ ఆర్డర్2025, రిజర్వేషన్లు, రోస్టర్ విధానాలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఈ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆయా శాఖలన్నీ రిక్రూటింగ్ ఏజెన్సీలకు వెంటనే ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లను పంపాలని జీవోలో పేర్కొంది. ప్రణాళికాబద్ధంగా నోటిఫికేషన్ల తేదీలను ముందుగానే ప్రకటించడంతో సన్నద్ధతకు అభ్యర్థులకు సమయం ఉంది.

ఎపిపిఎస్సి, డిఎస్సీ వంటి ఏజెన్సీలు ఈ ప్రభుత్వ కొలువుల కోసం నియామక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. ఈ పరీక్షలన్నింటిని ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా కంప్యూటర్ ఆధారితంగానే నిర్వహించాలన్నది ప్రభుత్వ యోచన. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎటువంటి వివక్ష లేకుండా ఈ ఎంపిక ప్రక్రియలో సమాన అవకాశాలు ఇవ్వాలన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి వివరాలు సంబందిత వెబ్‌సైట్‌లో చూడాలని ప్రభుత్వం తెలిపింది.

జూడాల సమ్మె ఉధృతం

>> కార్యాలయం సమీపంలో శాంతియుత నిరసన కొనసాగించారు.ఉదయం స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల రిజిస్ట్రార్ సంఘం, వైద్య పరిశోధన మరియు పరిశ్రమల సంఘం ప్రతినిధులు నిరసన ప్రదేశాన్ని సందర్శించి రెసిడెంట్ వైద్యులు, ఇంటర్న్‌లకు సంఘీభావం తెలిపారు. అలాగే ప్రజలు, ఆందోళనలో పాల్గొంటున్న వారితో 'ఈ సమ్మె గురించి ఒక్క మాటలో ఏమి చెప్పాలనుకుంటున్నారు?' వంటి ప్రశ్నల ద్వారా పరస్పర చర్చలు నిర్వహించారు. సమ్మెపై ప్రజల అవగాహన, స్పందనను తెలుసుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల సంఘం ప్రతినిధులు కూడా నిరసన ప్రదేశాన్ని సందర్శించి జూనియర్ వైద్యుల న్యాయబద్ధమైన డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. అనంతరం జూనియర్ వైద్యులు నినాదాలు చేస్తూ, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఐక్యంగా, శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలు జరిపి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని వారు కోరారు.

1,800 కి.మీ. ఎల్పీజీ పైప్‌లైన్లకు

పిఎన్‌జిఆర్‌బి అనుమతి

న్యూఢిల్లీ, ఆగస్టు 22: దేశ ఇంధన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఎల్పీజీ సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు సుమారు 1,800 కిలోమీటర్ల ఎల్పీజీ పైప్‌లైన్‌ల అభివృద్ధికి పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.7,000 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో ఈ పైప్‌లైన్లను నిర్మించనున్నారు. దేశ ఎల్పీజీ రవాణా నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, దీర్ఘకాలిక ఇంధన భద్రతను పెంచడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యాలు. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో గణనీయమైన భాగాన్ని సముద్రతీర ప్రాంతాల్లో దిగుమతుల ద్వారా సమకూర్చుకుంటోంది. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎల్పీజీని రవాణా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్లు అంతర్గత మార్కెట్లకు ఎల్పీజీని మరింత సమర్థవంతంగా, విశ్వసనీయంగా తరలించేందుకు దోహదపడతాయి. మూడు కీలక పైప్‌లైన్లు పిఎన్‌జిఆర్‌బి అనుమతించిన ప్రాజెక్టుల్లో తెలంగాణలోని చెర్లపల్లి-మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మధ్య 556 కి.మీ. పైప్‌లైన్, ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ-ఉత్తరాఖండ్‌లోని సితార్గంజ్ మధ్య 611 కి.మీ. పైప్‌లైన్, మహారాష్ట్రలోని శిక్రాపూర్‌నుంచి గోవా, కర్ణాటకలోని హుబ్బళ్లి వరకు 633కి.మీ. పైప్‌లైన్ ఉన్నాయి.ఈ ప్రాజెక్టులను గెయిల్ అభివృద్ధి చేయనుంది. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత దేశంలో పిఎన్‌జిఆర్‌బి అనుమతించిన కామన్ క్యారియర్ ఎల్పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న సుమారు 7,700 కి.మీ. నుంచి 9,500 కి.మీ.కు విస్తరించనుంది.

శనివారం కొచ్చి విమానాశ్రయంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

కేరళం చేరుకున్న పవన్ కల్యాణ్

విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న కుడి భుజానికి తదుపరి చికిత్స నిమిత్తం కేరళం రాష్ట్రానికి చేరుకున్నారు. కొచ్చి విమానాశ్రయంలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. శనివారం సాయంత్రం కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న పవన్ కల్యాణ్ అక్కడి నుంచి నేరుగా చికిత్స అందించనున్న ఆయుర్వేద వైద్యశాలకు కోసం త్రిస్సూర్ బయలుదేరి వెళ్లారు. అక్కడి సమీపంలోని ఓ ఆయుర్వేద వైద్యశాలలో ప్రత్యేక థెరపీ ద్వారా ఆయన చికిత్స చేయించుకోనున్నారు. పవన్ కల్యాణ్ 20 రోజుల పాటు చికిత్స తీసుకుంటునే ఇక్కడి పరిపాలనా వ్యవహారాలు పర్యవేక్షిస్తారు.

విజయవాడ సహా 4 నగరాలు

59 పట్టణాల అభివృద్ధి

రూ. 5,490 కోట్ల అంచనాతో ఫండ్‌కోసం కేంద్రానికి ప్రతిపాదన

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలో పట్టణాలు,నగరాల అభివృద్ధికి ప్రభుత్వం కీలక ప్రణాళికను రూపొందించింది.ఇందుకోసం అవసరమైన నిధుల కేటాయింపు కోసం కేంద్రానికి ప్రతిపాదనలను పంపించింది.పట్టణాల అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూడీఎఫ్) రెండో విడత కింద ఏకంగా రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో మంచినీరు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థలు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా ప్రాజెక్టులు రూపొందించారు. రెండో విడతలో భాగంగా రూ.5,940 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు పంపింది. ఇప్పటికే దిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. డీపీఆర్‌లు సిద్ధం చేసిన తర్వాత మరోసారి కేంద్రంతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ పథకం కింద ప్రాజెక్టు అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్రం గ్రాంట్‌గా అందించనుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంస్థలు సమకూర్చాల్సి ఉంటుంది. రెండో విడతలో విజయవాడకు భారీగా నిధులు ప్రతిపాదించారు. కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.600 కోట్లు, మంచి నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు స్కాడా విధానం అమలుకు మరో రూ.300 కోట్లు ప్రతిపాదించారు. నెల్లూరులో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు వినియోగించేలా రూ.120 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి రెండు దశల్లో 130 కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించారు. రాజమహేంద్రవరానికి కూడా పలు కీలక ప్రాజెక్టులు ప్రతిపాదించారు. 20 కోట్లతో పీపీపీ విధానంలో మల్టీలెవెల్ కారు పార్కింగ్, 120 కోట్లతో గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేయనున్నారు. మరో 100 కోట్లతో పీపీపీ విధానంలో కమర్షియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.గుంటూరులో 300 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ అభివృద్ధికి 100 కోట్లు, తాగునీటి సరఫరా విభాగంలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు మరో 100 కోట్లు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా నిధులను సమకూర్చడం కీలకంగా మారింది. ఇందుకోసం హడ్కో నుంచి రుణం తీసుకునే ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. నగరపాలక సంస్థల పరిధిలో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. విజయవాడ, నెల్లూరు, గుంటూరు, రాజమహేంద్రవరంతోపాటు మరో 59 పురపాలక సంఘాల్లో రెండో విడతలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సమకూర్చాల్సిన వాటా నిధుల కోసం ప్రభుత్వం హడ్కో నుంచి రుణం తీసుకోనుంది. నగరపాలక సంస్థల్లో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశం ఉంది. హడ్కో రుణం ప్రతిపాదనలు ఆర్థికశాఖ పరిశీలనలో ఉన్నాయి. అనుమతి రాగానే ప్రక్రియ మొదలు కానుంది. దీంతో రాజధాని ప్రాంతంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ నగరం రూపు రేఖలు మారతాయి.గుంటూరు పరిస్థితి కుడా అంతే, నెల్లూరు,రాజమహేంద్రవరం అభివృద్ది చెందనున్నాయి.

టైమ్, డేట్ ఫిక్స్‌చెయ్.. వస్తా

>> సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువనేత లోకేష్ పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, ప్రజలతో మమేకం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. డిఎస్సీ, ఎపిపిఎస్‌సి మధ్య తేడాకూడా తెలియని స్థితిలో జగన్ ఉన్నాడు. డిఎస్సీ నియామకాల విషయంలో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. డిఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ కోర్టుకు వెళ్లి పిటిషన్లు వేశారు. కోర్టు కూడా ఎక్కడా కూటమి ప్రభుత్వాన్ని తప్పుబట్టలేదు. పారదర్శకంగా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు, ఒక్క డిఎస్సీ విడుదల చేయలేదు, వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ అంటే ఏంటో కూడా జగన్‌కు అర్థం కాలేదు. అసెంబ్లీలో గొడ్డలి పార్టీ చేసే ప్రతి దుష్ప్రచారానికి సమాధానం చెప్పాను. డిఎస్సీపై చర్చిద్దామని జగన్‌కు ఛాలెంజ్ చేశాను. అయినా జగన్ రాలేదు. ఈరోజు కూడా ఐదోసారి ఛాలెంజ్ చేస్తున్నా. టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్. డిఎస్సీపై చర్చకు రా..! తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చోవడం కాదు. బయటి రా..! ఐదేళ్లు వేచి చూసి కష్టపడి టెట్, డిఎస్సీ రాసి ఎంపికైన ఉపాధ్యాయులను జగన్ అవమానిస్తున్నారు. జగన్ చెప్పిన అబద్ధాలను కార్యకర్తలు తిప్పికొట్టాలి" అని లోకేష్ పిలుపునిచ్చారు.

ప్రజలతో మమేకమే కార్యకర్తల ప్రధాన బాధ్యత:

"2019లో మంగళగిరిలో ఓటమిని సవాల్‌గాతీసుకుని ప్రజల్లో నిరంతరం ఉన్నాను. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం వల్ల నాకు, మంగళగిరి ప్రజలకు మధ్య బలమైన అనుబంధం ఏర్పడింది. 2024లో మంగళగిరి ప్రజలు నన్ను భారీ మెజారిటీతో గెలిపించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం మాత్రమే కాకుండా, ప్రతి కార్యకర్త ప్రజలతో వ్యక్తిగతంగా మమేకం కావాలి. అప్పుడే పార్టీకి, ప్రజలకు మధ్య బలమైన అనుబంధం ఏర్పడుతుంది. సమస్యలపై పోరాడండి. పరిష్కారం అయ్యే వరకు వదలకండి. ప్రజలకు, మనకు మధ్య ఉన్న బంధాన్ని మరింత బలోపేతం చేయండి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి :

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి. డోర్ టు డోర్ కార్యక్రమాన్ని పూర్తి చేసి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి. పంచాయతీ నుంచి ఢిల్లీ వరకు కూటమి ప్రభుత్వం ఉంటే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుంది. కూటమి పార్టీల మధ్య చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ సమన్వయంతో ముందుకు సాగాలి. కూటమి ఐక్యతను దెబ్బతీసేలా గొడ్డలి పార్టీ చేస్తున్న ప్రలోభాలకు ఎవ్వరూ లొంగవద్దు. రాబోయే ఎన్నికల్లో గత విజయాల కంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలి" అని కోరారు.

ప్రజా శ్రేయస్సే అదితి గజపతి రాజు నిరంతర ఆలోచన :

విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. అసెంబ్లీలో అదితి ప్రతిరోజూ మూడు సార్లు నా వద్దకు వచ్చి నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి గురించే చెప్తుంటుంది. నాకు ఇదిచేయండని స్వార్థప్రయోజనాల కోసం ఎప్పుడూ ఎవర్నీఅడగలేదు. జిఎంఆర్- మాన్సాస్ ఎడ్యుసిటీ నిర్మాణానికి ఎదురైన అడ్డంకులను అధిగమిస్తూ ప్రాజె క్టును పూర్తి చేయడానికి ఆమె పట్టుదలతో పనిచేస్తున్నారు. మన పిల్లలకు ఏవియేషన్ విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఎడ్యుసిటీకి 150ఎకరాలభూమిని ఉచితంగా గజపతిరాజు కుటుంబం ఇవ్వడం గర్వకారణం" అని అన్నారు.

అశోక్ గజపతి రాజు సేవలు స్ఫూర్తిదాయకం:

పార్టీ, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే వ్యక్తి అశోక్ గజపతి రాజు. ఆయన నానో కారులో తిరిగినా రాజసం మాత్రం రోల్స్ రాయిస్ లాగా ఉంటుంది. అశోక్ గజపతి రాజుని చాలా ఇబ్బందులు పెట్టారు. అర్ధరాత్రి అరెస్ట్ చేయాలని చూశారు. సింహాచలం ట్రస్ట్ నుండి తీసేయాలని చూశారు. రాముడి శిరస్సు ను తొలగించినప్పుడు చంద్రబాబు, అశోక్ గజపతి రాజు వస్తుంటే లారీ అడ్డంపెట్టి అడ్డుకోవాలని చూశారు. బాబుపైన, అశోక్ గజపతి రాజుపైన అక్రమ కేసులు పెట్టారు. ఎన్ని కేసులు పెడితే మన నాయకులకు అంత బలం. నాపైనే 24 కేసులు పెట్టారు. మర్డర్ కేసు మాత్రమే నాపై పెట్టలేదు. అది కూడా పెట్టివుంటే నాలో మరింత కసి పెరిగేది.. గొడ్డలి పార్టీకి 11 కూడా వచ్చేవి కాదు" అని పేర్కొన్నారు.

వారంలో వెలిగొండ సాకారం

>> ల్లోని 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. వెలిగొండ నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఆయా జిల్లాల ప్రజల 30 యేళ్ల కలను సుసాధ్యం చేసి చూపించాం. సిఎంగా 1995లో ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు రైతులు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. 1996లో నేనే ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేసి... 2026లో ప్రారంభిస్తున్నాను. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభించేలా రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. నాడు ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభించటం నా అదృష్టం. ఈ యేడాది ఎల్ నినో కారణంగా 50 శాతం లోటు వర్షపాతం ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాలేదు. చాలా పొదుపుగా నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. ఇబ్బందులు ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు ఇవ్వాలని సంకల్పించుకున్నాం. 2021లోనే దీనిని పూర్తి చేసి నీరివ్వాల్సి ఉన్నా గత పాలకులు చేసిన డ్రామాలతో అది సాధ్యం కాలేదు. పోలవరం పూర్తి చేసి కృష్ణాడెల్టాకు, శ్రీశైలంలో నీరు పొదుపు చేసి ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వొచ్చు. గంగాగోదావరి కావేరి అనుసంధానించాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించాను. ఐదు నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల్లో సమస్యలు తీరిపోతాయి. దేశానికే నీటి సమస్య పరిష్కారమై నీటి భద్రతవస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మేలు జరిగేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ నెల 31 తేదీన వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల చేస్తాం. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు ఇస్తాం. సెప్టెంబరులోనే హార్టికల్చర్ హబ్‌కు ఫౌండేషన్ వేస్తాం. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తుల్ని ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. గత పాలకులు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ లాంటి పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధితో పాటు ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. మంచి చేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని ప్రజల్ని కోరుతున్నాను" అని ముఖ్యమంత్రి అన్నారు.

పునరావాస ప్యాకేజీ పై నిర్వాసితుల సంతృప్తి..

గత ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని.. నాటి సిఎం ప్రకాశం జిల్లాకు వచ్చినప్పుడు పరిహారం అడుగుతామని నోటీసులు ఇచ్చి బయటకు రాకుండా చేశారని.. ప్రాజెక్టు కింద పొలాలను కోల్పోయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సంతోషం కలిగించిందని వెలిగొండ నిర్వాసిత రైతు కాశిరెడ్డి అన్నారు. చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ఇప్పుడు ప్రారంభిస్తున్నారని.. తాము కలగా భావించిన ప్రాజెక్టు తమ కళ్ల ముందే సాకారమైందని..తమ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు రావటం సంతోషంగా ఉందని నిర్వాసిత రైతు బోగెం శ్రీనివాసులు అన్నారు. తమకు పరిహారం పూర్తిగా అందించిందని.. కాలనీల్లో వసతుల కల్పన బాగుందని నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలవటం సంతృప్తిగా ఉందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈసమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ప్రశాంతి, వెలిగొండ నిర్వాసితులు పాల్గొన్నారు.

వారం - వర్జ్యం

23-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.ఏకాదశి తె.4.18
న.మూల సా.5.43
వ1. మ.3.55-సా.5.43
వ2. తె.3.24-ఉ.6.11
దు. సా.4.42-5.32
రాహు సా.4.30-సా.6.00
శుభ ఉ.8.00-ఉ.9.00

వార్తాఫలం

మేషం : నూతన కార్యక్రమాలను అనుకున్న విధంగా ప్రారంభించగలుగుతారు. వివాహాది శుభ కార్యాలు ఫలిస్తాయి.

వృషభం : వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా నూతనమైన ప్రణాళికలను అమలు పరచగలుగుతారు. సాంకేతిక విద్యావకాశాలు.

మిథునం: ఉపయుక్తమైన ప్రయాణాలు, చర్చలు ఫలవంతంగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త. సోదరుల కలయిక.

కర్కాటకం: వివాహాది శుభకార్యాలు ప్రయత్నం మీద సానుకూల పడతాయి. ఉపయుక్తమైన ప్రయాణాలు. వస్తువు కొనుగోలు.

సింహం: ప్రజా సంబంధాలను విస్తృత పరచుకోవడానికి గాను చేసే ప్రయత్నాలు, ప్రకటనలు లాభిస్తాయి. ప్రముఖుల కలయిక.

కన్య : సకాలంలో సందర్భోచితమైన నిర్ణయాలు తీసుకొని లాభపడతారు. చర్చలు ఫలవంతంగా సాగుతాయి. శుభవార్తలు.

తుల : మీ కృషికి తగిన ఫలితాలన్ని అందుకోగలుగుతారు. కొత్త ఋణం తీసుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

వృశ్చికం : ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. శుభవార్తా శ్రవణం చేస్తారు. పెట్టుబడులకు అనుకూలం.

ధనుస్సు : ఒక మంచి పనికి గాను విరాళాలను సేకరిస్తారు. సంప్రదింపులు జరిపేటప్పుడు మెళకువలు పాటించండి.

మకరం : సంస్థను విస్తరింప చేయడానికి గాను మీరు చేసే యత్నాలు కలిసి వస్తాయి. శుభవార్తా శ్రవణం చేస్తారు.

కుంభం : అనేకాంశాలు అనుకూలంగానే ఉన్నాయి. బహుమతులను ఇవ్వడం లేక బహుమతులను అందుకోవడం జరుగుతుంది.

మీనం : ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. కార్యాలయంలో ఉన్నతాధికారులతో జాగ్రత్తలు అవసరం. వాహన యోగం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

యువత రాజకీయాల్లోకి రావాలి

క్రీడల్లో మహిళలకు మరిన్ని అవకాశాలకే 'షీప్లే' విధానం

ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లుగా తీర్చిదిద్దుతున్నాం

భీమిలిలో ఆధునీకరించిన ఉన్నత పాఠశాలను ప్రారంభించిన మంత్రి లోకేష్, విద్యార్థులతో ముఖాముఖి

విశాఖపట్నం: ఆగస్టు 22 ప్రభాతవార్త: విశాఖ జిల్లా మధురవాడలోని చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను 'ప్రాజెక్ట్ చంద్రా'లో భాగంగా దివీస్ ల్యాబ్స్ సహకారంతో ఆధునీకరించిన అనంతరం రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆధునీకరించిన తరగతి గదులు, క్రీడా మైదానాలు, ఇతర మౌలిక వసతులను మంత్రి లోకేష్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మంత్రి లోకేష్ సరదాగా కాసేపు వాలీబాల్ ఆడారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాధారణ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు భిన్నంగా ఈసారి మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సరదాగా, స్ఫూర్తిదాయకంగా సమాధానాలు ఇచ్చారు.

విద్యార్థి ప్రశ్న: ఇంతకుముందు మీరు చూసిన చంద్రంపాలెం పాఠశాలకు, ఇప్పుడు చూస్తున్న పాఠశాలకు ఉన్న తేడా ఏంటి?

సమాధానం: చంద్రంపాలెం పాఠశాలకు నేను గతంలో రెండుసార్లు వచ్చినప్పుడూ రెండుసార్లు వర్షం పడింది. గతంలో పాఠశాల పరిసరాలు బురదమయంగా ఉండేవి. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఆధునీకరించడంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల ఇదే విధంగా అభివృద్ధి చెందాలన్నదే మా లక్ష్యం" అని అన్నారు.

ప్రశ్న: మీకు ఇష్టమైన ఆట ఏంటి? ఇప్పటికీ ఆడుతున్నారా?

సమాధానం: ప్రతి భారతీయుడిలాగే నాకు క్రికెట్ అంటే ఇష్టం. ప్రతి ఆదివారం నా కుమారుడు దేవాన్ష్‌తో కనీసం రెండు గంటలైనా క్రికెట్ ఆడతాను. అంతకుమించి ముఖ్యమంత్రి నాకు అవకాశం ఇవ్వడం లేదు" అని సరదాగా వ్యాఖ్యానించారు.

ప్రశ్న: క్రీడల్లో మహిళలకు అవకాశాలు తక్కువగా ఉన్నాయి కదా?

సమాధానం: ఇది వాస్తవమే. క్రీడల్లో మహిళలు రావడానికి అనేక అడ్డంకులు వస్తున్నాయి. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడం, పాఠశాలల్లో సరైన క్రీడా వసతులు లేకపోవడం, ఇలా ఏదైనా కావొచ్చు. మహిళలు క్రీడా రంగంలో అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. అందుకే మహిళలను క్రీడల్లో మరింతగా ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా 'షీ ప్లే' విధానాన్ని తీసుకొస్తున్నాం. చంద్రంపాలెం పాఠశాలలోనే ఇద్దరు విద్యార్థినులు బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. ఇలానే రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థినులు క్రీడా రంగంలోకి రావాలి" అని ఆకాంక్షించారు.

ప్రశ్న: రాజకీయాల్లోకి రాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారు?

సమాధానం: "2005లో చంద్రబాబు ఓడిపోయిన సమయంలో ఆయనతో కలిసి ఓ వివాహ కార్యక్రమానికి నేను వెళ్లాను. అక్కడ సుమారు 5 వేల మంది చంద్రబాబు రాగానే గౌరవంగా లేచి నిలబడటం చూశాను. ఒక వ్యక్తికి ప్రజలు ఇచ్చే గౌరవాన్ని అక్కడ ప్రత్యక్షంగా చూశాను. రాజకీయాల్లోకి రావాలని అప్పుడే నిర్ణయించుకున్నాను" అని తెలిపారు.

సమాధానం: అది సీక్రెట్ అని సరదాగా సమాధానమిచ్చిన మంత్రి. 'పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య సమయంలో ఏర్పడే స్నేహాలను జీవితంలో ఎప్పటికీ మర్చిపోకూడదు. తల్లిదండ్రుల తర్వాత స్నేహితులతోనే మన భావాలను ఎక్కువగా పంచుకుంటాం. జీవితంలో ఏ స్థాయికి వెళ్లినా మంచి స్నేహితులను మర్చిపోవద్దు. తల్లి, తండ్రి, గురువు తర్వాత స్నేహమే ముఖ్యం" అని అన్నారు.

విద్యార్థులను సరదాగా ప్రశ్నలు అడిగిన మంత్రి లోకేష్.. డాక్టర్, ఐఏఎస్, ఐపీఎస్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, సైంటిస్ట్, టీచర్, బిజినెస్‌మెన్ వంటి వృత్తుల్లోకి వెళ్లాలని ఎంతమంది కోరుకుంటున్నారో అడిగారు. అనంతరం రాజకీయాల్లోకి రావాలని ఎంతమంది కోరుకుంటున్నారని ప్రశ్నించారు. సమాజంలో తాము కోరుకునే మార్పు తీసుకురావాలంటే విద్యావంతులు, ఆలోచించే యువత పెద్దఎత్తున రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, కేవలం ఉద్యోగాల కోసం కాకుండా సమాజం, రాష్ట్రం, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

23-8Pg3exHMNWJQEGCPTKOL.qxd:23-8Pg3exHMNWJQEGCPTKOL.qxd 1/1/02 6:42 AM Page 1

మా కుటుంబంతో సాన్నిహిత్యం విడదీయరానిది

సోదరభావంతో శ్రీధర్ వర్మను ఆదరించాం

తిరుమలలో నందమూరి రామకృష్ణ భావోద్వేగం

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: నందమూరి కుటుంబంతో తిరుమల రామచంద్రరాజు కుటుంబానికి సాన్నిహిత్యం ఉందని, రక్తసంబంధంతో పుట్టక పోయినా తామంతా ఒకే కుటుంబమని నందమూరి రామకృష్ణ భావోద్వేగానికి గురయ్యారు. అనురాగం, ఆప్యాయత తన తండ్రి దివంగత ఎన్టీఆర్ నుండి ఇప్పటి శ్రీధర్‌వర్మ వరకు ఆ కుటుంబంతో సోదరభావంతో మెలగుతున్నామని తెలిపారు. శనివారం మా కుటుంబంలో ఒకరైన శ్రీధర్‌వర్మ ఎన్నికైన ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్టీ ఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఉదయం ఆలయంలోపలకు చేరుకుని వివిపి బ్రేక్ దర్శనంలో శ్రీధర్‌వర్మతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రామ చంద్రరాజుతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని తలచుకుని నం దమూరి రామకృష్ణ మనసులోని భావోద్వేగాన్ని వెలిబుచ్చారు. తిరుమల రామచంద్రరాజు కుటుంబంతో తమకున్న దశాబ్దాల నాటి అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. తాము జీవితాంతం తమ తండ్రి ఎన్టీఆర్ చూపిన బాటలోనే నడుస్తామని రామకృష్ణ పేర్కొన్నారు. అనంతరం నందమూరి కుటుంబ సభ్యులు శ్రీధర్‌వర్మను ఆత్మీయంగా అభినందించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు మంత్రి లోకేష్ అభినందనలు

విజయవాడ, ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన విజయనగరం జిల్లా, నెల్లిమర్ల మండలం, చినమ ల్లుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కౌలూరి రాజేష్‌కి హృదయ పూర్వక అభినందనలను ఏపీ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ "ఎక్స్" వేదికగా తెలిపారు. ఎఐసహాయంతో నీలివి లక్ష్యాలను సాధించడంతో పాటు, వాట్సాప్ ఆటోమేషన్ ద్వారా శిక్షణనిచ్చి వేలాది విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలలో సీట్లు సాధించేలా ప్రణాళిక బద్ధంగా పనిచేసిన మాస్టారు పాఠ్య పుస్తక రచయితగా విద్యా ప్రయాణంలో భాగమయ్యారు. ప్రభుత్వ పాఠశాల లోనే చదువుకుని, టీచరై జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం రాజేష్ అంకిత భావానికి నిదర్శనం. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా గాంధారికి చెం దిన ప్రధానోపాధ్యాయురాలు బొంపెల్లి భవాని, అండమాన్ నికోబార్ దీవుల నుంచి జెల్లి ప్రకాష్ రావుకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఎఇఇ నియామక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా నేడినుండి 27వ తేదీ వరకు జరగనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) నియామక పరీక్ష లకు సకల ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పరీక్షలు పటిష్టంగా నిర్వహించనున్న నేపథ్యంలో తిరుపతిలోని చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను శనివారం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, కంప్యూటర్ వ్యవస్థలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, భద్రతా ఏర్పాట్లను సిఎండి పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఎఇఇనియామక పరీక్షలను పారదర్శకంగా, సమర్థవం తంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలి పారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని 9 జిల్లాల్లో 34 పరీక్షా కేంద్రాల్లో ఎఇఇ నియామక పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, 36,670 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ఐదు విద్యుత్ సంస్థల్లో మొత్తం కలిపి 629 ఎఇఇ పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో మొత్తం 94 పరీక్షా కేంద్రాల్లో సుమారు 1.05 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్/హెచ్‌ఆర్ డి సిహెచ్ రామచంద్ర రావు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. చంద్రశేఖరరావు, తిరుపతిటౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి. గంగాధర్ రెడ్డి, చదలవాడఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ రాయుడు, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాదముని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంపై జగన్ అసత్యాలు

సిట్ నివేదిక, హైకోర్టు తీర్పును మాజీ సిఎం వక్రీకరించారు: ప్రభుత్వ వివరణ

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: డిజిటల్ మూల్యాంకనాన్ని హైకోర్టు తప్పుపట్టలేదన్న జగన్ వ్యాఖ్యలపైనా ఏపీ ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గ్రూప్1పరీక్షలపై సిట్ నివేదిక, హైకోర్టు తీర్పుపై అసత్యాలను జగన్ చెబుతు న్నారంటూ ఏపీ ప్రభుత్వం సమగ్ర సమాచార పత్రాన్ని విడుదల చేసింది. మాన్యువల్ మూల్యాంకనం సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరిగిందన్న జగన్ వాదనను ప్రభుత్వం ఖండించింది. మూల్యాంకనం ప్రారంభమైన 17 రోజుల తర్వాతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని సిట్ నివేదికలో పేర్కొందని తెలిపింది.మొబైల్ ఫోన్ల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లు ఫోన్లు ఉపయోగించిన ఆధారాలు సీసీటీవీ ఫుటేజీలో లభించా యని వెల్లడించింది. డిజిటల్ మూల్యాంకనాన్ని హైకోర్టు తప్పుపట్టలేదన్న జగన్ వ్యాఖ్యలపైనా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గ్రూప్1 మాన్యువల్ మూ ల్యాంకనం సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరిగిందన్న జగన్ వాదనను ప్రభు త్వం ఖండించింది. మూల్యాంకనం ప్రారంభమైన 17 రోజుల తర్వాతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని సిట్ నివేదికలో పేర్కొందని తెలిపింది. మొబైల్ ఫోన్ల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లు ఫోన్లు ఉపయోగించిన ఆధారాలు సీసీటీవీ ఫుటేజీలో లభించాయని వెల్ల డించింది. ఈ అంశాలను జగన్ కావాలనే ప్రస్తావించలేదని విమర్శించింది. 2021అక్టోబర్ 1నజస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు డిజిటల్ మూల్యాం కనాన్ని రద్దుచేసి, మూడు నెలల్లో మాన్యువల్ మూల్యాంకనం నిర్వహిం చాలని ఏపీపీఎస్సీని ఆదేశించారని తెలిపింది.అర్హత సాధించిన వారిని ఇంట ర్వ్యూలకు పిలిచి ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కోర్టు సూచిం చిందని పేర్కొంది.భవిష్యత్తులో అన్ని అనుమతులు, చట్టబద్ధమైన విధానా లతో డిజిటల్ మూల్యాంకనం నిర్వహించుకోవచ్చన్న కోర్టు అభిప్రాయాన్ని మాత్రమే జగన్ ప్రస్తుత కేసుకు వర్తింపజేస్తూ వక్రీకరించారని వివరించింది.

నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు

31న సిఎం చంద్రబాబుచే వెలిగొండ ప్రారంభోత్సవం: మంత్రి నిమ్మల

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించ నున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్ 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింపజేయబోతున్నామని ఆయన వివరించారు.వెలిగొండ నిర్వాసితులకు సం బంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడి యాతో మాట్లాడారు.ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభిం చబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు.వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్య మంత్రికి ఉన్న బాధ్యత, ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్లు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు.నిర్వాసితులకు ప్రతీ పైసా చెల్లించేలా నేను బాధ్యత తీసుకుంటాను.

శనివారం మీడియాతో మాట్లాడుతున్న జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31న ప్రారంభించి జాతికి అంకితం చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ టన్నెళ్ల నుంచి 10.5 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు విడుదల చేస్తారని చెప్పారు. వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో భాగంగా 2,027 కుటుంబాలకు రూ. 250 కోట్ల పరిహారాన్ని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అం దజేశారు. అనంతరం మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. వెలి గొండ అన్ని పనులు పూర్తి చేసి, నిర్వాసితులకు పరిహారం చెల్లించిన తర్వాతే ప్రాజెక్టును ప్రారం భిస్తామని స్పష్టంచేశారు. పూర్తికాని వెలిగొండను పూర్తయినట్లు జగన్ జాతికి అంకితం చేయడం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అని విమర్శిం చారు. వెలిగొండ ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడంతో పాటు దీనికోసం భూములిచ్చిన, ఆస్తులు కోల్పోయిన వారికి న్యాయం చెయ్య డానికి సమ ప్రాధాన్యం ఇచ్చాం. ఈ మేరకు సీఎం చంద్రబాబు సంకల్పించారు.మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వా సితులకు 3వేల కోట్లు పరిహారం అందజేశామ న్నారు. వెలిగొండ ప్రాజెక్టులో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని రామా నాయుడు హామీ ఇచ్చారు. కాగా నాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో వెలిగొండ పనులు పూర్తవ్వకుండా, జగన్ జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశాడన్నారు. ఎల్ నినో వంటి క్లిష్ట సమయం లో నల్లమల సాగర్ కు 10.7 టీఎంసీ ల కృష్ణా జలాలను తీసుకొస్తున్నా మంటే చంద్రబాబు ముందుచూ పుకి, దార్శనికతకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్ లో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది అన్నారు.ఈ కార్యక్ర మంలో మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంఛార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజె క్టు నిర్వాసితులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగుల కోసం బయోఫౌండ్రీ టాస్క్‌ఫోర్స్

కీలక కార్యాచరణకు ఎపి ప్రభుత్వం నిర్ణయం

బయాప్సీ నమూనాలను భద్రపరిచేందుకు రాష్ట్ర స్థాయిలో బయోబ్యాంక్ ఏర్పాటు

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలో క్యాన్సర్ వ్యాధి భయం కరంగా ప్రబలు తుంది. ఈ క్రమంలో క్యాన్సర్‌ను కట్టడి చేయడానికి ప్రభుత్వం కచ్చితమైన వైద్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. వ్యాధి సోకిన తర్వాత నయం చేయడం కంటే ముందే దాన్ని అంచనా వేయడంపై దృష్టి పెట్టింది. క్యాన్సరు రోగులకు కచ్చితమైన వైద్యం అందించేలా బయోఫౌండ్రీ టాస్క్‌ఫోర్స్ ను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్యాన్సర్‌ను కట్టడి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. డిజిటల్ హిస్టో పాథాలజీ, ఎలక్ట్రానిక్ రికార్డులను అనుసంధానం చేయనుంది. బయాప్సీ నమూనాలను దీర్ఘకాలం పాటు సురక్షితంగా భద్రపరిచేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక బయోబ్యాంక్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. పరిశోధనల కోసం సీఎస్ఐఆర్ ఐజీఐబీ, సీసీఎంబీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నైపుణ్యాన్ని వినియోగించుకోనుంది. వాస్తవానికి జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో క్యాన్సర్ వృద్ధి రేటు మూడింతలు ఎక్కువగా ఉండటం ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తున్న పరిస్థితి. 2020-2025 మధ్య దేశవ్యాప్తంగా క్యాన్సర్ కొత్త కేసుల్లో జాతీయ సగటు పెరుగుదల 12.8 శాతంగా ఉంది. కానీ మన రాష్ట్రంలో ఇది ఏకంగా 39.5 శాతంగా నమోదు కావడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో 4.73 లక్షల మంది క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందు తున్నారు. ప్రతి ఏడాదీ 76 వేలకు పైగా కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ మహమ్మారి కాటుకు ఏటా 40వేల మందికి పైగా బలవుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యం గా క్యాన్సర్ బాధితుల్లో 70శాతం మంది 40 నుంచి 69 ఏళ్ల మధ్య వయసున్న వారే కావడం భయాందోళనకు గురిచేస్తుంది.రాష్ట్రంలో గుర్తిం చిన మొత్తం క్యాన్సర్ కేసుల్లో 59 నుంచి 61 శాతం వరకు మహిళలే ఉన్నారు. వీరు ప్రధానంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లతో బాధపడుతున్నారు. ఇక పురుషుల విషయానికి వస్తే వారు ఎక్కువగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. పురుషుల్లో ఈ రకమైన క్యాన్సర్ల పెరుగుదల 1.7 రెట్లుగా ఉన్నట్లు రిపో ర్టులు చెబుతున్నాయి. కేన్సర్‌ను అరికట్టేందుకు తొలి దశలో భాగంగా నాలుగు నగరాల్లో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలను (సీసీసీ) నెలకొల్పింది. గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, కడప జిల్లాల్లో ఇవి అందుబాటులోకి వచ్చాయి.అలాగే రాష్ట్రవ్యాప్తంగా 17ఆంకాలజీ యూనిట్లను ప్రారంభిం చింది. 23 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ డేకేర్ కీమోథెరపీ కేంద్రాలను (డీసీసీసీ) ఏర్పాటు చేసి రోగులకు భరోసా కల్పిస్తోంది.క్యాన్సర్ వైద్యం అత్యంత ఖరీదైనది. సామాన్యులపై ఈ ఆర్థిక భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోంది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ఆంకాలజీ విభాగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఏటా రూ.746 కోట్లను క్యాన్సర్ చికిత్సల కోసమే వెచ్చిస్తోంది. మరోవైపు నివారణ చర్యల్లో భాగంగా బాలికలకు ప్రాధాన్యం ఇస్తోంది. భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 3.45 లక్షల మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలను పంపిణీ చేసి, క్యాన్సర్ కట్టడికి చర్యలు చేపట్టింది.

భవిష్యత్‌లో పరిశ్రమలకు కేరాఫ్ అనకాపల్లి

వచ్చేనెల మెదటి వారంలో అనకాపల్లికి గోదావరి నీరు

29కోట్లతో ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులు: కోడూరు సభలో సి.ఎం చంద్రబాబు భరోసా

అనకాపల్లి,ఆగస్టు22: ప్రభాత వార్త: భవిష్యత్తులో పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా అనకాపల్లి జిల్లాను తీర్చిదిద్దుతామని, అన్ని కంపెనీ లకు కేం ద్రంగా నాలెడ్జి ఎకానమీగా మారుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రకటించారు. మాడుగుల అసెంబ్లీ పరిధిలోని అలమండ కోడూరుగ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్రస్వచ్ఛాం ధ్ర కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగించారు.అనకాపల్లి జిల్లా ఎన్డీఏకి కంచుకోటగా అభివర్ణించారు.అనకాపల్లి అంటే బెల్లం ఒకటే కాదు, ఆర్సెలార్ మిట్టల్, డేటా సెంటర్లు, పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్, భవిష్యత్ లో అనకాపల్లి నెంబర్1 జిల్లాగా తీర్చి దిద్దుతామన్నారు. వచ్చే నెల మొ దటివారంలో అనకాపల్లి గోదావరి నీళ్లు తీసుకువస్తున్నామన్నారు. పోల వరంనుంచి వచ్చే నీళ్లు అనకాపల్లిలోని ప్రతి చెరువును నింపుతామన్నారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదు. స్వచ్ఛమైన ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ కూడా అన్నారు.ప్రతి నెలా 3వ శని వారం స్వచ్ఛత గురించి, సమాజ హితం కోసం పని చేయాలని పిలుపు నిచ్చారు. ఏపీలో 2047 నాటికి తలసరి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రేండేళ్లలో రాష్ట్రంలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశామన్నారు. సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి.అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి ఎం రమేష్,జిల్లా కలెక్టర్ విజయ్ కృపునన్ తదితరులు ప్రసంగించారు. మంత్రులు కొల్లి రవీంద్ర, కె.నారాయణ, రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్. స్వర్ణాంధ్ర, స్వచ్ఛభారత్ చైర్మన్ పట్టాబి తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి పార్థసారథి

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథి స్పష్టం చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తూ యువతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర పరిపాలనలో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికయ్యే అధికారుల పాత్ర అత్యంత కీలకమని ఆయన వివరించారు. శనివారం రాజధాని అమరావతిలో మంత్రి పార్థసారథి విలేకర్లతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు.గత ప్రభుత్వంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే.. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. గొడ్డలి పోటుకి, గుండె పోటుకి ఎంత తేడా ఉందో.. గత వైసీపీ ఏపీపీఎస్సీకి, నేటి కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీకి అంత తేడా ఉందంటూ ఆ పార్టీ నేతలకు చురకలంటించారు. గొడ్డలి పార్టీ తలకిందులుగా తపస్సు చేసినా మెగా డీఎస్సీలో ఒక్క అక్రమాన్ని కూడా రుజువు చేయలేదని పేర్కొన్నారు.ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలను హైకోర్టు ఎత్తి చూపినా.. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దున్నపోతు మీద వాన పడిన చందంగా మాట్లాడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. మెగా డీఎస్సీపై వందల కొద్దీ కేసులు వేసిన గొడ్డలి పార్టీ.. కోర్టుకు ఒక్క ఆధారాన్ని కూడా సమర్పించలేక పోయిందని అన్నారు. గొడ్డలి పార్టీ వేస్తున్న కేసుల వెనుక కుట్ర కోణం దాగుందని సాక్షాత్తూ హైకోర్టే మొట్టికాయలు వేసిందని చెప్పారు. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ సంస్థలంటే యువతకు గొప్ప విశ్వాసం. దేశ, రాష్ట్ర విధానాలను అమలు చేసే అత్యున్నత ఉద్యోగులను ఎంపిక చేస్తారు. విశ్వసనీయత దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా ఊరుకునేది లేదు. ఏపీపీ ఎస్సీలో జరిగిన పరీక్ష విధానం, మూల్యాంకనంపై యువత ఆలోచించాలి. పారదర్శక విధానాలు రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. గొడ్డలి పార్టీ వ్యవహరించిన తీరు వ్యవస్థలపై విశ్వాసం కోల్పోయే పరిస్థితిని తీసుకొ చ్చారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టకుండా రిసార్ట్స్‌లో పెడ తారా?. రిసార్ట్స్‌కు తీసుకెళ్లి వారికి ఇష్టమొచ్చిన వారితో మూల్యాంకనం చేయిస్తారా?" అని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు.

గృహ హింస, వరకట్న వేధింపుల కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబానికి ఊరట

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: గృహ హింస, వరకట్న వేధింపుల కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబానికి భారీ ఊరట లభించింది. జోగి రమేశ్, ఆయన కుమారుడు జోగి రాజీవ్ సహా వారి కుటుంబసభ్యులకు విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో బాధితురాలైన (మేఘన) లేదా సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ బెదిరించడం, ప్రభావితం చేయడం లేదా ప్రలోభపెట్టడం చేయకూడదని కోర్టు స్పష్టం చేసింది. విచారణాధికారి సూచించిన తేదీలు, సమయాల్లో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.

జగన్నాథపురంలో మరో భారీ డేటా సెంటర్

రూ.58,743 కోట్ల పెట్టుబడి, 1,250 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు

486 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు..

ఆనందపురం ప్రాంత అభివృద్ధికి ఊతం

విశాఖపట్నం,(ఆనందపురం,)ఆగస్టు 22, ప్రభాత వార్త: విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం చందక పంచాయతీ పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో మరో భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 486 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు హోల్డింగ్స్ ఇండియా ఎల్ఎల్‌పీ సంస్థకు 200 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.58,743 కోట్ల పెట్టుబడి రానుండగా, దాదాపు 1,250 మందికి ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతండేటా సెంటర్ ఏర్పాటు వల్ల జగన్నాథపురం, చందకతో పాటు ఆనం దపురం మండలంలోని పరిసర గ్రామాల ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకునే అవకాశం ఉంది. భారీ పెట్టుబడితో కూడిన ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. నిర్మాణ కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, భద్రతా సిబ్బంది, రవాణా, క్యాటరింగ్, నిర్వహణ తదితర సేవలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టు కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత డేటా సెంటర్ నిర్వహణ, విద్యుత్, నెట్‌వర్కింగ్, సర్వర్లు, భద్రత, సాంకేతిక సేవలు వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.మౌలిక వసతులకు మరింత ప్రాధాన్యంభారీ డేటా సెంటర్‌కు నిరంతర విద్యుత్ సరఫరా, అధునాతన రహదారులు, బలమైన టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు అవసరం. దీంతో ఈ ప్రాంతంలో రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ సదుపాయాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.విశాఖపట్నం నగరానికి సమీపంలో ఉండటం, జాతీయ రహదారి-16తో పాటు ఇతర ప్రధాన రహదారులకు అనుసంధానం ఉండటం కూడా ఈ ప్రాంతానికి అనుకూలంగా మార నుంది. డేటా సెంటర్‌తో పాటు అనుబంధ పరిశ్రమలు, ఐటీ సేవా సంస్థలు, లాజిస్టిక్స్, వాణిజ్య సంస్థలు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి.రియల్ ఎస్టేట్, వాణిజ్య రంగాలకు ప్రయోజనంభారీ ప్రాజెక్టు ఏర్పాటుతో ఉద్యోగులు, సాంకేతిక నిపుణులు, సేవా రంగ సిబ్బంది రాక పెరిగే అవకాశం ఉంది. దీంతో పరిసర ప్రాం తాల్లో ఇళ్ల అద్దెలు, వాణిజ్య స్థలాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, రిటైల్ దుకాణాలు, రవాణా సేవలకు డిమాండ్ పెరగవచ్చు. స్థానిక వ్యాపారులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.యువతకు కొత్త అవకాశాలుడేటా సెంటర్ వంటి ఆధునిక మౌలిక వసతుల ప్రాజెక్టు రావడంతో స్థానిక యువతకు ఐటీ, నెట్‌వర్కింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, సైబర్ సెక్యూరిటీ, డేటా మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి పెరగనుంది. పరిశ్రమ అవసరాలకు అను గుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తే స్థానిక యువతకు ప్రాజెక్టులోనే ఉద్యోగాలు పొందే అవకాశం మరింత పెరుగుతుంది.

నా కుటుంబీకులను దూషించినందుకే జెసి ఇంటికి వెళ్లా..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శ

అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో: నా కుటుంబీకులను దూషించించి నందుకే నాడు జెసి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లాల్సి వచ్చిందని, చీము నెత్తురు ఉన్న ఎవరైనా కుటుంబీకులను విమర్శిస్తే ఓర్చుకోలేరని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. అనంతపురం నగరంలోని తన నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తాడిపత్రిలో దొరికిన గోవా మద్యం అక్రమ సరఫరాపై వైసిపి నేతలతో ఒక కమిటీ వేయాలని జెసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతున్నారని, వైసిపి నేతలు ఎందుకు మంత్రులు పయ్యావుల కేశవ్, టిజి.భరత్, సీనియర్ నేత కాలవ శ్రీనివాసులతో ఒక కమిటీ వేయాలని, విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సూచించారు. తాడిపత్రి నియోజకవర్గంలో జరుగుతున్న అరాచ కాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్‌లు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. గోవా లిక్కర్ అక్రమ సరఫరాతోపాటు, తాడిపత్రిలో విచ్చల విడిగా జరుగుతున్న అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి అమ్మకాలు, పేకాట నిర్వహణ ఎవరి హయాంలో ఎక్కువ జరిగాయో టిడిపి కమిటీతోనే విచారణ జరిపించాలని ఆయన సూచించారు. తాడిపత్రి పోలీస్‌స్టేషన్ వద్దే అసాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నాయని, అయినా పోలీసులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రతిరోజు పోలీసు స్టేషన్ వద్దే గంజాయి సేవించి పోలీసులపైనే దాడులు చేస్తున్నారన్నారు. అసెంబ్లీ రౌడీ సినిమా తరహాలో పోలీస్‌స్టేషన్‌కు జెసి స్టేషన్ అని పేరు పెడితే సరిపోతుందని ఆయన విమర్శించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి, తన తండ్రి జెసి ప్రభాకర్‌రెడ్డిని గ్యాంగ్ స్టర్‌లా తయారు చేస్తున్నారని విమర్శించారు. వైసిపిలో 24 మంది నేతలను టార్గెట్ చేశానని, జెసి ప్రభాకర్‌రెడ్డి పదేపదే చెబుతున్నారని, వీరిలో ముగ్గురిపై దాడి చేశారన్నారు. పోలీసులు 24 మంది నేతలకు రక్షణ అయినా కల్పించాలి, లేదంటే జెసి వ్యాఖ్యలపై కేసు నమోదు అయినా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీల్లో మచ్చా దత్త రెడ్డి అర్ధ సెంచరీ

అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో: విజ యనగరంలో జరుగుతున్న సీనియర్స్ రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్ క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అర్థ సెంచరీ పూర్తి చేశారు ఆంధ్ర రంజి జట్టును ఎంపిక చేయటానికి జరుగుతున్న పోటీలలో శనివారం ఆంధ్ర డి జట్టుతోవిజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ ప్రాబ్లమ్స్ పోటీలలో మచ్చ దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో 70 పరుగులు సాధించారు. మూడు సిక్సర్లు ఎనిమిది ఫోర్లు గ్రౌండ్ నలుమూలల కొట్టారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో ఆగస్టు 31 వరకు పోటీలు జరుగుతాయి. విజయనగరంలోని నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ నందు జరుగుతున్నసీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబ్లమ్స్ క్రికెట్ పోటీలలో ఆంధ్ర ఏ జట్టుకు ఆంధ్ర డీ జట్లకు జట్ల మధ్య పోటీ ప్రారంభమైంది ఆంధ్ర బి జట్టు ఆంధ్ర సి జట్ల మధ్య మ్యాచులు ప్రారంభమయ్యాయిప్రతి మ్యాచ్ మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుంది. మొత్తం ఈ పోటీలు ఆగస్టు 31 వరకు నిర్వహిస్తారు.

బ్రహ్మాం చౌదరిని పరామర్శించిన ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎం.ఎస్.రాజు

ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బ్రహ్మాంచౌదరి

అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాదెండ్ల బ్రహ్మాం చౌదరిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్న అయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుం టున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విజయవాడలో ఉన్న ఎమ్మెల్యే లు బ్రహ్మాం చౌదరి ఇంటికి వెళ్లారు. ఆయన్ని పరామర్శించి.. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగా ఉందని బ్రహ్మాం చౌదరి తెలిపారు. మరింత విశ్రాంతి తీసుకుని, మళ్లీ మీ సేవలు ప్రారంభించాల న్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు వివిధ సమయాల్లో పార్టీ కోసం అనేక సేవలందించిన బ్రహ్మాంచౌదరి చిన్న వయసులోనే ఇలా అనారోగ్యానికి గురి కావడం బాధాకరమని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అన్నారు. దేవుని దయ వలన ఆయన త్వరగా కోలుకున్నారని, మరికొద్ది రోజుల్లో కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా తన సేవల్ని తిరిగి ప్రారంభిస్తారని వారు తెలిపారు.

23-8Pg7exHMNWJQE.qxdo/p:23-8Pg7exHMNWJQE.qxd 1/1/02 7:08 AM Page 1

ఆరుతడి పంటలకు నీరివ్వండి!

హెచ్ఎల్సీ అధికారులతో ఎమ్మెల్యే కాలవ సమీక్ష

అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో: తుంగభద్ర ఎగువ ప్రధానకాలువ (హెచ్ఎల్ఎంసీ) పరిధి లోని ఆయకట్టుకు ఆరుతడి పంటల సాగుకు నీరు అందించే అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. అనంతపురం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం హెచ్ఎల్సీ ఎస్ఈ సుధాకర్ రావు, ఈఈ శ్రీనివాస్ నాయక్ వారి సిబ్బందితో నీటి లభ్యత, అవసరాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాభావం వల్ల ఈ ఏడాది ఆరంభంలో తుంగభద్ర ప్రాజెక్టులో తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందన్నారు. దాంతో హెచ్ ఎల్ ఎం సి పరిధిలో రైతులు సకాలంలో పంటలు వేసుకోలేక పోయారని గుర్తు చేశారు. తదనంతరం వర్షాలు కురవడంతో డ్యాములో నీరు చేరుతోం దన్నారు. ప్రాజెక్టులో నీటి లభ్యత దృష్ట్యా ఈ ఏడాది హెచ్ఎల్సీకి 16 టీఎంసీల నీటి వాటా లభించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా మరో 4 టీఎంసీల నీరు అందు బాటులోకి వచ్చే అవకాశం ఉందని, తద్వారా హెచ్ఎల్సీ, హంద్రీనీవా ద్వారా మొత్తం సుమారు 20 టీఎంసీల నీరు లభించవచ్చని సూచించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నీటి లభ్యత, ఇప్పటికే జరిగిన వినియోగం, తాగునీటి అవసరాలు, నీటివృథా తదితర అంశాలపై సమగ్రంగా లెక్కలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే, మిగులు నీటిని ఆరుతడి పంటల సాగుకు వినియోగించే అవకాశాలను పునఃసమీక్షించాలని కోరారు. నీటి లభ్యత ఆధారంగాఆరుతడి పంటలకు సాగునీరు అందిస్తే తీవ్రవర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కొంత ఊరట లభిస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ రంగ సంస్థల్లో ఎఇ ఉద్యోగాల నియామక పరీక్షకు ఏర్పాటు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: విద్యుత్ రంగ సంస్థల్లో ఏఈ ఉద్యోగాల నియా మక పరీక్షకు ఏర్పాట్లు చేసామని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.మొత్తం 629 ఉద్యోగాలకు లక్షమందికిపైగా దరఖాస్తు చేసుకున్నారని రవికుమార్ తెలిపారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. పారదర్శకంగా నిర్వహిస్తున్న పరీక్షను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షలకు సంబంధించి వచ్చే దుష్ప్రచారాలు, వదంతులను ఎవరూ నమ్మొద్దు అని స్పష్టం చేసారు.ఈ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను ఎవ్వరైనా మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.అటువంటి వ్యక్తులెవ్వరైనా తమ వద్దకు వస్తే అభ్యర్ధులు వెంటనే తమకు

సమాచారం అందిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.పరీక్షలు నిర్దేశిత నిబంధనల మేరకు జరుగుతాయన్నారు.ఈ విషయంలో అభ్యర్ధులు అవగాహనతో వ్యవహరించాలన్నారు.

త్వరలో 16కోట్లతో రోడ్ల పనులు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చి (నెల్లూరు), ఆగస్టు 22, ప్రభాతవార్త : మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించిన 45 కోట్లలలో 16 కోట్ల రోడ్డు నిర్మాణాలకు కేటాయించినట్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్ లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గోన్న సందర్భంగా ఆమె మాట్లాడుతు కాజా నగర్ పార్కును వీపిఆర్ పౌండేషన్ సాయంతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. అలాగే విపిఆర్ పౌండేషన్ సాయంతో అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారు. బుచ్చిరెడ్డి పాళెం అభివృద్ధికి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించిన 45 కోట్లలో భాగంగా 16 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామని ఆమె తెలిపారు. పరిశుభ్రతను జీవన విధానంలో భాగం చేసుకోవాలని అన్నారు. నెలలో మూడోవ శనివారం మాత్రమే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గోనడంతో సరిపోదని మన ఇంటిని మన ం ఎంతో పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కాజానగర్లోని ఉర్దూ పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానిక మహిళలు తమ పిల్లలకు 9 వ తరగతి,10 వ తరగతి వరకు చదివే అవకాశం కల్పించాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డిని కోరిన వెంటనే స్పందించి అంగీకరించారని ఆమె తెలిపారు. షాది మంజిల్కి ఎంపి లాడ్స్ నుండి 15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం షాది మంజిల్ నిర్మాణానికి 50 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆమె తెలిపారు.ఈ అంశంపై న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ అబ్దుల్ దృష్టికి,వక్స్ బోర్డు చైర్మన్ అజీజ్ దృష్టికి తీసుకొని వెళ్ళినట్లు ఆమె తెలిపారు. ముందుగా ఎంపి ల్యాడ్స నుండి 15 లక్షలతో షాది మంజిల్ పనులు ప్రారంబిస్తున్నట్లు తెలిపారు. ఈలోగా ప్రభుత్వం నుండి నిదులు మంజూరు అయితే అన్ని సదుపాయాలతో పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. కోవూరు నియోజకవర్గం ప్రజలు చాలా చైతన్య వంతులు స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభు త్వాన్ని ఆదరించాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్నాయకులు కోడూరు కమలాకర్రెడ్డి,చైర్పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి , వైస్ చైర్పర్సన్ పఠాన్ నస్రీన్, వైస్ చైర్పర్సన్ యరటపల్లి శివకుమార్రెడ్డి తదితర పలువురు నాయకులు పాల్గోన్నారు.

మున్సిపాలిటీల్లో రూ.10,200 కోట్లతో రక్షిత తాగునీటి సదుపాయం: ఎపి మంత్రి నారాయణ

విశాఖపట్నం, ఆగస్టు 22 (ప్రభాతవార్త): రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పట్టణ పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రహదారులు, రక్షిత తాగునీరు, కాలువలు, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.శనివారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్కుమార్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలిసి మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.4,200 కోట్లతో యూజీడీ పనులు చేపడుతున్నామని తెలిపారు. అలాగే అమృత్ పథకం, ఇతర పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.10,200 కోట్లతో తాగునీటి పైపులైన్ పనులు కొనసాగుతున్నాయని, ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని చెప్పారు.మున్సిపాలిటీల్లో రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.5,500 కోట్లు మంజూరు చేశారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం యూజీడీ, తాగునీటి పైపులైన్ పనులు జరుగుతున్నందున, అవి పూర్తయిన వెంటనే రహదారుల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఏడాదిలోగా మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.వీఎంఆర్డీఏ పరిధిలోని నర్సీపట్నం, నెల్లిమర్ల, ఎలమంచిలి, విజయనగరం మున్సిపాలిటీల్లో యూజీడీ, డ్రైనేజీ పనులకు రూ.269 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో విజయనగరానికి రూ.194 కోట్లు, నర్సీపట్నానికి రూ.27 కోట్లు, ఎలమంచిలి, నెల్లిమర్లకు తలా రూ.24 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదనంగా రహదారుల నిర్మాణానికి మరో రూ.139 కోట్లు మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం స్థానిక సంస్థల ఆదాయాన్ని ఇతర అవసరాలకు మళ్లించిందని మంత్రి ఆరోపించారు. చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా సమస్యలు ఏర్పడ్డాయని విమర్శించారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీల రూపురేఖలు మార్చేలా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు.

జోరుగా విత్తనబంతులు వెదజల్లే కార్యక్రమం

20వేల హెక్టార్లలో 2 కోట్లకుపైగా వెదజల్లిన సీడ్ బాల్స్

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశకత్వంతో శరవేగంగా అడవుల పునరుద్ధరణ కార్యక్రమం

50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో కీలక అడుగు

అనంతపురం జిల్లాలో స్వయంగా డ్రోన్ ఆపరేట్ చేస్తూ విత్తనబంతులు వేదజల్లుతున్న మంత్రి సవిత

విజయవాడ.ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన కళ్యాణ్ 50 శాతం గ్రీన్ కవర్ సంకల్పం సాకారం దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. క్షీణించిన అడవుల పునరుద్ధరణ, పచ్చదనం పెంపొందించే లక్ష్యాలతో ఆయన ప్రారంభించిన విత్తన బంతులు(సీడ్ బాల్స) విస్తరణ కార్యక్రమం లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమం నిర్దేశిత లక్ష్యంలో 85 శాతం వరకు పూర్తయ్యింది. ఈ మేరకు డీ సీఎంవో ఒక సమాచార పత్రం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమాజాలు, ఎన్జీవోలు, వివిధ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 2.06 కోట్ల సీడ్ బాల్స్ ను వెదజల్లే ప్రక్రియ పూర్తయ్యింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు విజయవాడ(మూలపాడు) ఎకో పార్క్ లో మొదటి విత్తన బంతిని తయారు చేసారు.అదే అధికారులు, ప్రజల్లో పవన్ కళ్యాణ్ నింపిన స్ఫూర్తిగా నిలిచి 2.82 కోట్ల సీడ్ బాల్స తయారీకి బీజం వేసింది. ఉప ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా స్వదేశీ, బహుళ ప్రయోజన జాతుల వృక్షాలకు చెందిన విత్తనాలతో తయారు చేసిన సీడ్ బాల్సలో మెజారిటీ భాగాన్ని క్షీణించిన అటవీ ప్రాంతాల పునరుద్ధరణకు వినియోగించారు. ఇందుకోసం డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఇప్పటి వరకు 20,929 హెక్టార్ల విస్తీర్ణంలో సీడ్ బాల్స్ విస్తరణ ప్రక్రియను పూర్తి చేశారు. అటవీ అంచుల్లో క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది, సరిహద్దు గ్రామాల ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. అటవీ ప్రాంతాల్లో వర్షపాతం కొంత మెరుగవడంతో మానవ వనరులు అడుగుపెట్టలేని అడ వుల మధ్య ప్రాంతాల్లో వృక్ష సంపద క్షీణించిన ప్రాంతాలను డ్రోన్ల సాయంతో గుర్తించి సీడ్ బాల్స్ వెదజల్లారు. ప్రాంతాల వారీగా భౌగోళిక పరిస్థితుల అనుకూలతల ఆధారంగా విత్తనాలను ఎంపిక చేశారు. తిరుపతి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ కార్యక్రమం విస్తృతంగా కొనసాగింది. అనంతపురం జిల్లా మంత్రి సవిత స్వయంగాఇ డ్రోను ఆపరేట్ చేస్తూ విత్తన బంతులు జల్లారుఅటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది సీడ్ బాల్స్ తయారీ, రవాణా, విస్తరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సీజన్లో 3 కోట్లకు పైగా విత్తన బంతులు వెదజల్లాలన్న లక్ష్యాన్ని పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలతో అటవీ అధికారులు ముందుకు తీసుకువెళ్తున్నారు.సీడ్ బాల్స్ విస్తరణ ప్రక్రియ సరికొత్త మైలురాయిని చేరుకున్న సందర్భంగా ఇందులో భాగస్వాములైన అటవీశాఖ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరినీ పవన్ కళ్యాణ్ అభినందించారు. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో, అడవుల పునరుద్ధరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్న సీడ్ బాల్స్ విస్తరణ కార్యక్రమానికి కొనసాగింపుగా వెదజల్లిన ప్రాంతాల్లో మొలకల శాతం, మొక్కల ఎదుగుదల తదితర అంశాలపై కూడా అటవీ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సూచించారు.

ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం

రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ ఇన్చార్జ్ డిజి, డైరెక్టర్ పి.వెంకటరమణ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 22 ప్రభాతవార్త: అత్యవసర సమయాల్లో అగ్నిమాపక శాఖ ద్వారా ప్రజల ప్రాణ రక్షణ ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి.వెంకటరమణ తెలిపారు. శనివారం ఉదయం అనంతపురం జిల్లాలో క్షేత్రస్థాయిపర్యటనలో భాగంగా అనంతపురం ప్రధాన కేంద్రంలోని జిల్లా అగ్నిమాపక శాఖ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అలాగే జిల్లావ్యాప్తంగా శాఖ ద్వారా అందిస్తున్న సేవలుగురించి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పాత్రికేయ బృందంతో మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ పని తీరుపై పలు విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్క అగ్నిమాపక కేంద్రం సుమారు రూ.2.25 కోట్ల వ్యయంతో 17 కొత్త అగ్నిమాపక కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఇప్పటికే 6 దాకా భవన నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మరో 36 అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో సుమారు రూ .33 కోట్లతో 65 వాహనాలు రెండవ దశలో 58 వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే భవిష్యత్తు ప్రణాళికలు చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ. 252. 86 కోట్లతో అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో 25 అధునాతనఅగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని ముఖ్యంగా గ్రామీణ ,అటవీ ప్రాంతాల కోసం వీటి సేవలు వినియోగించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతిలోని ఉండవల్లి సీడ్ యాక్సెస్ రోడ్ వద్ద సుమారు రూ. 40 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 58 నూతన ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లాలోని కళ్యాణ్ దుర్గంలో ని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో తాత్కాలికంగా నిర్వహించబడుతున్న ప్రాంతంలో అదనంగా నూతనంగా 60 సెంట్ల స్థలంలో ఫైర్ స్టేషన్ భవనం నిర్మాణం కోసం 16వ ఆర్థిక సంఘం కింద రూ .2.25 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే గుత్తి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో 0.50 ఎకరాల భూమిని గూటి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సమకూర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమస్యలపై మంత్రులు మాట్లాడాలి

రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి

అనంతపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త బ్యూరో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రధాన సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ లీడ్ తీసుకుని సీఎం చంద్రబాబు, ఇతర ముఖ్యులతో మాట్లాడాలి. మంత్రి సవిత ఎంత సేపు చంద్ర బాబు భజనకే సరిపోతోందని, జిల్లా సమస్యలు పట్టించు కోవడం లేదు. అసెంబ్లీ సమావేశాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు కరువు పరిస్థితులపై ఎందుకు నోరు మెదపలేదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే వైసిపి సమన్వయ కర్త తోపుదుర్తి ప్రకాష్రెడ్డి ప్రశ్నించారు. శనివారం వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో కరువు పరిస్థితులు అధ్వానంగా ఉన్నా నాలుగు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో మన ఎమ్మెల్యేలు ప్రశ్నించక పోవడం బాధాకరమన్నారు. అసెంబ్లీ వేదికగా సీఎం దృష్టికి జిల్లా సమస్యలను తీసుకెళ్లే మంచి అవకాశం వచ్చినా 14 మంది ఎమ్మెల్యేలు సద్వినియోగం చేసుకోలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో యిచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు ఎన్నో అమలు చేయకపోయినా సూపర్ సిక్స్ అద్భుతంగా పని చేస్తున్నట్లు చంద్రబాబుకు వంగివంగి దండాలు పెడుతున్నారని ఆయన విమర్శించారు. సీనియర్ నాయకుడు మంత్రి పయ్యావుల కేశవ్కూడా చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తుతున్నారని ఆయన విమర్శించారు. రాజధాని అమరావతి పేరుతో అడ్డగోలుగా నిధులు ఖర్చు చేస్తున్నారని ఒక కిలోమీటరు రోడ్డు నిర్మాణానికి 150 కోట్లు ఖర్చు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. నాలుగు లైన్ల హైవే రోడు నిర్మాణానికి కిలోమీటర్కు 10 నుంచి 15 కోట్లకు మించి ఖర్చు కాదన్నారు.

తిరుపతిని డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

తిరుపతి విద్య, ఆగస్టు 22 ప్రభాతవార్త: తిరుపతిని మాదకద్రవ్యాల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్రెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్కు వ్యతిరేకంగా ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ నుంచి ప్రారంభమైన ర్యాలీ బాలాజీ కాలనీ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. వేలాది మంది విద్యార్థులు, యువత పాల్గొని డ్రగ్స్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.హేమాద్రి యాదవ్ అధ్యక్షతన, తిరుపతి జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తుడా చైర్మన్ దివాకర్రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్రెడ్డి, ఎస్వీయూ వీసీ టాటా నరసింగరావు, డీఎస్పీ భక్తవత్సలం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నా అనిత యాదవ్, ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ శంకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.భానుప్రకాష్రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని డ్రగ్స్కు పూర్తిగా దూరంగా ఉంచేందుకు విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. తుడా చైర్మన్ దివాకర్రెడ్డి మాట్లాడుతూ యువత డ్రగ్స్కు అలవాటు పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్వీయూ వీసీ టాటా నరసింగరావు మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

డీఎస్పీ భక్తవత్సలం మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నా అనిత యాదవ్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ శంకర్రెడ్డి మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ర్యాలీ అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకర్యాదవ్, ఆంధ్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్, సభ్యులు జ్యోతి ప్రకాష్, వెంకటేష్, సోముశేఖర్రెడ్డి తదితరులతో పాటు వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మవారి ఆలయంలో స్వచ్ఛత హి సేవ

గోవా సిఎంకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 22, ప్రభాతవార్త : దుర్గమ్మవారి ఆలయంలో ఈవో వీకే సీనా నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఇంద్రకీలాద్రిపై "స్వచ్ఛత హి సేవ" నిర్వహించారు. శ్రీ మల్లికార్జున మహా మండపం ఏడవ అంతస్తు నందు, రాజగోపురం ఎదురుగా ఈ ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శానిటేషన్, సెక్యూరిటీ మరియు ఆలయానికి సంబంధించిన అన్ని విభాగాల సిబ్బంది, అధికారులతో ఇఓ "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" చేయించారు. అనంతరం ఆయన సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిగా ప్రతిరోజు కొంత సమయాన్ని పరిసరాల పరిశుభ్రత కొరకు కేటాయించాలని పిలుపునిచ్చారు. శ్రమదానం ద్వారా పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ను సాధించే సంకల్పానికి కట్టుబడి ఉండాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యం కొరకు ప్రతి ఒక్కరూ గృహ మరియు సాముదాయక మరుగుదొడ్లను వినియోగించేలా, బహిరంగ మలమూత్ర విసర్జన రహిత సమాజం దిశగా అవగాహన కల్పించాలని కోరారు. సెప్టిక్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం వంటి అంశాలపై తోటివారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. దుర్గగుడికి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంలో శానిటేషన్ మరియు సెక్యూరిటీ సిబ్బంది పాత్ర కీలకమని, మన ఆంధ్రప్రదేశ్ను "స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఈవో స్పష్టం చేశారు.

దుర్గమ్మవారి సేవలో గోవా సిఎం: దుర్గమ్మవారిని శనివారం గోవా సిఎం ప్రమోద్ సావంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వికె సీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు దుర్గమ్మ వారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు.

ఇంద్రకీలాద్రి ఈవో స్కాన్నింగ్ పాయింట్ను తనిఖీ : దుర్గమ్మవారి ఆలయ ఇఓ వికె సీనా నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్కాన్నింగ్ పాయింట్ను స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విఐపి ఎంట్రీ రిజిస్టర్ ఇతర రికార్డులను ఈవో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్కాన్నింగ్ పాయింట్ ఇన్ఛార్జ్ అనురాధ కు విధులకు సంబంధించి పలు కీలక సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా నియమాల్లో భాగంగా స్కాన్నింగ్ పాయింట్ వద్ద సెల్ఫోన్ల నియంత్రణపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కృష్ణా డిస్ట్రిక్ట్ చాగంటిపాడు చెందిన ఎస్ కృష్ణ ఆంజనేయులు శనివారం రూ.1,00,011ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన: దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం"ధర్మపథం"లో విజయవాడకు చెందిన యువ కళాకారిణి నేతి రిషిత బృందం సాయంత్రం కళావేదిక పై ప్రదర్శించిన కూచిపూడి నృత్య రీతులు ఆహుతులను, అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ప్రదర్శన అనంతరం దేవస్థానం తరఫున కళాకారులకు అమ్మవారి శేషవస్త్రాలు ప్రసాదాలను అందచేశారు.

కోనలో వైభవంగా నృసింహుని కళ్యాణోత్సవం

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4,19,921లు

రాపూరు (నెల్లూరు), ఆగస్టు22, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో రెండవఋశ్రావణ శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.4,19,921 రాబడి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.1,41,151 లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.16,500 లు,నిత్య కళ్యాణం ద్వారా రూ.34,500,బ్రేక్ దర్శనం ద్వారా రూ.13,000, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.లు దేవస్థానం వసతి ద్వారా రూ. 18వేలు, తలనీలాలు 1200 మంది సమర్పించగా తద్వారా రూ.48000లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,16,895లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.18,870 లు, వడ ప్రసాదం విక్రయం ద్వారా రూ.8,880లు, వాహనాల పూజల ద్వారా రూ.1,325లు చొప్పున మొత్తం రూ.4,19,921లు రాబడి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.స్వామి వారి అన్న ప్రసాదాన్ని 1750 మంది స్వీకరించారని, సాయంత్రం 6.30 నిమిషాల వరకు మొత్తం 3150 మంది భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నట్లు వారు తెలిపారు

చెక్కుల మోసాలకు ఇక చెక్

సైబర్ నేరాలు అరికట్టేందుకు కొత్త భద్రతా ఫీచర్లు

ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌తో కొత్త చెక్‌బుక్‌లు రెడీ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: చెక్కులరూపంలో మోసాలను అరికట్టి, లావాదేవీల భద్రతను పెంచే లక్ష్యంతో బ్యాంకులు సరికొత్త చెక్ బుక్‌లను జారీ చేస్తున్నాయి. వీటిలో ఆల్ఫాన్యూమరిక్ కోడ్ అనే ప్రత్యేకమైన భద్రతా ఫీచర్‌ను జోడిస్తున్నాయి. ఇటీవల బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి పలు బ్యాంకులు తమ చెక్కులపై ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌ను ప్రవేశపెట్టాయి. పాత చెక్ బుక్‌ల స్థానంలో ఈ కొత్త సిరీస్ చెక్ బుక్‌లను తీసుకోవాలని తమ ఖాతాదారులకు సూచిస్తున్నాయి. అక్షరాలు, అంకెల కలయికతో ఉండే ఈ కోడ్, చెక్కులను క్లియరింగ్ సమయంలో సులభంగా గుర్తించి, ధ్రువీకరించడానికి సహాయపడుతుంది. తద్వారా నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన చెక్కుల ద్వారా జరిగే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని బ్యాంకులు భావిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా చెక్ ట్రంకేషన్ సిస్టమ్ ద్వారా చెక్ క్లియరింగ్ వ్యవస్థను వేగవంతం, పటిష్ఠం చేస్తోంది. ఈ విధానంలో చెక్ భౌతికంగా కాకుండా, దాని ఎలక్ట్రానిక్ ఇమేజ్ ద్వారా క్లియరింగ్ జరుగుతుంది. దీంతో సమయం ఆదా అవ్వడంతో పాటు భద్రత కూడా పెరుగుతుంది. కొన్ని రకాల పాత చెక్కులకు, ముఖ్యంగా రూ. 50,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన వాటికి 2026 డిసెంబర్ 31 చివరి గడువు అంటూ కొన్ని నివేదికలు వస్తున్నాయి. ఇది అన్ని బ్యాంకులకు వర్తించే ఆర్‌బీఐ అధికారిక గడువు కాదని ఆర్బీఐ చెపుతోంది. ప్రతి బ్యాంకుకు దాని సొంత నిబంధనలు ఉండవచ్చు. కాబట్టి, మీ పాత చెక్ బుక్ చెల్లుబాటు అవుతుందో లేదో తెలుసుకోవడానికి, మీ బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌ను చూడటం లేదా నేరుగా బ్రాంచ్‌ను సంప్రదించడం ఉత్తమమైన మార్గం.

ముఖ్యంగా వ్యాపారం, ఆస్తుల కొనుగోలు, రుణాలు వంటి అధిక విలువ కలిగిన చెల్లింపులు చేసేవారు తమ బ్యాంకు సూచనలను తప్పక పాటించాలి. మీ పాత చెక్ బుక్‌ను మార్చుకోవాలని బ్యాంకు సూచిస్తే, తదుపరి లావాదేవీకి ముందే ఆ పని పూర్తి చేయడం మంచిది. కొత్త చెక్ బుక్ ఖరీదు బ్యాంకును, ఖాతా రకాన్ని బట్టి మారుతుంది. ఉదాహరణకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవింగ్స్ ఖాతాదారులకు ఒక ఆర్థిక సంవత్సరంలో 25 చెక్ లీఫ్‌లను ఉచితంగా అందిస్తుంది. అదనపు చెక్కులకు సేవా ఛార్జీలు వర్తిస్తాయి. డిజిటల్ చెల్లింపులు పెరిగినప్పటికీ, లావాదేవీలకు పక్కా రికార్డు ఉండటం కోసం చాలామంది ఇప్పటికీ చెక్కులనే వినియోగిస్తున్నారు. చెక్కుపై రాసిన తేదీ నుంచి మూడు నెలల వరకు మాత్రమే అది చెల్లుబాటులో ఉంటుంది. ఒకవేళ చెక్ బౌన్స్ అయితే, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్1881 లోని సెక్షన్ 138 ప్రకారం చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, చెక్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండటం మంచిది.

మరో రెండు వారాల్లో జిన్‌పింగ్ అమెరికా పర్యటన

స్వయంగా వెల్లడించిన ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 22: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మరో రెండు వారాల్లో అమెరికా పర్యటనకు రానున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. పర్యటన తేదీ, సమావేశ వేదిక, చర్చల అజెండాపై ఆయన ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. దక్షిణ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ ప్రచార సభలో ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ప్రతిపాదిత బాల్‌రూమ్ నిర్మాణం గురించి మాట్లాడుతున్న సమయంలో షీ పర్యటన ప్రస్తావన తీసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న ఈస్ట్‌రూమ్‌లో కేవలం 88 మందికే చోటుందని ట్రంప్ చెప్పారు. ఎక్కువ మంది విదేశీ ప్రతినిధులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. షీ పర్యటన సమయానికే కొత్త బాల్‌రూమ్ అందుబాటులో ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. వైట్‌హౌస్ ప్రాజెక్టుకు అమెరికా సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. కొత్త సముదాయంలో డ్రోన్లు, క్షిపణుల నుంచి రక్షణ కల్పించే సైనిక సదుపాయాలు ఉంటాయని చెప్పారు. బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు, చైనా సహా పలు దేశాలపై టారిఫ్‌ల విధానాన్ని ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. అమెరికాలోనే పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా విదేశీ కంపెనీలపై ఒత్తిడి పెరిగిందని చెప్పారు. అమెరికాలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయని, కర్మాగారాల నిర్మాణం వేగంగా సాగుతోందని పేర్కొన్నారు. చైనా అమెరికా మధ్య వాణిజ్య, సాంకేతిక రంగాల్లో తీవ్ర విభేదాలు కొనసాగుతున్న వేళ షీ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఈ మందులు 4 యేళ్లలోపు పిల్లలకు వాడొద్దు

కేంద్రం అడ్వయిజరీ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: నాలుగేళ్లలోపు పిల్లలకు క్లోరిఫెనిరమైన్ మలేట్, క్లోరిఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డిసి) ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డిటిఎబి) చేసిన సిఫార్సులమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గతంలో 2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డిసి మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా, తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్లలోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

మేం చైనీయులం కాదు.. భారతీయులం

దేశంలో వైరల్ అయిన చిన్నారి వీడియో..

ఇటానగర్, ఆగస్టు 22: ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్ పూర్తిగా భారత్ భూభాగంలోనేఉంది. కానీ చైనా మాత్రం ఈ ప్రాంతం తమదే అంటూ యేళ్లుగా వ్యాఖ్యలు చేస్తూ వస్తోంది. చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తిప్పి కొడుతూ వస్తోంది. చైనా ఈ ప్రాంతాన్ని జాంగ్ వాన్ అని పిలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చైనా స్వయంగా కొత్త పేర్లు పెడుతూ వివాదాలు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ చిన్నారికి సంబంధించిన ఎమోషనల్ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఓ వ్యక్తి తనను చైనీస్ అని పిలవడంపై చిన్నారి అసంతృప్తి చెందింది. మేం చైనీయులం కాదు భారతీయులం అంటూ వీడియో పోస్టు చేసింది. ఈ నాలుగేళ్ల చిన్నారి వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన ఈ నాలుగేళ్ల చిన్నారి ఎమోషనల్ వీడియో ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజలు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న జాతి వివక్షపై మరోసారి చర్చకు తెరలేపింది. ఈ వైరల్ వీడియో ఓ వ్యక్తి ఆ చిన్నారిని నువ్వు చైనీస్‌వా అని ప్రశ్నిస్తాడు. అందుకు ఆ చిన్నారి ఏమాత్రం తడబడకుండా మేం ఇండియన్స్ చైనీస్ అని పిలిస్తే చాలా కోపం వస్తుంది బాధగా ఉంటుంది. మమ్మల్ని ఇండియన్స్ అని పిలవండి. మేం ఇటానగర్‌లో ఉంటాం అంటూ ఎమోషనల్ అయింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. చిన్నారి మాటలను పలువురు ప్రశంసిస్తున్నారు. చిన్ని యువరాణి నువ్వు ఎప్పటికీ భారతీయురాలివే. అందుకోసం నువ్వు ఎవరికి ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు అంటూ పలువురు ఆమెను ప్రశంసిస్తున్నారు. లవ్ యూ రా చిట్టితల్లి నీ దేశభక్తి సూపర్ అంటూ మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ వీడియోను బెంగాల్ టిఎంసి ఎంపీ మహువా మోయిత్రా ట్యాగ్ చేశారు. చిన్నారిపై ప్రశంసలు కురిపించారు. మై డాన్సింగ్ లిటిల్ గర్ల్ యూ ఆర్ ఇండియా నువ్ ప్యూర్ సౌల్ జై హింద్ జై మణిపూర్ అని కామెంట్ పెట్టారు. ఇక ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారిని చైనీస్, నేపాలీ లేదా ఇతర దేశాలకు చెందినవారిగా పోల్చడం ఇప్పటికీ కనిపిస్తోందని మరికొందరు నెటిజన్లు పేర్కొన్నారు.

75 దేశాలకు వీసాల నిలిపివేత కేసు

ట్రంప్‌కు కోర్టు షాక్

వాషింగ్టన్, ఆగస్టు 22: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ యేడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది.

10ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సుల్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.

'75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం.

కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారి మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంత వరకూ ఈ నిలిపివేత అమలులో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

కర్ణాటకలో అనలాగ్ పనీర్‌పై యేడాది నిషేధం

బెంగళూరు, ఆగస్టు 22: కర్ణాటకలో పనీర్ పేరుతో విక్రయిస్తున్న అనలాగ్ లేదా నాన్‌డెయిరీ పనీర్ తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, హోల్‌సేల్, రిటైల్ విక్రయాలతో పాటు అమ్మకానికి ప్రదర్శించడం, సరఫరా చేయడంపై రాష్ట్ర ఆహార భద్రత, ఔషధ పరిపాలనా శాఖ నిషేధం విధించింది. ఈ ఉత్తర్వులు ఒక యేడాది పాటు అమల్లో ఉంటాయి. పాల కొవ్వు లేదా పాల ఘనపదార్థాలను పూర్తిగా లేదా పాక్షికంగా వెజిటబుల్ ఆయిల్, వెజిటబుల్ ఫ్యాట్ లేదా ఇతర నాన్ డెయిరీ పదార్థాలతో భర్తీ చేసి పనీర్ రూపంలో తయారు చేసిన ఉత్పత్తిని అనలాగ్/నాన్‌డెయిరీ పనీర్‌గా పరిగణిస్తామని అధికారులు తెలిపారు. ఇలాంటి ఉత్పత్తులను పనీర్ పేరుతో లేబుల్ చేయడం, మార్కెట్ చేయడం, విక్రయించడం లేదా వినియోగదారులకు పనీర్‌గా చూపించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసమే కర్ణాటకలో అధికారులు పలు పనీర్ నమూనాలను పరీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. వినియోగదారులను తప్పుదారి పట్టించకుండా, ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ నిషేధం విధించినట్లు ఆహార భద్రతా శాఖ తెలిపింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్‌ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్‌అడిటివ్స్) రెగ్యులేషన్స్, 2011 ప్రకారం పనీర్‌అనేది పాలతో తయారు చేసే ప్రమాణీకరించిన ఆహార ఉత్పత్తి అని అధికారులు పేర్కొన్నారు. ఇందులో పాల కొవ్వు కీలకమైన పదార్థమని, దాని స్థానంలో వెజిటబుల్ ఆయిల్, వెజిటబుల్ ఫ్యాట్ లేదా ఇతర నాన్‌డెయిరీ పదార్థాలను ఉపయోగించడం అనుమతించబడదని తెలిపారు.

అర్హులైన ఉద్యోగుల పిఎఫ్‌కోసం ఇపిఎఫ్‌ఒ మరోఛాన్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్‌ఒ) పరిధిలోకి ఇప్పటివరకు రాని అర్హులైన ఉద్యోగులను చేర్పించేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పిస్తున్నట్టు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇందుకోసం ఉద్యోగుల నమోదు క్యాంపెయిన్ 2026ను ప్రారంభించింది. గతంలో వివిధ కారణాల వల్ల తమ ఉద్యోగులను పిఎఫ్ పథకంలో చేర్పించలేకపోయిన సంస్థలు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇపిఎఫ్‌ఒ కోరింది. స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమ తప్పులను సరిదిద్దుకునేందుకు యాజమాన్యాలకు ఇది ఒక ప్రత్యేకమైన వన్‌టైమ్ అవకాశమని స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక నమోదు క్యాంపెయిన్ ఈ యేడాది అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంటుందని కార్మిక మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వివరించింది. 2009 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్య కాలంలో పనిచేసి, పిఎఫ్ పరిధిలోకి రాని ఉద్యోగులను ఈ పథకం కింద నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రచారం కింద నమోదు చేసే ఉద్యోగులు, డిక్లరేషన్ సమర్పించే నాటికి అదే సంస్థలో ఇంకా పనిచేస్తూ ఉండటం తప్పనిసరి. ఈ ప్రచారం ద్వారా లక్షలాది మంది కార్మికులకు భవిష్య నిధి, పెన్షన్, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రచారంలో భాగంగా యాజమాన్యాలకు కొన్ని కీలకమైన సడలింపులను కూడా ఇపిఎఫ్‌ఒ ప్రకటించింది. గతంలో ఉద్యోగి జీతం నుంచి పిఎఫ్ వాటాను మినహాయించని పక్షంలో, ఇప్పుడు ఆ వాటాను చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. కేవలం యాజమాన్యం తన వాటాను, ఇతర చార్జీలను చెల్లిస్తే సరిపోతుంది. ఇది సంస్థలపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ వెసులుబాటుతో పాత బకాయిల సమస్యను సులభంగా పరిష్కరించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. యాజమాన్యాలు తాము నమోదు చేయదలిచిన ప్రతి ఉద్యోగికి ఉమాంగ్ యాప్ ద్వారా ఫేస్ అథెంటికేషన్ ఆధారిత యూఏఎన్ నంబర్‌ను జనరేట్ చేయాలి. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ చలాన్‌కమ్‌రిటర్న్ (ఇసిఆర్) ద్వారా వారి చందాలను జమ చేయాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా పూర్తవుతుంది. ఈ ప్రచారం ద్వారా సంస్థలు, కార్మికులు ఇద్దరూ ప్రయోజనం పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. చట్టబద్ధమైన సామాజిక భద్రతను కార్మికులకు అందించేందుకు ఇది ఒక నిర్మాణాత్మకమైన మార్గమని పేర్కొంది. సంస్థలన్నీ తమ పాత ఉపాధి, వేతన రికార్డు లను సమీక్షించుకుని, అర్హులైన ఉద్యోగులను గుర్తించి, గడువు తేదీ 2026 అక్టోబర్ 31లోపు వారిని తప్పనిసరిగా పీఎఫ్ పరిధిలోకి తీసుకురావాలని కార్మిక మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేసింది.

15 అడుగుల కొండచిలువకు కేన్సర్ మనుషులకు చేసే చికిత్సతో నయం చేసిన బ్రిటన్ వైద్యులు

లండన్, ఆగస్టు 22: బ్రిటన్ వైద్యులు అరుదైన వైద్యంతో ఓ కొండ చిలువకు ప్రాణంపోశారు. కేన్సర్‌తో పోరాడుతున్న 15 అడుగుల కొండచిలువకు మనుషులకు ఉపయోగించే అధునాతనచికిత్స అందించి నయం చేశారు. దవడలోని ప్రాణాంతక కణితిని తొలగించడంతోపాటు ఎలక్ట్రో కెమోథెరపీ నిర్వహించడంతో కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకుంది. ప్రస్తుతం మళ్లీ చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నట్లు బ్రిటన్‌లోని చెస్టర్ జూ వెల్లడించింది. ఇంగ్లాండ్‌లోని చెస్టర్ జూలో ఉన్న 23 యేళ్ల రెటిక్యులేటెడ్ పైథాన్ 'జోడీ ఫోస్టర్' ఇటీవల అనారోగ్యానికి గురైంది. సుమారు 50కిలోల బరువున్న ఈ కొండచిలువ కొంతకాలంగా ఆహారం తీసుకోవడం తగ్గించింది. చురుకుదనం కూడా తగ్గింది. దీంతో జూ సిబ్బంది వైద్యపరీక్షలు చేయగా.. దాని దవడలో ఫైబ్రోసార్కోమా అనే ప్రాణాంతక కేన్సర్ కణితి ఉన్నట్లు తేలింది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి కేన్సర్ కణితిని తొలగించారు. అయితే కొంతకాలానికి కేన్సర్ మళ్లీ తిరగబడింది. ఈసారి దవడతోపాటు ఎముకలోకి కూడా కేన్సర్ కణితి వ్యాపించడాన్ని వైద్యులు గుర్తించారు. దీంతో మరోసారి శస్త్రచికిత్స చేయడం మాత్రమే సరిపోదని వైద్యులు భావించారు. దానికి ఎలాంటి చికిత్స అందించాలనే దానిపై చెస్టర్ జూ వెటర్నరీ బృందం.. యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్ కేన్సర్ నిపుణులను సంప్రదించింది. అందరూ కలిసి ఎలక్ట్రోకెమోథెరపీ అనే అధునాతన వైద్య చికిత్సను కొండచిలువకు అనుగుణంగా మార్చడం ద్వారా కేన్సర్ నయం చేయవచ్చని ఒక అంచనాకు వచ్చారు. ఈ మేరకు మనుషుల్లో కేన్సర్ చికిత్సకు ఉపయోగించే ఎలక్ట్రోకెమోథరపీ విధానాన్ని తొలిసారిగా ఓ పాముపై ప్రయోగించారు.

అమెరికా కెనడాలమధ్య ట్రేడ్ వార్ ఉధృతం

2వేల కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులపై యుఎస్ టారిఫ్

టొరంటో, ఆగస్టు 22: అమెరికాకెనడా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. అమెరికాతో వాణిజ్య చర్చలను కెనడా ప్రధాని మార్క్ కార్నీ నిలిపివేశారు. చివరి దశ చర్చల్లో అమెరికా ప్రతిపాదించిన కొత్త షరతులు అన్యాయంగా, ఆర్థికంగా నష్టదాయకంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు కెనడా నుంచి వచ్చే సుమారు రెండువేల కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ విధించేందుకు అమెరికా సిద్ధమైంది. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ కెనడాకు ఇతర ప్రధాన ఎగుమతి దేశాల కంటే మెరుగైన వాణిజ్య సదుపాయాలు కల్పించేందుకు అమెరికా ముందుకొచ్చిందన్నారు. అయితే కెనడా చివరి నిమిషంలో కొత్త డిమాండ్లు చేయడంతో పాటు గతంలో ఇచ్చిన కొన్ని హామీల నుంచి వెనక్కి తగ్గిందని ఆరోపించారు. కెనడా ప్రధాని కార్నీ మాత్రం అమెరికా చివరి నిమిషంలో మార్చిన నిబంధనలు న్యాయబద్ధంగా లేవనిఅన్నారు. వాటితో ఆర్థికంగా నష్టమేనని పేర్కొన్నారు. కెనడా కార్మికులు, వ్యాపారాలకు అదనపు మద్దతు ప్రకటించనున్నట్లు తెలిపారు.

అమెరికా విధించనున్న 50శాతం టారిఫ్‌లు కెనడా నుంచి అమెరికాకు యేటా వెళ్లే మొత్తం ఎగుమతుల్లో దాదాపు 5 శాతాన్ని ప్రభావితం చేయనున్నాయి. హాకీ స్టిక్స్ నుంచి వైద్య పరికరాల వరకు పలుఉత్పత్తులపై ఈ ప్రభావం పడనుంది. చర్చలు కొనసాగేందుకు ట్రంప్ టారిఫ్ గడువును మూడు రోజులు పొడిగించినా ఒప్పందం కుదరలేదు. గత ఏడాది అమెరికాకెనడా మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 880 బిలియన్ డాలర్లకు చేరింది. కెనడా ఎగుమతుల్లో దాదాపు 72శాతం అమెరికాకే వెళ్తున్నాయి. దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య వాణిజ్య వివాదాలు ఉన్నప్పటికీ సన్నిహిత మిత్రదేశాలుగా కొనసాగాయి. అయితే కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా మార్చాలంటూ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలు, తాజాగా టారిఫ్‌ల పెంపు రెండు దేశాల సంబంధాల్లో కొత్త ఉద్రిక్తతలకు దారితీశాయి.

ఇక అన్ని ఎయిర్‌పోర్టుల్లో ఇ-బోర్డింగ్ పాస్

ప్రయాణీకులకు ఇమ్మిగ్రేషన్ కౌంటర్లవద్ద మరింత సౌలభ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: విదేశాలకు ప్రయాణించే భారతీయులకు కేంద్రం గుడ్‌న్యూస్ అందించింది. విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే సెప్టెంబర్ 1 నుంచి అంతర్జాతీయ ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద భౌతిక బోర్డింగ్ పాసులను సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. నూతన నిబంధనల ప్రకారం, ప్రయాణికులు తమ డిజిటల్ లేదా ఈబోర్డింగ్ పాస్‌లను చూపించి ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ పొందవచ్చు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న బోర్డింగ్ పాస్‌లపై ముద్రలు (స్టాంపింగ్) వేసే పద్ధతికి స్వస్తి పలకనున్నట్లు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ప్రకటించింది. ఒకవేళ ప్రయాణికుల వద్ద భౌతిక బోర్డింగ్ పాస్‌లు ఉన్నప్పటికీ వాటిని అనుమతిస్తారు, కానీ వాటిపై ఎలాంటి స్టాంపులు వేయరు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఈ మార్పు అమల్లోకి రానుందని ఢిల్లీలోని ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఒకఅంతర్గత నోట్‌లో ధృవీకరించింది. ప్రస్తుత స్టాంపింగ్ విధానంవల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురికావడంతోపాటు, అప్పుడప్పుడు ముద్రలు వేయడంలో పొరపాట్లు జరుగుతున్నాయని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ గుర్తించింది. ఈ ఇబ్బందులను అధిగమించి, ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈకొత్త నిబంధనపై విమానాశ్రయ యాజమాన్యాలు, సిఐఎస్‌ఎఫ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అన్నిభాగస్వామ్య పక్షాలను ఆదేశించింది.

సంక్షిప్త వార్తలు

ఫ్రాన్స్‌లో తొలి బిఎపిఎస్ హిందూ ఆలయం

పారిస్, ఆగస్టు 22: ఫ్రాన్స్‌లో హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ మొట్టమొదటి భారీ హిందూ దేవాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పారిస్‌లోని బుస్సీ సెయింట్‌జార్జెస్ ప్రాంతంలో బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ బీఏపీఎస్ సంస్థ నిర్మించిన ఈ స్వామినారాయణ్ హిందూ మందిరాన్ని సెప్టెంబర్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2 నుంచి 14వ తేదీ వరకు 13 రోజుల పాటు ఫెస్టివల్ ఆఫ్ కల్చర్ పేరిట ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు.

రూ.2395 కోట్లతో మరో బ్రిడ్జికి బిఎంసి గ్రీన్‌సిగ్నల్

ముంబయి, ఆగస్టు 22: మహానగరంలో ట్రాఫిక్ కష్టాలను తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేసే మరో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) శ్రీకారం చుట్టింది. నగరంలోని వెర్సోవా, మధ్ ఐలాండ్ ప్రాంతాలను కలుపుతూ మలాడ్ క్రీక్‌పై రూ. 2,395 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక కేబుల్ ఆధారిత వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ వంతెన అందుబాటులోకి వస్తే, ప్రస్తుతం 60 నుంచి 90 నిమిషాలు పట్టే ప్రయాణం కేవలం 10 నిమిషాలకు తగ్గిపోనుంది.

అజ్ఞాతంలో మసూద్ అజర్

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఆపరేషన్ సిందూర్ తర్వాత జైషే మహ్మద్ అధినేత మసూద్ అజార్ పేరుతో సాగుతున్న ప్రచారంపై భారత నిఘా సంస్థలు అప్రమత్తమయ్యాయి. అజార్ ఆరోగ్యం క్షీణించిందన్న ప్రచారం నేపథ్యంలో అతడు బహిరంగంగా కనిపించడం లేదు. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ అతడిని అజ్ఞాతంలో ఉంచినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. అజార్ బయటకు రాకపోయినా అతడి ప్రసంగాలు, తీవ్రవాద భావజాలాన్ని మాత్రం జైషే మహ్మద్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. యువతను ఆకర్షించేందుకు వాటినే ప్రధాన ఆయుధంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పిఒకెలో సంక్షోభంపై ఐరాస జోక్యం చేసుకోవాలి

లండన్, ఆగస్టు 22: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో నెలకొన్న తీవ్రమైన సంక్షోభంపై 70 మందికి పైగా బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులపై తక్షణమే దృష్టి సారించి, అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌కు వారు ఒక లేఖ రాశారు. కశ్మీర్‌పై ఏర్పాటైన ఆల్‌పార్టీ పార్లమెంటరీ గ్రూప్ ఛైర్మన్, లేబర్ పార్టీ ఎంపీ ఇమ్రాన్ హుస్సేన్ నేతృత్వంలో నిన్న ఈ లేఖను పంపించారు. పిఒకెలో హింసాత్మక ఘటనలు, మరణాలు, గాయాల గురించి తమకు నివేదికలు అందుతున్నాయని ఎంపీలు తమ లేఖలో పేర్కొన్నారు.

కర్ణాటక ఐఎఎస్ అధికారి అదృశ్యం



బెంగళూరు, ఆగస్టు 22: నగరంలోని కెంపెగౌడ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి విమానంలో బయల్దేరిన కర్ణాటక ఐఎఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్ అదృశ్యం అయ్యారు. ఈ నెల 20న అదృశ్యం అయినట్లుగా మంత్రి ప్రియాంక్ ఖర్గే శనివారం తెలిపారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వంగానీ కుటుంబ సభ్యులుగానీ ఎక్కడా కూడా అధికారికంగా ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం ఐఎఎస్ అధికారి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఇక ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

తిరుమల సమాచారం

నేటి నుంచి భగవంతుడి పవిత్రోత్సవాలు

శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల ఆలయంలో ఏడాది పొడవునా జరిగే పలు రకాల ఉత్సవాలు, కైంకర్యాలు, సేవల వల్ల తెలిసీతెలియక జరిగిన పొరబాట్లను సరిదిద్దుకునేందుకు ఉత్సవమూర్తులకు నిర్వహించే పవిత్రోత్సవాలకు శనివారం రాత్రి అంకురార్పణ చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీవారి సర్వసేనాని విశ్వక్సేనులవారిని ఆలయం నుండి ఊరేగింపుగా నైరుతిమూల ఉన్న వసంతోత్సవమండపానికి మంగళవాయిద్యాల నడుమ వేంచేపుచేశారు. అక్కడ వేదోక్తంగా పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించి పుట్టమన్ను సేకరించారు. దీంతో బీజావాహనం చేస్తారు. పవిత్రోత్సవాలు మూడురోజులు జరగనున్నాయి. ఏటా మూడు రోజుల పాటు ఆలయంలోపల కల్యాణోత్సవమండపంలో (సంపంగిప్రాకారం) జరిగే ఈ పవిత్రోత్సవాలకు ఏ రోజుకారోజు టిక్కెట్లు పొందిన గృహస్థ భక్తులను ఈ సేవకు అనుమతినిస్తారు. అయితే ఈ ఏడాది టిటిడి అధికారులు వినూత్నంగా ఆలోచన చేసి ఏకంగా పవిత్రోత్సవాల టిక్కెట్‌ను ఐదువేల రూపాయలకు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ టిక్కెట్ పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు ఆలయంలోనికి చేరుకుని ఏడుకొండల స్వామిని దర్శించుకునే భాగ్యం కల్పించారు. పవిత్రోత్సవాల టిక్కెట్లు పొంది సేవలో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో నేటి నుండి ఆయా రోజుల్లో ఉదయం 7 గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలి. భక్తులు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును చూపితే ఆలయంలోపలకు అనుమతిస్తారు.

తిరుమల భక్తజనసంద్రం

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: వరుసగా రెండురోజులు సెలవులు రావడంతో వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం ఉదయానికి భక్తులు తిరుమలకు పోటెత్తారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్రనుండి తరలిరావడంతో ఉదయానికి తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయాయి. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 10గంటలుసమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఎనిమిది గంటలు సమయం కేటాయిస్తున్నారు. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రంవరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. శుక్రవారం రాత్రి వరకు 78,057మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వకుళమాతకు ఏకవీరఫౌండేషన్ సారె

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: శ్రావణ మాసంలో శనివారం రోజు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి తల్లి వకుళమాతకి తిరుపతి నగర సంకీర్తన మండలి సభ్యులు సారే సమర్పించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీ ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీర,పండ్లతో అమ్మవారికి సారే తీసుకెళ్ళారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో అమ్మవారికి పట్టు వస్త్రాలుతో సారే సమర్పించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నగర సంకీర్తన మండలి సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీ మాట్లాడుతూ సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి తల్లి వకుళ మాతకు ప్రతి ఏడాది లాగా ఈ ఏడాది కూడా శ్రావణమాసం చివరి శనివారం సారెను సమర్పించడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కళాకారులు పలు రకాల వేషధారణతో వేసి అమ్మవారిని మొక్కుకున్నారు దర్శనం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీవారి సేవలో మాజీమంత్రి అనిల్

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవారిని శనివారం ఉద యం మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. తెలు గు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న కొండ

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: శేషాచలంకొండల్లోని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15నుండి జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఇప్పటికే తిరుమల ఆలయం పరిసరాలు గ్యాలరీలు నిర్మాణం, తాగునీటికొళాయిలు, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు మొదలయ్యాయి. తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు దేశవిదేశాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. తొమ్మిదిరోజులు జరిగే దేవదేవుని బ్రహ్మోత్సవాలకు కొండంతా సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబర్‌లో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో

నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ఆలయం శుద్ధి చేయడం(కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం) సెప్టెంబర్ 8వతేదీ మంగళవారం జరగనుంది. ఆ తరువాత వారంరోజులకు 14వతేదీ సోమవారం సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవ ఘట్టాలు మొదలవుతాయి. మరుసటిరోజు సెప్టెంబర్ 15వతేదీ మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలు మొదలుకానున్నాయి.

శ్రీవారి ఖ్యాతి ఇనుమడించేలా నాణ్యమైన ప్రసారాలు

ఎస్వీబిసి పురోభివృద్ధికి పూర్తిస్థాయి కృషి: నూతన ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రసారాలు మరింత నాణ్యతతో ఉండేలా చూస్తానని ఆ ఛానెల్ నూతన ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ తెలిపారు.. తన ఇష్టదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించేలా ఛానెల్‌లో ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు ఉండేలా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే ఎస్వీబిసి ప్రజాధరణ పొందిందని, మరింతగా ఇనుమడింపజేసేలా పనితీరు సాగిస్తానని అన్నారు. టిటిడి ఎస్వీబిసి ఛైర్మన్‌గా నియమితులైన ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆనవాయితీగా ఆలయంలోపల రంగనాయకుల మండపంలో బాధ్యతలు చేపట్టారు. ఉదయం కుటుంబంతో కలసి స్వామివారిని దర్శించుకున్న తరువాత శ్రీవారి సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రమాణస్వీకారం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న శ్రీధర్ వర్మకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శ్రీవారి పట్టువస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారి సేవలో ఎస్వీబిసిని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి

చేస్తానని అన్నారు. శ్రీధర్ వర్మ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నందమూరి కుటుంబ సభ్యులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయం వెలుపల టిటిడి అధికారులు, ఎస్వీబిసి సిబ్బంది, పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతిలోని ఎస్వీబిసి కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, తిరుపతి రూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి ,రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. కూటమి నేతలు వర్మని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు రుచికరమైన ఆహారపదార్థాలు

గరుడసేవ రోజు 15 రకాలు తయారీకి ప్రణాళికలు

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:'నభూ తో నభవిష్యతి"అనే చందంగా కలియుగవైకుంఠం తిరుమలలో తొమ్మిదిరోజుల పాటు వేంకటేశ్వర స్వామికి జరిపించే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఆకలి అనేది తెలియకుండా మాఢవీధుల్లోని గ్యాలరీల్లో రుచికరంగా ఆహారపదార్థాలు అందించేలా టిటిడి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉదయం,రాత్రి వేళల్లో తొమ్మిది రోజులు రోజుకు రెండు వాహనసేవలు జరుగుతాయి. వాహనసేవల్లో పాల్గొని ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు భారీగా భక్తులు దేశం నలుమూలల నుండి తరలిరావడం పరిపాటి. వచ్చిన ప్రతి భక్తునికి సంతోషకరంగా వాహనసేవల వీక్షణతోబాటు అన్నప్రసాదాలు అందించడం కూడా టిటిడి అంతేప్రాధాన్యతనిస్తుంది. మరీ ముఖ్యంగా ఐదవరోజు జరిగే గరుడసేవకు ఆ రోజు ఉదయం నుండే భక్తులు లక్షలాదిమంది గ్యాలరీల్లోనే గంటల తరబడి కూర్చుని నిరీక్షిస్తుంటారు. అర్ధరాత్రి దాటేవరకు భక్తులు ఎండైనా,వానైనా చలించకుండా గరుడునిపై వేంచేసే మలయప్పస్వామి దర్శనానికి భక్తితో ఆసక్తిచూపుతుంటారు. ఇలా ఉంటున్న లక్షలాదిమంది

భక్తులకు ఆరోజు నిరంతరాయంగా ఉదయం నుండి అర్ధరాత్రి వరకు పలురకాల అన్నప్రసాదాలు, ప్రత్యేక ప్రసాదాలు తయారుచేసి అందించడం జరుగుతుంది.

సాధారణరోజుల్లో వాహనసేవల ఆరంభానికి ముందు గంటరెండుగంటలు గ్యాలరీల్లో ఉంటారు. గరుడసేవకు మాత్రం ఏకంగా 12నుండి 14గంటలపైగా నిరీక్షించడం జరుగుతుంది. ఇలా భక్తులను దృష్టిలో ఉంచుకుని టిటిడి అధికారులు కూడా చక్కటి ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది. ఈ ఏడాది అధిక మాసం రావడంతో తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబర్ 15వ తేదీన సాలకట్ల బ్రహ్మోత్సాలు ఆరంభమోతాయి. అక్టోబర్ 12న నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా నాణ్యతలో రాజీ పడకుండా రుచికరమైన అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు చక్కటి ప్లానింగ్‌తో ఉన్నారు. తొలి బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 19న శనివారం రోజు జరగనున్న గరుడ వాహనం రోజున అధిక మంది భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లుతో బాటు 15 రకాల మెనూలను భక్తులకు తయారుచేసి అందించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా మరిన్ని వంటశాలల ఏర్పాటు చేయడానికి కూడా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమా మిళ్ళ వెంకయ్యచౌదరి, ఇతర అధికారులు ఈ విషయాలపై తలమునకల య్యారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు 10 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్‌గా పెట్టుకోవాలని అధికారులు నిర్ణయించారు.

'సర్'లో ఈ నాలుగైదు రోజులే కీలకం

ఓటర్ల జాబితా సవరణలపై అప్రమత్తంగా ఉండాలి

అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చూసుకోవాలి: సజ్జల

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. ప్రాంతీయ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంట్ సమన్వయకర్తలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్లమెంట్ పరిశీలకులు, రాష్ట్ర స్థాయి సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న నేతలు, అసెంబ్లీ పరిశీలకులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యంతరాలు, క్లెయిమ్స్ దాఖలు చేసేందుకు నెలాఖరు వరకు చాలా తక్కువ సమ యం మాత్రమే ఉన్నందున పార్టీ యంత్రాంగం వేగంగా పనిచేయాలని స్పష్టం చేశారు. గత నాలుగైదు నెలలుగా బూత్

స్థాయిలో బీఎల్ఏలు చురుకుగా పనిచేయడం వల్ల అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవడంలో మంచి పురోగతి సాధించామని చెప్పారు. ఓటర్ల సంఖ్య 4.16కోట్ల నుంచి 3.71 కోట్లకు తగ్గిన నేపథ్యంలో తొలగింపులకు సంబంధించిన వివరాలను పార్టీ శ్రేణులు నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఇప్పటికే వచ్చిన 44 లక్షల నోటీసుల్లో అనుమానాస్పద అంశాలను గుర్తించి, ప్రతి ఓటు స్థాయిలో పరిశీలన జరపడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పార్టీ స్థాయిలో ప్రత్యేకంగా గుర్తించిన సుమారు 17.29 లక్షల అనుమానాస్పద డూప్లికేట్ ఓట్లను బూత్ స్థాయిలో పరిశీలించాలని సజ్జల తెలిపారు. ఒకే పేరుకు లేదా ఇతర వివరాలకు దగ్గరగా ఉన్న ఓటర్లు వాస్తవంగా ఒకరేనా, వేర్వేరు వ్యక్తులా అనే అంశాన్ని బీఎల్ఏలు స్థానికంగా నిర్ధారించాలని సూచించారు. ఆగస్టు 27, 28 తేదీల నాటికి ప్రధాన ప్రక్రియను పూర్తి చేసి, నెలాఖరు చివరి రెండు రోజుల్లో తుది పరిశీలనకు అవకాశం ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఆగస్టు 30 తర్వాత అవకాశాలు పరిమితమవుతాయని, అందువల్ల ప్రస్తుతం ఉన్న సమయాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. కాగా పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆగస్టు 25న కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో ఎన్నికల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. రాబోయే కొద్దిరోజులు పార్టీకి చెందిన సిబ్బంది, సహాయకులు, నియోజకవర్గ స్థాయి బాధ్యతలు నిర్వహి స్తున్న వారికి స్పష్టమైన టార్గెట్లు కేటాయించి పూర్తి స్థాయిలో ఈ కార్యక్ర మంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడగా, అనంతరం శ్రీ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

చిరంజీవికి సిఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు శుభాకాంక్షలు

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: మాజీ కేంద్రమంత్రి, ప్రముఖ నటుడు, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. చిరంజీవి సినీ రంగంలో సాధించిన విజయాలను, ఆయన సామాజిక సేవను చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు."ప్రముఖ చలనచిత్ర నటుడు, కేంద్ర మాజీ మంత్రి, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు. 1978లో తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టి అంచెలంచెలుగా ఎదిగి ఎనలేని కీర్తి ప్రతిష్టలను, ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుని మెగాస్టార్‌గా నిలిచారు" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు.అంతేకాకుండా, చిరంజీవి సామాజిక స్పృహను కూడా చంద్రబాబు ప్రశంసించారు. "రక్తనిధి, నేత్ర నిధి ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకుని సమాజం పట్ల తన బాధ్యతను నెరవేరుస్తున్నారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, సినీ ప్రేక్షకులను మరింతగా అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రస్తుతం సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు చిరంజీవికి సోషల్

మీడియా ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

డి.సిఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

మాజీ కేంద్రమంత్రి,మెగా స్టార్ చిరంజీవికి ఏపీ డీసీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన "ఎక్స్"లో భావోద్వేగ పోస్టు పెట్టారు.అందరికీ చిరంజీవ మెగాస్టార్ అయితే తనకు మాత్రం ఏకైక హీరో అని పవన్ తన పోస్టులో కొనియాడారు. ప్రస్తుతం ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాలేజీ చదువు కోసం అన్నయ్య ఇంటికి దూరంగా ఉన్నారు. వేసవి సెలవులకు ఆయన ఇంటికి రావడం మాకు ఒక పండగలా ఉండేది. తిరిగి కాలేజీకి వెళ్లేటప్పుడు ఎంతో బాధపడే వాళ్లం. ఆయన మళ్లీ సెలవులకు వచ్చే వరకు ఇంట్లో ఆ సందడి ఉండేది కాదు. నేను స్కూల్లో చదివే రోజుల్లో అన్నయ్య పక్కన నడవడం కూడా నాకు గర్వంగా ఉండేది. ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి పక్కన నడుస్తున్నానని భావించే వాడిని. ఆయన హీరో కాకముందే నాకు హీరో. నేను ఆయనకు అభిమానిని. షూటింగ్‌ల కోసం ఇతర దేశాలు వెళ్లినప్పుడు ఎన్నో బహుమతులు తెచ్చేవాడు. ఎప్పుడూ మా సంతోషాన్నే కోరుకుంటాడు అని పవన్ పేర్కొన్నారు.అన్నయ్యకు పెళ్లి అయినప్పుడు ఎక్కడ మాకు దూరమవుతారేమోనని భయపడి ఒక గదిలో నిశ్శబ్దంగా ఏడ్చాను. అప్పుడు ఆయన వదినను నా దగ్గరకు తీసుకువచ్చి,"ఇలా రా ఈరోజు నీకు ఒక పెద్ద మనిషిని పరిచయం చేస్తాను" అన్నారు. నేను ఎందుకు ఏడుస్తున్నానో చూసి వాళ్లిద్దరూ నవ్వుకున్నారు. అప్పటి నుంచి వాళ్లిద్దరూ నాపై చూపిస్తున్న ప్రేమను చెప్పడానికి నాకు పదాలు సరిపోవు. అన్నయ్య ఎన్నోసార్లు షూటింగ్‌లలో గాయపడ్డాడు. చెన్నై వేడి, ఉక్కపోతలో 18 గంటల కష్టపడి పనిచేసి అర్ధరాత్రి నిలబడటానికి కూడా ఓపిక లేని స్థితిలో ఇంటికి వచ్చేవాడు. ఆయన కష్టంపై ఆధారపడి బతుకుతున్నందుకు అప్పుడు చాలా బాధపడేవాడిని. ఎప్పుడూ నన్ను ఒక్కమాట కూడా అనలేదు. నాకు ఆయన మాత్రమే హీరో అంటూ చిరంజీవికి విషెస్ చెప్పారు.

గుడివాడలో నాలుగేళ్ల దామిని అదృశ్యం

విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి: కృష్ణా జిల్లా గుడివాడలో నాలుగేళ్ల పాప దామిని అదృశ్యం అయ్యింది. పాప అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఘటన పట్టణంలో సంచలనంగా మారింది. దామిని తల్లిదండ్రులు వలస కార్మికులు.వారు కూలి పనులు చేసుకుంటారు.వారు పనికి వెళ్ళిన సమయంలో పాప అదృశ్యమైనట్లు సమాచారం.అయితే పెద్దకాలువ సెంటర్‌లో పనికి వెళ్లిన తల్లి వద్దకు పాప ఒంటరిగా వెళ్లినట్లు గుర్తించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు 10లక్షలురూపాయలు విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన బండి సత్యనారాయణ శనివారం వేంకటేశ్వర అన్న ప్రసాదంట్రస్టుకు 10లక్షలు విరాళం చెక్కును దాత టిటిడి ఛైర్మన్ బీ.ఆర్.నాయుడుకు అందజేశారు.

బైక్‌ను ఢీకొన్న ఐచర్: ఇద్దరు యువకులు మృతి

తుగ్గలి,ఆగస్టు 22,ప్రభాతవార్త: తుగ్గలి మండలం జొన్నగిరి పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. జొన్నగిరి సమీపంలోని ఎర్రమన్ను

గుట్ట మలుపు వద్ద ప్రధాన రహదారిపై రాత్రి బైకును ఐచర్ వాహనం ఢీ కొట్టడంతో మదనంతపురం గ్రామానికి చెందిన యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుగ్గలి వైపు నుంచి ఏపి39యుజె 9771నంబరు గల ఐచర్ వాహనం జొన్నగిరి వైపు బైక్‌పై వెళ్తున్న యువకులను వేగంగా ఢీ కొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు రోడ్డుపై బలంగా పడడంతో తల తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. ప్రమాదాన్ని స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందన్నారు. గిరిగెట్ల మహేంద్ర (22) చికిత్స పొందుతు మృతి చెందగా హనుమరాజు బాలరాజు(20) పరిస్థితి కూడా విషమంగా ఉండడం వలన మెరుగైన చికిత్స నిమిత్త ం అనంతపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరుయువకులు మృతి చెందడంతో మదనాంతపురం గ్రామంలో విషాచాయలు అలుముకున్నాయి. మృతునితమ్ముడు గిరిగెట్ల మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. ద్విచక్ర వాహనాదారులు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించి వేగాన్ని నియంత్రిస్తూ వాహనాలు నడపాలని ఎస్సై సూచించారు.

తుంగభద్ర నదిలో తల్లి, కుమార్తె గల్లంతు

కౌతాళం, ఆగస్టు 22, ప్రభాత వార్త: హంపి సమీపంలోని తుంగభద్ర నదిలో ప్రమా దవశాత్తు కాలుజారి పడి కౌతాళం మండలం సులేకేరి గ్రామానికి చెందిన తల్లి, కుమార్తె గల్లంతయ్యారు. గ్రామానికి చెం దిన షాహీన్ (38), ఆమె కుమార్తె యాస్మీన్ (13) బంధువులతో కలిసి హంపి పర్యటనకు వెళ్లారు. పర్యటనలో భాగంగా తుంగభద్ర నది ఒడ్డున వంట చేసుకుని భోజనం చేసిన అనంతరం తల్లి, కుమార్తె స్నానానికి నదిలోకి దిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి ఇద్దరూ నీటిలో గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విష యం తెలుసుకున్న బంధువులు, స్థానికులు వెంటనే గాలింపు చర్యలు చేప ట్టారు. సమాచారం అందుకున్న అధికారులు కూడా గల్లంతైన తల్లి మృతి దేహం లభ్యం కాగా, కుమార్తె కోసం గాలింపు చర్యలు కొన సాగిస్తున్నట్లు సమాచారం. తల్లి, కుమార్తె గల్లంతైన విషయం తెలియడంతో సులేకేరి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధు వులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

వివాహ బంధం వెలకట్టలేనిది:సిఎం చంద్రబాబు

ఎమ్మెల్యే కోళ్ల కుమార్తెను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి

విజయనగరం(శృంగవరపుకోట), ఆగస్టు 22, ప్రభాతవార్త: వివాహ బంధం వెలకట్టలేనిదని నూతన జీవితాన్ని ప్రశాంతంగా సాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. శనివారం ఎస్.కోట నియోజకవర్గం లకవరపుకోటలోని ఎమ్మెల్యే కోళ్ల నివాసంలో కోళ్ల లలితకుమారి, కోళ్ల అప్పల రాంప్రసాద్ దంపతుల కుమార్తె వివాహ వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.ఈ

సందర్భంగా ఆమెను చంద్రబాబు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అయితే కోళ్ల కుమార్తెకుఈనెల 27వ తేదీన వివాహం జరగనున్న నేపథ్యంలో సీఎంకు అదే తేదీన పలు ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందున శనివారం అనకాపల్లి,విశాఖ జిల్లాల్లో జరిగిన పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం ఎమ్మెల్యే కోళ్ల లకవరపుకోట మండలం పిల్లాగ్రహారంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగి భారీ కాన్వాయ్ ద్వారా సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే కోళ్ల నివాసానికి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి,ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.హెలిప్యాడ్ నుంచి ఎమ్మెల్యే కోళ్ల నివాసం వరకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు వస్తున్నారని తెలియడంతో హెలిప్యాడ్ నుంచి ఎమ్మెల్యే కోళ్ల నివాసం వరకు ఒకపక్క వర్షం పడుతున్నప్పటికీ దారి పొడుగునా రోడ్డుకిరువైపులా ప్రజలు,టీడీపీ శ్రేణులు నిలుచుని ఘనంగా స్వాగతం పలికారు. మొత్తం మీద ఎమ్మెల్యే కోళ్ల కుమార్తె వివాహ వేడుకలకు సీఎం రాకతో కోళ్ల నివాసం వద్ద పెద్ద ఎత్తున పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున జిల్లా స్థాయి అధికారులు,టీడీపీ నాయకులు, పిఏసీఎస్ చైర్మన్‌లు, వివిధ దేవాలయాల ట్రస్టు బోర్డు చైర్మన్‌లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ శ్వేతా ఘోష్ మృతి

రేణిగుంట/తిరుపతిక్రైమ్,ఆగస్టు 22ప్రభాతవార్త: తమిళనాడు చెన్నైలోని అమీంజికరైలో ఈ నెల 13న నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శ్వేతా ఘోష్ (35) చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్ర గాయాలతో చెన్నైలోని ఎంజీఎం ప్రైవేట్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆమెను మెరుగైన వైద్యం కోసం రెండురోజుల క్రిందట తిరుపతిలోని అమర హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 21న రాత్రి 9 గంటలకు మృతి చెందినట్లు సమాచారం. ఈ ఫెర్టిలిటీ సెంటర్ జేడీ నెల్లూరు టిడిపి ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు చెందినదిగా పేర్కొంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని రుయా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. చెన్నై అమీంజికరై పోలీసులు ఇప్పటికే క్రైమ్ నంబర్ 42/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫెర్టిలిటీ సెంటర్‌లోని సీసీటీవీ ఫుటేజీతో పాటు సంబంధిత బిల్లింగ్ రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. శ్వేతా ఘోష్ ఆత్మహత్యాయత్నానికి దారితీసిన అసలు కారణాలు, బిల్లింగ్ వివాదం నేపథ్యంలో ఆమెపై ఎవరైనా ఒత్తిడి లేదా బెదిరింపులకు పాల్పడ్డారా అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్వేతా ఘోష్ మృతితో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

విశాఖకు సీఎం చంద్రబాబు..

హెలిప్యాడ్ వద్ద 'గంటా' ఘన స్వాగతం

విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త : విశాఖపట్నం పర్యటనకు శనివారం విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి హెలిప్యాడ్ వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని సాదరంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ళు అనేదే

తమ సిద్ధాంతం

- సమాజంలో మార్పు కోసం విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి రావాలి
- క్రీడల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు 'షీ ప్లే' విధానం
- ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి లోకేష్
- భీమిలిలో దివీస్ ల్యాబ్ సహకారంతో ఆధునీకరించిన జడ్పీ ఉన్నత పాఠశాలను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్
- విద్యార్థులతో మంత్రి నారా లోకేష్ ముఖాముఖి.. సరదాగా వాలీబాల్ ఆట

విశాఖపట్నం, ఆగస్టు 22 ప్రభాతవార్త : మధురవాడలోని చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను 'ప్రాజెక్ట్ చంద్రా'లో భాగంగా దివీస్ ల్యాబ్స్ సహకారంతో ఆధునీకరించిన అనంతరం రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా పాఠశాలకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆధునీకరించిన తరగతి గదులు, క్రీడా మైదానాలు, ఇతర మౌలిక వసతులను మంత్రి లోకేష్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మంత్రి లోకేష్ సరదాగా కాసేపు వాలీబాల్ ఆడారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులతో ప్రత్యేక ముఖాముఖి..

సాధారణ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు భిన్నంగా ఈసారి మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సరదాగా, స్ఫూర్తిదాయకంగా సమాధానాలు ఇచ్చారు. డాక్టర్, ఐఏఎస్, ఐపీఎస్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, సైంటిస్ట్, టీచర్, బిజినెస్‌మెన్ వంటి వృత్తుల్లోకి వెళ్లాలని ఎంతమంది కోరుకుంటున్నారో అడిగారు. అనంతరం రాజకీయాల్లోకి రావాలని ఎంత మంది కోరుకుంటున్నారని ప్రశ్నించారు. సమాజంలో తాము కోరుకునే మార్పు తీసుకురావాలంటే విద్యావంతులు, ఆలోచించే యువత పెద్దఎత్తున రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. రాజకీయాలు కేవలం పదవులు, ఎన్నికలకు పరిమితం కాదని, ప్రజల జీవితం, సమాజ భవిష్యత్తును ప్రభావితం చేసే కీలకమైన వేదిక (తరువాయి 8వ పేజీలో)

భవిష్యత్‌లో పరిశ్రమలకు

కేరాఫ్ అడ్రస్‌గా అనకాపల్లి

- వచ్చే నెల మెదటి వారంలో అనకాపల్లికి గోదావరి నీరు
- రైవాడ ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు, తాగునీరు అందిస్తాం
- 29 కోట్లతో ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులు
- కోడూరు సభలో సీఎం చంద్రబాబు భరోసా

అనకాపల్లి, ఆగస్టు 22, ప్రభాత వార్త : భవిష్యత్తులో పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా అనకాపల్లి జిల్లాను తీర్చిదిద్దుతామని, అన్ని కంపెనీలకు కేంద్రంగా నాలెడ్జి ఎకానమీగా మారుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మాడుగుల అసెంబ్లీ పరిధిలోని అలమండ కోడూరు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (తరువాయి 8వ పేజీలో)

ఇంటింటా నెట్ జీరో.. ఆదర్శ గ్రామాలే లక్ష్యం

ఇంటి నుంచే పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

మాడుగుల, ఆగస్టు 22, ప్రభాత వార్త : పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చి గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నెట్‌జీరో గ్రామాల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు అన్నా రు. ఇంటి స్థాయి నుంచి కాలనీ, గ్రామ స్థాయి వరకు పర్యావరణహిత (తరువాయి 8వ పేజీలో)

విశాఖ కేంద్రంగా

బ్రిక్స్ క్రీడా బంధం

- అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా విశాఖ
- బ్రిక్స్ దేశాలతో క్రీడా భాగస్వామ్యానికి ఏపీ సిద్ధం: సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త: బ్రిక్స్ దేశాల యువజన, క్రీడా మంత్రుల సమావేశా లకు విశాఖ వేదికైంది. బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం విశాఖలో స్వాగతం పలికారు. విశాఖ భారత తూర్పు తీరాన దేశానికే ఆభరణమని, సిటీ ఆఫ్ డెస్టినీగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతోందని పేర్కొన్నారు. ఉద్యోగాలు, ప్రతిభకు విశాఖను దేశంలోనే అగ్రగామి నగరంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లో విశాఖ ముందంజలో ఉందన్నారు. మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీ-ఇన్నోవేషన్ హబ్‌గా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విశాఖకు సుదీర్ఘ తీరప్రాం తం ఉండటంతో వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరిజానికి అపార అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు అన్నారు. విశాఖను అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రపంచ స్థాయి క్రీడా ఈవెంట్ల నిర్వహణతో పెట్టుబడులు, ఉపాధి అవకాశా లను పెంచుతామని తెలిపారు. క్రీడలు కేవలం పోటీ మాత్రమే కాదని, అవి సంస్కృతి, జీవన విధానంలో భాగమని సీఎం పేర్కొన్నారు. భాష, సంస్కృతి, భౌగోళి కంగా భిన్నమైన ప్పటికీ క్రీడల (తరువాయి 8వ పేజీలో)

చైనా క్రీడా బృందం విశాఖలో సందడి!

- వీఎంసీ స్పోర్ట్స్ ఎరేనాలో యువ క్రీడాకారులతో మమేకం
- క్రీడా మౌలిక వసతులపై ప్రశంసలు
- భారత్-చైనా క్రీడా సహకారంపై ఆకాంక్ష

విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త : అంతర్జాతీయ బ్రిక్స్ కార్యక్రమాల నేపథ్యంలో విశాఖకు వచ్చిన చైనా ఉన్నత స్థాయి క్రీడా ప్రతినిధి బృందం ఎంవిపి కాలనీలో బన్న జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరేనాను శనివారం సందర్శించింది. చైనా జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ స్పోర్ట్ వైస్ మినిస్టర్ కుయ్ జియాన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందానికి జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైనా ప్రతినిధులు యువ క్రీడాకారులు, విద్యార్థులతో మమేకమై (తరువాయి 8వ పేజీలో)

తొట్లకొండలో బ్రిక్స్ మంత్రుల సందడి..

మెక్కలు నాటిన బ్రిక్స్ దేశాల ప్రతినిధులు... బౌద్ధ వారసత్వానికి ప్రశంసలు

విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త : బ్రిక్స్ దేశాల రెండు రోజుల యువజన, క్రీడా మంత్రుల సదస్సులో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవీయతో పాటు 11 బ్రిక్స్ దేశాల మంత్రులు, ప్రతినిధులు శనివారం విశాఖలోని ప్రముఖ బౌద్ధ వారసత్వ పర్యాటక ప్రాంతం తొట్లకొండను సందర్శించారు తొట్లకొండకు (తరువాయి 8వ పేజీలో)

జీవో 161తో జీవీఎంసీ మినిస్టీరియల్ సిబ్బందికి ఊరట

- జోనల్, మల్టీ జోనల్ బదిలీలకు తెర..
- కమిషనర్ పరిధిలోనే బదిలీలు, పదోన్నతులు

విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త : జీవో 135ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 161ను జారీ చేయడంపై జీవీఎంసీ మినిస్టీరియల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టి లో పెట్టుకుని (తరువాయి 8వ పేజీలో)

జగన్నాథపురంలో

మరో భారీ డేటా సెంటర్ ఏర్పాటు

రూ.58,743 కోట్ల పెట్టుబడి.. 1,250 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు

486 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు.. ఆనందపురం ప్రాంత అభివృద్ధికి ఊతం

ఆనందపురం, ఆగస్ట్ 22, ప్రభాతవార్త: విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం చందక పంచాయతీ పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో మరో భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 486 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు హోల్డింగ్స్ ఇండియా ఎల్‌ఎల్‌పీ సంస్థకు 200 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.58,743 కోట్ల పెట్టుబడి రానుండగా, దాదాపు 1,250 మందికి ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం

డేటా సెంటర్ ఏర్పాటు వల్ల జగన్నాథపురం, చందకతో పాటు ఆనందపురం మండలంలోని పరిసర గ్రామాల ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకునే అవకాశం ఉంది. భారీ పెట్టుబడితో కూడిన ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. నిర్మాణ కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, భద్రతా సిబ్బంది, రవాణా, క్యాటరింగ్, నిర్వహణ తదితర సేవలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టు కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత డేటా సెంటర్ నిర్వహణ, విద్యుత్, నెట్‌వర్కింగ్, సర్వర్లు, భద్రత, సాంకేతిక సేవలు వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన యువ తకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

మౌలిక వసతులకు మరింత ప్రాధాన్యం

భారీ డేటా సెంటర్‌కు నిరంతర విద్యుత్ సరఫరా, అధునాతన రహదారులు, బలమైన టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు అవసరం. దీంతో ఈ ప్రాం తంలో రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూ నికేషన్ సదుపాయాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. విశాఖపట్నం (తరువాయి 8వ పేజీలో)

వీఎంఆర్‌డీఏ పగ్గాలు చేపట్టిన

కేతన్ గార్గ్

- జీవీఎంసీ కమిషనర్‌కే పూర్తి అదనపు బాధ్యతలు
- ప్రభుత్వ ఉత్తర్వులతో ఇన్‌ఛార్జి మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరణ

12లో

మున్సిపాలిటీల్లో మౌలిక వసతులకు

[illegible]

- రూ.10,200 కోట్లతో రక్షిత తాగునీరు.. రూ.5,500 కోట్లతో రహదారులు
- యూజీడీకి రూ.4,200 కోట్లు.. ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని మంత్రి నారాయణ ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త : రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రక్షిత తాగునీరు, రహదారులు, కాలువలు, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజీ వంటి సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోం దన్నారు. శనివారం నగరంలోని వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో కలిసి మంత్రి నారాయణ మున్సిపాలిటీల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. నర్సీపట్నం, విజయనగరం, నెల్లిమర్ల, ఎలమంచిలి మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న, చేపట్టాల్సిన పనులపై (తరువాయి 8వ పేజీలో)



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి స్వాగతం పలుకుతున్న కూటమి నేతలు, అధికారులు

ప్రభాతవార్త - విశాఖపట్నం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనస్వాగతం పలికిన కూటమి నేతలు, అధికారులు

అనకాపల్లి, ఆగస్టు 22, ప్రభాత వార్త :

స్వర్ణాంధ్ర స్వచ్ఛాఆంధ్ర కార్యక్రమములో పాల్గొనేందుకు శనివారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి అనకాపల్లి జిల్లా కె-కోటపాడు మండలం, ఏ-కోడూరు గ్రామంలో హెలికాప్టర్ ద్వారా 10-52 నిమిషాలకు చేరుకున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు, ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, చోడవరం శాసన సభ్యులు కె.ఎస్.ఎన్ రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, జిల్లా, మండల నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలికారు.



జీవో 161తో జీవీఎంసీ మినిస్టీరియల్ సిబ్బందికి ఊరట

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయా నికి కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద అభినందన సభ నిర్వహించారు.
జీవో 161 జారీకి కృషి చేసిన ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను ఏపీ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే సవరణ జీవో వెలువడిందని పేర్కొన్నారు.
ఇకపై జీవీఎంసీ మినిస్టీరియల్ సిబ్బందికి జోనల్, మల్టీ జోనల్ బదిలీల సమస్య ఉండదని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. జీవీఎంసీ పరిధిలోనే బదిలీలు, పదోన్నతులు కొనసాగుతాయని, తమ ఉద్యోగ వ్యవహారాల్లో జీవీఎంసీ కమిషనరే పూర్తి అధికార పరిధి కలిగిన అధికారిగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ విశాఖ చైర్మన్ సత్తి నాగేశ్వర్‌రెడ్డి, వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు, జీవీఎంసీ ఏఐటీయూసీ అధ్యక్షుడు పడాల రమణ, సీఐటీయూ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి రవి, జీవీఎంసీ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. అప్పలనాయుడు, సన్నీ, ఉమెన్ సెక్రటరీ సుబ్బలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మజ, లంకా రాంప్రసాద్, వి. శ్రీనివాసరావు, రాజేష్, జగన్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. జీవో 161 జారీకి సహకరించిన ప్రభుత్వం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నేతలు, మీడియాకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్నాథపురంలో మరో భారీ డేటా సెంటర్ ఏర్పాటు

(7వ పేజీ తరువాయి)

నగరానికి సమీపంలో ఉండటం, జాతీయ రహదారి--16తో పాటు ఇతర ప్రధాన రహదారులకు అనుసంధానం ఉండటం కూడా ఈ ప్రాంతానికి అనుకూలంగా మారనుంది. డేటా సెంటర్‌తో పాటు అనుబంధ పరిశ్రమలు, ఐటీ సేవా సంస్థలు, లాజిస్టిక్స్, వాణిజ్య సంస్థలు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి.

రియల్ ఎస్టేట్, వాణిజ్య రంగాలకు ప్రయోజనం

భారీ ప్రాజెక్టు ఏర్పాటుతో ఉద్యోగులు, సాంకేతిక నిపుణులు, సేవా రంగ సిబ్బంది రాక పెరిగే అవకాశం ఉంది. దీంతో పరిసర ప్రాంతాల్లో ఇళ్ల అద్దెలు, వాణిజ్య స్థలాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, రిటైల్ దుకాణాలు, రవాణా సేవలకు డిమాండ్ పెరగవచ్చు. స్థానిక వ్యాపారులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

యువతకు కొత్త అవకాశాలు

డేటా సెంటర్ వంటి ఆధునిక మౌలిక వసతుల ప్రాజెక్టు రావడంతో స్థానిక యువతకు ఐటీ, నెట్‌వర్కింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, సైబర్ సెక్యూరిటీ, డేటా మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి పెరగనుంది. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తే స్థానిక యువతకు ప్రాజెక్టులోనే ఉద్యోగాలు పొందే అవకాశం మరింత పెరుగుతుంది.

తొట్లకొండలో బ్రిక్స్ మంత్రుల సందడి..

(7వ పేజీ తరువాయి)

చేరుకున్న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయతో పాటు వివిధ దేశాల ప్రతినిధులు మొక్కలు నాటారు. అనంతరం మంత్రులు, ప్రతినిధులు తొట్లకొండలోని మహాస్థూపం, బావులు, పాకశాల, ధ్యాన కేంద్రాలతో పాటు పురావస్తు అవశేషా లను పరిశీలించారు. తొట్లకొండ చారిత్రక, బౌద్ధ ప్రాధాన్యతలను గైడ్ వారికి వివరించారు. అప్పటి బౌద్ధ జీవన విధానం, ఆ కాలం నాటి నిర్మాణాలు, పురావస్తు విశేషాలపై ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. తొట్లకొండను సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి మన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. భారతదేశపు గొప్ప బౌద్ధ వారసత్వం ప్రపంచానికి ఎంతో ముఖ్యమైనదని, తొట్లకొండ వంటి చారిత్రక ప్రదేశాలు భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నాయని అన్నారు. అంతకుముందు విశాఖపట్నంలోని ర్యాడిసన్ బ్లూ రిసార్ట్లో జరిగిన బ్రిక్స్ దేశాల యువజన, క్రీడా మంత్రుల సమావేశాలకు కేంద్ర మంత్రి డా. మన్సుఖ్ మాండవీయ, కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే హాజరయ్యారు. వివిధ దేశాల నుంచి వచ్చిన మంత్రులు, ప్రతినిధులకు వారు స్వాగతం పలికారు.

చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరం

ఆనందపురం, ఆగస్టు 22, ప్రభాతవార్త:

మెగాస్టార్ కొణిదెల చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని భీమిలి చిరంజీవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నారై జనరల్ హాస్పిటల్ సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు పాలు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.
కార్యక్రమంలో జనసేన నాయకుడు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ పంచకర్ల సందీప్, చిరంజీవి సీనియర్ అభిమాని హేచ్చర్ల హరి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్, జనసేన 3వ వార్డు అధ్యక్షుడు అక్రమాని దివాకర్, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమి రామస్వామి నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ళు అనేదే తమ సిద్ధాంతం

(7వ పేజీ తరువాయి)

అని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు సమకాలీన అంశాలు, ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు, దేశ అభివృద్ధి, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, కేవలం ఉద్యోగాల కోసం కాకుండా సమాజం, రాష్ట్రం, దేశ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమాధానాలు కూడా చెప్పారు. అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంత్రి నారాయణ , మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ని కలిశాను అని చెప్పారు. అప్పుడు వారు నాకు ఒక ముఖ్యమైన సలహా ఇచ్చారు. ప్రతి పాఠశాలలో ప్రాథమిక తరగతులకు 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానాన్ని తీసుకువస్తే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. వారి సూచనను పరిగణనలోకి తీసుకుని ఆ విధానాన్ని అమలు చేశాం అని అన్నారు. ప్రస్తుతం 10 వేల పాఠశాలల్లో 'వన్ క్లాస్ - వన్ టీచర్' విధానం అమల్లో ఉంది" అని తెలిపారు.

దివీస్ ల్యాబ్స్‌కు మంత్రి లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు

చంద్రంపాలెం పాఠశాలను ఆధునీకరించేందుకు పిలుపునిచ్చిన వెంటనే.. ఖర్చు ఎంత అవుతుందనే ఆలోచన చేయకుండా ముందుకు వచ్చి పాఠశాలను ఇంత అద్భుతంగా అభివృద్ధి చేసిన దివీస్ ల్యాబ్స్ డైరెక్టర్ నీలిమకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వంతో కలిసి విద్యారంగ అభివృద్ధికి దివీస్ ల్యాబ్స్ అందించిన సహకారం అభినందనీయమన్నారు.
కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వీఎంఆర్డీఏచైర్మన్ ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఐఏఎస్, దివీస్ ల్యాబ్ సిబ్బంది, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా అనకాపల్లి

(7వ పేజీ తరువాయి)

అనకాపల్లి జిల్లా ఎన్డీఏకి కంచుకోటగా అభివర్ణించారు. అనకాపల్లి అంటే బెల్లం ఒకటే కాదు, ఆర్సెలార్ మిట్టల్, డేటా సెంటర్లు, పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్ అని, భవిష్యత్‌లో అనకాపల్లి నెంబర్ 1 జిల్లాగా తీర్చిదిద్దుతా మన్నారు. ఉత్తరాంధ్రకు మణిహారంగా ఏఎస్‌ఆర్ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ఆశలకు, కలలకు రెక్కలు తొడుగుతుందన్నారు. దేశంలో మొదటి సారి క్వాంటం కంప్యూటింగ్ మన రాష్ట్రానికి తీసుకురావడం గర్వకారణమన్నారు.
వచ్చే నెల మొదటివారంలో అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకువస్తున్నామన్నారు. పోలవరం నుంచి వచ్చే నీటితో అనకాపల్లి లోని ప్రతి చెరువును నింపుతామన్నారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదు. స్వచ్ఛమైన ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ కూడా అన్నారు. ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛత గురించి, సమాజ హితం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ఇళ్లు, రోడ్లు, పరిసరాలు అన్నీ మనవే అన్న భావనలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇక్కడి ధర్మ కోనేరును పునరుద్ధరించినందుకు గ్రామస్తులను అభినందించారు. మన ఊరు-మన బాధ్యత సంకల్పం అందరూ తీసుకోవాలని కోరారు. మన ఇల్లు, వీధి, కార్యాలయం, స్కూల్, మార్కెట్ వంటి అన్నీ పరిశుభ్రంగా తయారవ్వాలి. అప్పుడే స్వచ్ఛమైన పర్యావరణం ఉంటుందని, 2047 నాటికి దేశం అగ్రదేశంగా వికసిత్ భారత్‌గా మారుతుందని, ఏపీ కూడా 2047 నాటికి తలసరి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.
ప్రతి గ్రామం జీరో వేస్ట్ గ్రామంగా మారాలని, ఉత్పత్తి అయ్యే ప్రతి వ్యర్థాన్ని నిర్వహించాలని అన్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశామన్నారు. గత ప్రభుత్వంలో గుట్టలు గుట్టలుగా చెత్తను పోగేసేవారని, దీంతో వర్షం పడిన సమయంలో భూగర్భ జలాలు కలుషితం అయ్యేవని అన్నారు.
చెత్త నుంచి సంపద సృష్టించడం అంటే ఆశ్చర్యంగా చూశారు. చెత్తనుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నాం.
స్వచ్ఛ రథాలు పెట్టి ఊరూరా పంపి వేస్ట్ తీసుకుని నిత్యవసర సరుకులు అందిస్తున్నామన్నారు. గత పాలకులు రోడ్లు కూడా వేయలేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్ల రూపు రేఖలు మార్చామని అన్నారు. ప్రజలు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సిఎంరమేష్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తదితరులు ప్రసంగించారు. మంత్రులు కొల్లి రవీంద్ర, కె.నారాయణ, రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్. స్వర్ణాంధ్ర, స్వచ్ఛభారత్ చైర్మన్ పట్టాభి తదితరులు పాల్గొన్నారు

ఇంటింటా నెట్‌జీరో... ఆదర్శ గ్రామాలే లక్ష్యం

(7వ పేజీ తరువాయి)

విధానాలను అమలు చేస్తూ.. క్రమంగా గ్రామాలను నెట్‌జీరో కమ్యూనిటీలుగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలవరం కోడూరులో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నెట్‌జీరో కార్యక్రమా లను పరిశీలించారు. నెట్‌జీరో గ్రామంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, సాధిస్తున్న లక్ష్యాలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్రమైన వంట విధానాలు, తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ, మురుగునీటి నిర్వహణ వంటి చర్యల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు గ్రామాల ను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దు తున్నట్లు తెలిపారు.

వంటింటి వ్యర్థాలే సేంద్రియ ఎరువులు

నెట్‌జీరో కార్యక్రమాలను అమలు చేస్తున్న జె. మహేశ్వరరావు నివాసాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. మహేశ్వరరావు, ఆయన సతీమణి ఇంట్లో చేపడుతున్న పర్యావరణ హిత కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్టింగ్ గుంతల్లో వేస్తూ.. అక్కడికక్కడే సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని సీఎంకు చూపించారు. ఇలా ఇంట వండే తడి వ్యర్థాలను ఎరువుగా మార్చడం వల్ల ఎరువుల కొనుగోలు ఖర్చు తగ్గుదలతో పాటు వ్యర్థాల సేకరణ, రవాణా, నిర్వహణకు అయ్యే శ్రమ కూడా తగ్గుతుందని వివరించారు. వ్యర్థాన్ని సమస్యగా కాకుండా వనరుగా మార్చే ఈ విధానం గ్రామాల్లో విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారం

ఇంటి నుంచి వెలువడే మురుగునీటిని రోడ్లపైకి వదలకుండా నిర్దేశిత గుంతల్లోకి మళ్లించే ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని కూడా సీఎం పరిశీలించారు. దీంతో కాలనీ రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా చూడటంతో పాటు దోమలు, ఈగల వృద్ధిని నియంత్రించవచ్చని లబ్ధిదారు వివరించారు. ఈ విధానం ద్వారా నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పును తగ్గించడంతో పాటు కుటుంబాలకు, చుట్టుపక్కల ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేలా ఇంట్లో ఏర్పాటు చేసిన ఇండక్షన్ స్టవ్ పనితీరును కూడా లబ్ధిదారు ముఖ్యమంత్రికి వివరించారు. దీపం పథకం కింద ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నప్పటికీ.. ఇండక్షన్ స్టవ్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించడం ద్వారా గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఇండక్షన్‌తో వంట వేగంగా, పరిశుభ్రంగా ఉండటంతో పాటు గ్యాస్ సిలిండర్ల వినియోగం తగ్గుతుందని వివరించారు. అనంతరం ఇంటిపై ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌ను సీఎం పరిశీలించారు. సౌర విద్యుత్‌తోనే ఇండక్షన్ స్టవ్‌ను వినియోగించడం ద్వారా అదనపు విద్యుత్ వ్యయాన్ని కూడా తగ్గించుకోవచ్చని లబ్ధిదారులు తెలిపారు. అనంతరం లబ్ధిదారు కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సెల్ఫీ దిగారు.

ఘనంగా 'మానవతా' శాంతి ర్యాలీ

గాజువాక,ఆగష్టు 22,ప్రభాతవార్త :

మానవతా స్వచ్ఛంద సంస్థ గాజువాక, కూర్మన్నపాలెం, ఉక్కునగరం, పారిశ్రామిక ప్రాంత శాఖల ఉమ్మడి ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ సిహెచ్. వాసు నాయుడు శనివారం జెండా ఊపి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయి విద్యానికేతన్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, విశ్వశాంతిపై చేసిన నినాదాలు ఆకట్టుకున్నాయి.
ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు డి. కృష్ణంరాజు మాట్లాడుతూ 2004లో వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి నాటిన బీజం నేడు విస్తరించిందన్నారు. జిల్లాలోని

11 శాఖల ద్వారా అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నామని, త్వరలోనే మరో 4 శాఖలు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 144 శాఖలు, 115 శాంతి రథాల ద్వారా 95 వేల మందికి పైగా సహాయం అందించినట్లు తెలిపారు.
సీఐ వాసు నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, సోషల్ మీడియా వ్యామోహంలో పడకుండా చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు దేనం కొండ కృష్ణంరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రమాదేవి, పొలిమేర శ్రీనివాస్, కె. గురుమూర్తి, లక్ష్మణ్, నాగుల రవికుమార్, డి.వి. ప్రసాద్ రావు, పడగల శ్రీనివాసరావు, టి. రవి కిషోర్, ఉపాధ్యాయులు, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ కేంద్రంగా బ్రిక్స్ క్రీడా బంధం

(7వ పేజీ తరువాయి)

ద్వారా బ్రిక్స్ దేశాల మధ్య స్నేహం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. యువత లో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు, యోగా, ధ్యానం భారతీయ జీవన విధానంలో కీలకమని చెప్పారు. ఏపీలో స్టేట్ అకాడమీలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో సమగ్ర క్రీడా వ్యవస్థను ఏర్పాటు చేస్తు న్నామని చంద్రబాబు తెలిపారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కేంద్రంగా పూర్తి స్థాయి స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, నెల్లూరు కేంద్రంగా క్రీడా పరికరాలు, దుస్తులు, సాంకేతిక ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యువజన, క్రీడా ఆవిష్కరణల నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తున్నట్లు సీఎం తెలిపారు. బ్రిక్స్ దేశాల అథ్లెట్లు, కోచ్‌లు, ట్రైనర్ల పరస్పర మార్పిడితో పాటు వాటర్ స్పోర్ట్స్, అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లు, స్పోర్ట్స్ టూరిజంలో పెట్టుబడులకు ఏపీ స్వాగతం పలుకుతుందని స్పష్టం చేశారు. నైపుణ్యం కలిగిన యువత, ఆధునిక సాంకేతిక వ్యవస్థ, సుదీర్ఘ తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న బలాలని, వీటిని క్రీడారంగ అభివృద్ధికి అనుసం ధానించి ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు తెలిపారు.

చైనా క్రీడా బృందం విశాఖలో సందడి!

(7వ పేజీ తరువాయి)

వారి శిక్షణ, ప్రతిభాభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ముచ్చటించి బహుమతులు అందజేశారు. గ్రామీణ, క్షేత్రస్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలు, వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్న పోటీలు, క్రీడాకారులకు కల్పిస్తున్న అవకాశాలను అధికారులు వివరించారు. క్రీడలంటే కేవలం ప్రత్యర్థిని ఓడించడం మాత్రమే కాదని, తనను తాను అధిగమిస్తూ నిరంతరం మెరుగుపరుచుకోవడం, అపజయాల నుంచి తిరిగి నిలబడే ధైర్యాన్ని పెంపొందించుకోవడం కూడా క్రీడా స్ఫూర్తిలో భాగమని కుయ్ జియాన్ యువ క్రీడాకారులకు సూచించారు. భారత్--చైనా మధ్య క్రీడా రంగంలో పరస్పర సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం స్పోర్ట్స్ అరేనాలోని జిమ్నాజియం, స్విమ్మింగ్ పూల్ తదితర సదుపాయాలను ప్రతినిధులు పరిశీలించారు. బ్యాడ్మింటన్ కోర్టును అవసరానికి అనుగుణంగా బాస్కెట్‌బాల్ కోర్టుగా మార్చగల ఆధునిక మల్టీపర్పస్ సాంకేతిక వ్యవస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది.
స్నేహం, సాంస్కృతిక మార్పిడికి గుర్తుగా చైనా ప్రతినిధి బృందం 'రెడ్ హార్స్' చిత్రంతో కూడిన జ్ఞాపికను అందజేసింది. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య క్రీడా రంగంలో అనుభవాల మార్పిడికి, సహకారానికి మరింత బలం చేకూర్చిందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జాన్ జూలియట్, జీవీఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ కె. శివ ప్రసాద్, స్పోర్ట్స్ డైరెక్టర్ ఈ. అప్పలరాజు, సహాయ వైద్యాధికారి బి. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో మౌలిక వసతులకు భారీ నిధులు

(7వ పేజీ తరువాయి)

అధికారులతో చర్చించారు. అమృత్ పథకం, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.10,200 కోట్లతో తాగునీటి పైపులైన్ పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.4,200 కోట్లతో యూజీడీ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.
మున్సిపాలిటీల్లో రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.5,500 కోట్లు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ప్రస్తుతం యూజీడీ, తాగునీటి పైపులైన్ పనులు కొనసాగుతున్నాయని, అవి పూర్తయిన వెంటనే రహదారుల పనులు చేపడతామని చెప్పారు. ఏడాదిలోగా అన్ని రకాల మౌలిక వసతుల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వీఎంఆర్‌డీఏ పరిధిలోని మున్సిపాలిటీల్లో యూజీడీ, డ్రైనేజీ పనులకు రూ.269 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఎలమంచిలికి రూ.24 కోట్లు, నెల్లిమర్లకు రూ.24 కోట్లు, నర్సీపట్నానికి రూ.27 కోట్లు, విజయనగరానికి రూ.194 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రహదారుల నిర్మాణానికి మరో రూ.139 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరగా, వాటిని కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.
చెత్త నిర్వహణపై మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెత్త సమస్యను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని చెప్పారు.
ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.10 నుంచి రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. శివారు కాలనీల్లో మౌలిక వసతుల కోసం రూ.7 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ నెల్లిమర్లకు యూజీడీ కింద రూ.24 కోట్లు, వీఎంఆర్‌డీఏ/హెచ్‌ఏఎం ద్వారా మరో రూ.20 కోట్లు కేటాయించారని తెలిపారు. శిథిలావస్థకు చేరిన పైపులైన్ల మార్పునకు రూ.46 కోట్లు, అమృత్ పథకం కింద మరో రూ.2.6 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. సమీక్షలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి కె.మురళీకృష్ణ, సీఈ వినయ్‌కుమార్, అదనపు కార్యదర్శి రుషిబాబు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత మున్సిపాలిటీల అధికారులు పాల్గొన్నారు.

కుంతీమాధవస్వామి ఆలయ సింహ ద్వారం వద్ద రోడ్డుపై పారుతున్న మురుగునీరు

పద్మనాభం, ఆగస్టు 22, ప్రభాతవార్త :

పద్మనాభంలో అనంతుని గిరి దిగువన వేంచేసియున్న కుంతీమాధవస్వామి ఆలయ సింహ ద్వారం వద్ద ఉన్న రోడ్డుపై మురుగునీరు పారడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.గత రెండు వారాలు నుండి రోడ్డుపై ఇలాగున మురికినీరు ఉన్నా గ్రామ సచివాలయ,ఆలయ అధికారులు పట్టించుకోలేదని భక్తులు మండిపడుతున్నారు.ఇళ్లల నుండి తాము శుద్ధి,శుభ్రతగా వచ్చి ఈ మురికినీరులో దిగి ఆలయంలోకి వెళ్లవలసి వస్తుందని భక్తులు వాపోతున్నారు.అలాగే వాహనాలపై వచ్చిని భక్తులపై ఈ మురికినీరు తుల్లుతుందని భక్తులు చెప్పారు. ఇప్పటికైనా గ్రామ సచివాలయ, ఆలయ అధికారులు స్పందించి ఆలయ సింహ ద్వారం వద్ద మురికినీరు పారకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

vsp9:vsp9.qxd 22-08-2026 21:12 Page 1

పాడేరు ప్రభుత్వ వైద్యకళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వీరపాండ్యన్

పాడేరు,ఆగస్టు22,ప్రభాతవార్త:

జిల్లా వైద్య కళాశాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి వీరపాండ్యన్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధనను అందించాలని, మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లెక్చరర్ హాల్ 1,2 లను సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య సిబ్బంది లెవనెత్తిన జీజీహెచ్, ఎంసిహెచ్ ఆసుపత్రులను వైద్య కళాశాల ప్రాంగణంకు తరలించు ప్రక్రియను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిషాంతి.టి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, జిల్లా ఇంచార్జ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం రియాజ్ బేగ్, పాడేరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కళాశాల సూపరిడెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రోగులకు సేవలు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వీరపాండ్యన్

అరకులోయ, ఆగస్టు 21 ప్రభాతవార్త :

ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని డిజిటలైజ్ చేస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని, ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి ఆరోగ్య వివరాలను డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయడం జరుగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జి వీర పాండ్యన్ వెల్లడించారు. శనివారం ఉదయం అరకులోయ మండలం, గన్నెల పంచాయతీ, గన్నెల పిహెచ్‌సిను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పీ హెచ్ సి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ నిషాంతి . టి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ లతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాటులను పరిశీలించి, స్వర్ణ గ్రామ సచివాలయ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించి, నిర్వహణ ఏర్పాట్లను ప్రతి ఒక్క విషయాన్ని దగ్గర్గను, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు, తగు సూచనలు సలహాలను అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వినూత్న ప్రక్రియలో భాగంగా డిజిటల్ చేసిన కార్యక్రమాన్ని గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి శక్తి వైద్య సమాచారం,రోగుల గత చరిత్ర, మందుల వివరాలు, మందుల లభ్యత, డాక్టర్ నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలు డిజిటల్ విధానంలో అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు మరింత సమర్థవంతంగా సేవలు అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ రీజినల్ డైరెక్టర్ దుర్గాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీ, రెవెన్యూ డివిజనల్ అధికారి భుజంగరావు, జిల్లా వైద్యారోగ్య అధికారి , వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ,పిడి డ్వామా, పిడి డిఆర్డిఏ, అటవీశాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జిల్లా మండల స్థాయి అధికారులు, రెవెన్యూ వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఆరోగ్యకరమైన జీవనానికి పరిసరాల పరిశుభ్రత ఎంతో దోహదం చేస్తుందని వీర పాండ్యన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ నిషాంతి.టి, జేసీ తిరుమాని శ్రీ పూజ, పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మతో కలిసి సంయుక్తంగా ఎస్ఏఎస్ఏ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసన

పాడేరు,ఆగస్టు22,ప్రభాతవార్త:

ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ జూనియర్ యూనియన్ డాక్టర్స్ అసోషియేషన్ (ఏపీ జేయుడిఎ)లో భాగంగా ఇతర కాలేజీల్లో నిరసన చేస్తున్న వైద్యులకు సంఘీభావం, ఐక్యతను తెలియజేస్తూ సమ్మెను తాను కొనసాగిస్తున్నామని పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వైదేహి పేర్కొన్నారు.శనివారం జూనియర్ డాక్టర్ల డిమాండ్ల ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలంటూ పాడేరులో కురుస్తూ ఉన్నా వర్షంలో తడుస్తూ జిల్లా ఆస్పత్రి ఎదుట డా.వైదేహి ప్లకార్డు పట్టుకొని నిరసన తెలిపాటు.జూనియర్ డాక్టర్ల డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె మద్దతుగా మా నిరసనను కొనసాగిస్తామనీ డాక్టర్ వైదేహి స్పష్టం చేసారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు దృష్టిసారించండి

జిల్లా విద్యాశాఖ అధికారి భానుమూర్తి రాజు

డుంబ్రిగుడ, ఆగస్టు 22, ప్రభాతవార్త:

విద్యార్థిని విద్యార్థుల్లోఅభ్యసన సామార్థ్యాల పెంపుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి భానుమూర్తి రాజు చెప్పారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో పాఠశాలల్లో విద్యాబోధన, చిన్నారుల ప్రగతిపై సమీక్షించారు. సమయపాలన పాటిస్తూ విధులు చేపట్టాలన్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. పాఠశాలల నివేదికను ఎప్పటికప్పుడు పొందు పరచాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 గెన్ను, ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణారావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ హీరో స్వర్గీయ ఘట్టమనేని కృష్ణ విగ్రహావిష్కరణ

పాడేరు,ఆగస్టు22,ప్రభాతవార్త:

మార్కాపురం జిల్లా ఆల్ వెన్నంపల్లె, గిద్దలూరులో ప్రముఖ హీరో స్వర్గీయ ఘట్టమనేని కృష్ణ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఇండియా సూపర్ స్టార్ కృష్ణ మహేశ్ బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు అభిమానుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో ఇండియా సూపర్ స్టార్ కృష్ణ మహేశ్ బాబు చారి ట్రస్ట్‌చైర్మన్ శ్రీనివాస రెడ్డి , రాష్ట్ర అధ్యక్షులు సుధాస్వామి, ప్రముఖ సినీ డైరెక్టర్ బాబ్జి,3వ అభిమానుల ఆత్మీయ సదస్సు లో సీనియర్ అభిమానులు బల్ల రమణ, అల్లూరి జిల్లా ప్రతినిధి కొట్టగుల్లి రామారావు, ఎం. సునీత, ఎం. శ్రీనివాస రావు ,మల్లికార్జునరావు, నవీన్ కుమార్, కాశీరెడ్డి, ఫ్యాన్స్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలి

డుంబ్రిగుడ, ఆగస్టు 22, ప్రభాతవార్త:

జూనియర్ కళాశాలలో నెలకొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యహరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవన్ కృష్ణ, కార్తీక్, శ్రీను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ బృందం శనివారం సందర్శించింది. ఇక్కడి సమస్యలను గిరిజన విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ల్యాబ్ గదులు లేవన్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారంలో ఉన్నత అధికారులకు నివేదించకుండా బాధ్యత రహితంగా వ్యవహరిసున్న ప్రిన్సిపల్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నిమ్మలపాలెం మెట్టవీధిలో తాగునీటి కష్టాలు

- సమస్య పరిష్కరించాలని గ్రామస్తుల వేడుకోలు

గూడెంకొత్తవీధి,ఆగస్టు 22, ప్రభాతవార్త :

సంకాడ పంచాయతీ పరిధిలోని నిమ్మలపాలెం మెట్టవీధి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. గ్రామంలో సుమారు పది కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కొళాయిలకు సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాగునీటి కోసం సుమారు కిలోమీటరు దూరంలోని ఊట గెడ్డ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పంట పొలాల గట్లపై నుంచి నడుచుకుంటూ నీరు తెచ్చుకోవాల్సి రావడంతో గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్నిసార్లు గట్లపై కాలుజారి పడిపోతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని వాపోతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, గత్యంతరం లేక బురద నీటినే తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. తాగునీటి కోసం ఎక్కువ సమయం వెచ్చించాల్సి రావడంతో ఇంటి పనులు, వంట పనులు సక్రమంగా చేసుకోలేకపోవడంతో పాటు వ్యవసాయ పనులకు సకాలంలో వెళ్లలేకపోతున్నామని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలోని కొళాయిలకు సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు నిమ్మలపాలెం మెట్టవీధి గ్రామానికి శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పి.వి.టి.జి. గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరం

గూడెంకొత్తవీధి ,ఆగస్టు 22, ప్రభాతవార్త :

గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గృహ నిర్మాణాలు, మౌలిక వసతుల పరిస్థితిని తెలుసుకునేందుకు జి.కె.వీధి మండలంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించినట్లు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వంతల దేవదాసు తెలిపారు. పర్యటనలో భాగంగా వంచుల పంచాయతీ పరిధిలోని ఎల్లవరం, కట్టువీధి పి.వి.టి.జి. గ్రామాలను సందర్శించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా జన్‌మన్ గృహ నిర్మాణాలు, ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, మౌలిక వసతులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై వివరాలు సేకరించారు. పి.వి.టి.జి. గ్రామాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వంతల దేవదాసు కోరారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. పి.వి.టి.జి. కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు గృహాలు, రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, ఆరోగ్యం తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. పర్యటనలో హౌసింగ్ ఏఈ విమల, సంబంధిత అధికారులు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి చల్లంగి అచ్యుత్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

జీకేవీధి జడ్పీటీసీ స్థానంపై వేడెక్కుతున్న రాజకీయ సమీకరణాలు

కూటమి టికెట్‌పై బీజేపీ, టీడీపీ, జనసేన ఆశావహుల కన్ను

గూడెంకొత్తవీధి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలో జడ్పీటీసీ స్థానం చుట్టూ రాజకీయ చర్చలు ఊపందుకుంటున్నాయి. ంకూటమిలోని బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న పలువురు పేర్లు తెరపైకి వస్తుండటంతో మండల రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

ఎవరికి దక్కనుంది కూటమి జడ్పీటీసీ టికెట్?

కూటమి పొత్తులో భాగంగా జీకేవీధి జడ్పీటీసీ స్థానాన్ని ఏ పార్టీకి కేటాయిస్తారనే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. బీజేపీ నుంచి బొండ్ల చిరంజీవి, జనసేన నుంచి గొర్లె వీరవెంకట్ టికెట్ ఆశిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. టీడీపీ నుంచి కూడా పలువురు ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకుడు బొండ్ల చిరంజీవి మాట్లాడుతూ.. గత జడ్పీటీసీ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీ చేసినప్పటికీ, అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా విజయం సాధించలేకపోయామని తెలిపారు. అనంతరం పార్టీ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో జీకేవీధి జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం తనకు కల్పించాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు చిరంజీవి తెలిపారు. అయితే జడ్పీటీసీ స్థానం రిజర్వేషన్, కూటమి పొత్తుల సమీకరణాలు, పార్టీ అధిష్ఠానం నిర్ణయం ఆధారంగానే టికెట్ ఖరారవుతుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ కేటాయించినా కూటమి అభ్యర్థి విజయానికి అందరూ కలిసి పనిచేస్తామని బొండ్ల చిరంజీవి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జీకేవీధి జడ్పీటీసీ స్థానం ఎవరికి దక్కుతుందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి

టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య)

ముంచంగిపుట్టు, ఆగస్టు 22, (ప్రభాతవార్త):

నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముంచంగిపుట్టు మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య) అన్నారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య) చేతుల మీదాగ నూతనంగా ఏర్పాటు చేసిన, గోక్కోర రిటైల్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ను శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కంపెనీ ద్వారా స్థానిక యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తూ, ఉపాధి అవకాశాలు కల్పించడమే గుకోర కంపెనీ ప్రధాన లక్ష్యమని, కిల్లో సన్యాసమ్మ (సంధ్య) తెలిపారు. మండలం లో నిరుద్యోగ యువత కు ఉపాధి కల్పన మరియు నాణ్యమైన వస్తువులు, అలాగే గృహానికి నిత్యవసర సరుకులు, గ్రోసరీ, పర్సనల్ కేర్, ఎలక్ట్రానిక్, బేబీ కిడ్స్, యాప్ లో ఆన్లైన్ చేసుకుంటే ప్రతి పంచాయతీ మరియు వారి గ్రామాల్లో ప్రతినిధులు అంద చేయటమే ఈ గుకోర కంపెనీ లక్ష్యమని. ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈవో గుకోర డిస్ట్రిక్ట్ మేనేజర్ రత్నకుమారి, పాడి అప్పన్న, లబుడు ప్రకాష్, వి. హరిప్రసాద్, కొర్ర సుందర్రావు, గంపరాయి బాలకృష్ణ, సింగ్రం రామారావు, బొడ్డలి రాంబాబు, కిల్లో మోహన్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్గీయ చెండా ఏలియా ప్రథమ వర్ధంతి పోస్టర్ విడుదల

పాడేరు,ఆగస్టు22,ప్రభాతవార్త:

స్వయం పాలన రాష్ట్ర సాధన ఉద్యమ నిర్మాత స్వర్గీయ చెండా ఏలియా ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని ఈనెల 23 వ తేదీన నిర్వహించనున్న ప్రథమ వర్ధంతి ఏర్పాట్లపై దండకారణ్య విమోచన సమితి (డి ఎల్ ఓ) రాష్ట్ర కమిటీ శనివారం డిఎల్ఓ కేడర్‌తో సమావేశం పాడేరు కాఫీ హౌస్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎల్ఓ కరపత్రాన్ని విడుదల చేసారు. దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షులు కోడా ఆనందరావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో దండకారణ్య విమోచన సమితి-కేంద్ర కమిటీ సలహాదారులు డా.కేశవ రావు, గుజ్జెలి కొండబాబు,డిఎల్ఓ దండకారణ్య ఉద్యోగ సమితి.జాతీయ కార్యదర్శి సమరెడ్డి మాణిక్యం,కేంద్ర కమిటి సభ్యులు.బోనింగి సత్యనారాయణ పడాల్, దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర మార్క్ రాజ్, దండకారణ్య విమోచన సమితి జిల్లా అధ్యక్షులు కిముడు కొత్తయ్య రాష్ట్ర నాయకురాలు కవడం కాసులమ్మ ఎన్. మల్లేశ్వరవు, రాష్ట్ర నాయకులు, కొండపల్లి కాంతరావు, భీమేశ్వరావు, మనోజ్ కుమార్ కవడం మచ్చుమ్మ, రీమలి దారాలమ్మ, దండకారణ్య విమోచన సమితి సభ్యులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరు,ఆగస్టు22,ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మధ్యాహ్నం భోజన పథకం, సెక్షన్ లో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్ట్ (01) ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించుట కొరకు జిల్లా విద్యాశాఖ అధికారి వారు నుండి నోటిఫికేషన్ విడుదల చేసారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ లోగా డి ఈ ఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి భాను మూర్తి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్హతలు:

గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కంప్యూటర్ సైన్సో బ్యాచిలర్స్ డిగ్రీ, ఏం ఎస్ ఆఫీస్ అలాగే ఇంగ్లీష్ మరియు తెలుగు టైపింగ్ నైపుణ్యాలు కలిగి ఉండాలని డిఈఓ భానుమూర్తి రాజు పేర్కొన్నారు.

భారీ వర్షానికి అధ్వానంగా ఎం.బూషికొండ రోడ్డు

గూడెం కొత్తవీధి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని ఎం.బూషికొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వర్షపు నీటి ప్రవాహానికి దెబ్బతింటోంది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో కొండ ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వచ్చే వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పలుచోట్ల రహదారి కోతకు గురై గోతులు ఏర్పడ్డాయి. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఎగువ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వరద నీరు రావడంతో రహదారి మరింత దెబ్బతింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పరిస్థితిని గమనించిన స్థానిక యువకులు తాత్కాలికంగా రోడ్డుకు రక్షణగా కాలువలు తవ్వి వర్షపు నీటి ప్రవాహాన్ని మళ్లించారు. ఎం.బూషికొండ గ్రామానికి ఈ రహదారే ప్రధాన రాకపోకల మార్గమని గ్రామస్తులు తెలిపారు. రహదారి మరింత దెబ్బతినకముందే అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టడంతో పాటు, రోడ్డుకు ఇరువైపులా శాశ్వత డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. రహదారి నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్‌కు సమాచారం అందించి, నాణ్యమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు భవిష్యత్తులో వర్షపు నీటి ప్రవాహానికి రహదారి కొట్టుకుపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మాతృభాష వాలంటీర్ల గౌరవ వేతనం పెంచాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మాతృభాషలో విద్యాబోధన చేస్తున్న మాతృభాష ఉపాధ్యాయులు, వాలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనాన్ని పెంచాలని గూడెం కొత్తవీధి మండల మాతృభాష ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు, బొర్రామామిడి ఎంపీపీ పాఠశాల మాతృభాష వాలంటీర్ గెమ్మెల లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనం సరిపోవడం లేదని, కనీసం దినసరి కూలీకి సమానంగా కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మాతృభాష వాలంటీర్ల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గౌరవ వేతనాన్ని తక్షణమే పెంచాలని కోరారు. మాతృభాష పరిరక్షణతో పాటు గిరిజన విద్యార్థులకు వారి మాతృభాషలో విద్యాబోధన అందించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గుర్తించి తగిన పారితోషికం అందించాలని లక్ష్మణరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై అన్ని పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం

ముంచంగిపుట్టు , ఆగస్టు 22, (ప్రభాతవార్త):

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలు, ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై మండలంలో గల అన్ని పార్టీల నాయకులతో స్థానిక ఎంపీడీవో సమావేశం అందరంలో ఎంపీడీవో కే ధర్మారావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే ధర్మారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు ప్రకారం ఆదివారం అనగా తేది 23-08-2026 న 2వ సాధారణ ఎన్నికల (గ్రామపంచాయతీ)పోలింగ్ కేంద్రముల ముసాయిదా జాబితా ను అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయం నందు మరియు పంచాయతీ నందు మూడు ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రచురణ జరుగుతుందని పిడిఓ కే ధర్మారావు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు స్వీకారణకు చివరితేది 26-08-2026, అభ్యంతరాలు పరిశీలన తరువాత జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి అల్లూరి సీతారామరాజు జిల్లా వారి ఆమోదం కొరకు తేది 29-08-2026 న పంపించడం జరుగుతుందని. జిల్లా కలెక్టర్ ఆమోదం తో గ్రామపంచాయతీ ల పోలింగ్ కేంద్రముల తుది జాబితా నుతేది 31-08-2026 న అన్ని గ్రామ పంచాయతీ లలో పైన తెల్పిన ప్రదేశాల్లో ప్రచురించడం జరుగుతుందని. ఈ విషయమై 23 గ్రామపంచాయతీ లుకు గాను 228 వార్డు లకు 228 పోలింగ్ కేంద్రముల ముసాయిదా జాబితా సిద్ధం చేసి పంచాయతీ అభివృద్ధి అధికారులుకు అందజేయడం జరిగిందన్నారు.సదరు ఈ విషయం మండలం లో గల అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేసి మండల పరిషత్ కార్యాలయం నందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పాడేరులో ఘనంగా చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు

పాడేరు,ఆగస్టు22,ప్రభాతవార్త:

కేంద్ర మాజీ మంత్రి ప్రముఖనటుడు,మెగా స్టార్ కొణిదెల చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు పాడేరులో మెగా ఫ్యాన్స్ అధ్యక్షులు డి.జగన్,స్టేట్ వైడ్ కరస్పాండెంట్ ఎస్.రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా ఆయన పేరిట అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆస్పత్రిలో వందమంది రోగులకు రొట్టెలు,పాలు,పండ్లు పంపిణీ చేశారు. సినిమాహాలు వద్ద చిరంజీవి జన్మదినోత్సవం వేడుకలు సందర్భంగా సభావేదికను ఏర్పాటు చేసి చిరు అభిమానుల సమక్షంలో భారీ కేకును కేట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని చిరంజీవికిజన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం నిరుపేద మహిళలు పురుషులకు చీరలువస్త్రాలను పంపిణీ చేసారు. వేడుకల్లో పాడేరు పట్టణ ప్రముఖ వ్యాపారి ఇమ్మిడిశెట్టి అనీల్,చిరు అభిమానులు వెంకట్,శ్రీను, మోహన్,సాయి,కిరణ్ చిరు అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'సర్'లో ఈ నాలుగైదు రోజులే కీలకం

- ఓటర్ల జాబితా సవరణలపై అప్రమత్తంగా ఉండాలి

-వైసిపి మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు

-జడ్పీ అతిథి గృహంలో వైసిపి శ్రేణులతో ప్రత్యేక సమావేశం

ముంచంగిపుట్టు, ఆగస్టు 22, (ప్రభాతవార్త):

సర్‌లో ఈ నాలుగైదు రోజులే కీలకమని ఓటర్ల జాబితా సవరణపై వైసీపీ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చూసుకోవలసిన బాధ్యత పార్టీ శ్రేణులు అందరిపై ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మారావు పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం మండలంలో గల జడ్పీ అతిథి గృహంలో వైసిపి పార్టీ శ్రేణులు కార్యకర్తలు మండల స్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ సర్‌లో రెండో విడత కార్యక్రమం దాదాపు పూర్తవుతున్నందున మ్యాపింగ్, నాన్-మ్యాపింగ్, గైర్హాజరు, అభ్యంతరాలు, క్లెయిమ్స్ దాఖలు చేసేందుకు నెలాఖరు వరకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉన్నందున పార్టీ యంత్రాంగం వేగంగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఓటు స్థాయిలో పరిశీలన జరపడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ఓట్లు తొలగించే పరిస్థితిలో ఉంటే సంబంధిత ఫారాలను సమర్పించి వాటిని తిరిగి జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డూప్లికేట్ లేదా బోగస్ ఓట్లుగా భావించిన వాటిపై అవసరమైన అభ్యంతరాలను సమర్పించాలని చెప్పారు. ఇదే సమయంలో చిరునామా మార్పులు, ఇతర సవరణలకు సంబంధించిన దరఖాస్తులను కూడా అవసరాన్ని బట్టి సమర్పించాలని సూచించారు.ఒకే పేరుకు లేదా ఇతర వివరాలకు దగ్గరగా ఉన్న ఓటర్లు వాస్తవంగా ఒకరేనా, వేర్వేరు వ్యక్తులా అనే అంశాన్ని బీఎల్ఏలు స్థానికంగా నిర్ధారించాలని సూచించారు. అభ్యంతరాలను సమిష్టిగా సమర్పించాలని చెప్పారు. ఆగస్టు 27, 28 తేదీల నాటికి ప్రధాన ప్రక్రియను పూర్తి చేసి, నెలాఖరు చివరి రెండు రోజుల్లో తుది పరిశీలనకు అవకాశం ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఆగస్టు 30 తర్వాత అవకాశాలు పరిమితమవుతాయని, అందువల్ల ప్రస్తుతం ఉన్న సమయాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక క్యాంపెయిన్ రోజుల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, ఆ అవకాశాన్ని బీఎల్ఏలు వినియోగించుకుని ఓటర్ల జాబితా, దరఖాస్తులు, నోటీసులు, సవరణల వివరాలను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. రాబోయే కొద్దిరోజులు పార్టీకి చెందిన సిబ్బంది, సహాయకులు, నియోజకవర్గ స్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్నవారికి స్పష్టమైన టార్గెట్లు కేటాయించి పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అల్లూరు జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, అరకు నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులు వంతల కొండలరావు, వికలాంగుల సంఘం అధ్యక్షులు కరింగియా జయదేవ్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంగడ రమేష్, సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ గాసిరాం, అరకు నియోజకవర్గం ఆర్టిఐ వింగ్ అధ్యక్షులు గల్లెల అర్జున్, మండల ప్రధాన కార్యదర్శి ముక్కి రాంప్రసాద్, సుజన కోట సెగ్మెంట్ ఎంపీటీసీ బి సుబ్బలక్ష్మి నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు అభిమానులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో విడత 'జ్ఞానజ్యోతి' శిక్షణ

యలమంచిలి, ఆగస్టు 22, ప్రభాతవార్త

అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో డీఆర్‌పీలు రమ్య, అపరంజని, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, వినోద్ కుమార్ పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై అవగాహన కల్పించి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ అధికారి ఇందిరాదేవి సందర్శించి, శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న విషయాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సమర్థవంతంగా బోధిస్తూ, ఆచరణలో పెట్టాలని ఇందిరా దేవి సూచించారు.

సీపీఎస్ రద్దు కోసం ఏప్రిల్ 1న 'చలో విజయవాడ': ఏపీ సీపీఎస్ఈఏ

యలమంచిలి, ఆగస్టు 22, ప్రభాతవార్త

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 1వ తేదీన నిర్వహించనున్న 'చలో విజయవాడ' పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపిసిపిఎస్ఈఏ) యలమంచిలి మండల అధ్యక్షుడు మహమ్మద్ అంజాద్ ఆధ్వర్యంలో సోమలింగపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత చలో విజయవాడ గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల సీపీఎస్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమాన్ని సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాపాజీ, బాలాజీ, ఆనందరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర

రాళ్ల చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు

యలమంచిలి, ఆగస్టు 22, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని పట్టణంలోని రాళ్లచెరువు వద్ద శనివారం విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ నెల థీమ్ అయిన 'శానిటేషన్ అండ్ క్లీన్ లినెస్ యాక్టివిటీస్'లో భాగంగా కమిషనర్ నేతృత్వంలో చెరువు చుట్టూ పెరిగిన పొదలను, తుప్పలను తొలగించి జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. ప్రాంగణంలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఎలమంచిలి సాధనకు పట్టణ ప్రజలంతా బాధ్యతగా సహకరించాలని కోరారు. ఇళ్ల వద్దే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ విజయ్ కుమార్, మెప్మా సీఎంఎం పద్మావతి ప్రతినిధులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన సీఎం చంద్రబాబు

పారిశుద్ధ్య కార్మికుల కృషితో స్వచ్ఛ గ్రామాలు -పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి -కోడూరు సభలో సీఎం చంద్రబాబు పిలుపు

అనకాపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త

గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఆ గ్రామంలో ఉన్న పరిశుద్ధ కార్మికులు సేవలు కీలకమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశుద్ధ కార్మికుల సేవలను కొనియాడారు. అనకాపల్లి జిల్లా కే కోటపాడు మండలం ఏ కోడూరు గ్రామంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు పార్టీ కార్మికులను ఘనంగా సత్కరించి అందజేస్తూ వారి సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సంకల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం జీరో వేస్ట్ గ్రామంగా మార్పు తీసుకురావాలన్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశామన్నారు. గత ప్రభుత్వంలో గుట్టలు గుట్టలుగా చెత్తను పోగేశారు. దీంతో వర్షం పడిన సమయంలో భూగర్భ జలాల్లో కలుషితమై వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు.చెత్త నుంచి సంపద సృష్టించడం అంటే ఆశ్చర్యంగా చూశారు. చెత్తనుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నాం. స్వచ్ఛ రథాలు పెట్టి ఊరూరా పంపి వేస్ట్ తీసుకుని నిత్యవసర సరుకులు అందిస్తున్నామన్నారు.రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచేలా చర్యలు చేపట్టమన్నారు. నెలలో 3వ శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రం చేయాలని అధికారులకు సూచించారు.

ఘనంగా చిరు జన్మదిన వేడుకలు

అగనంపూడి,ప్రభాతవార్త

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు అగనంపూడిలో చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యువత అధ్యక్షుడు విందుల చిరురాజు అధ్యక్షతన పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ముందుగా పెదమడక రామాలయంలో చిరంజీవి పేరిట ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసారు.ముఖ్య అతిథులుగా జనసేన సీనియర్ నాయకుడు విందుల వెంకట రమణ పాల్గొన్నారు.అనంతరం పవన్ సాయి ఆసుపత్రి సౌజన్యశీతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.చివరగా అగనంపూడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు,రొట్టెలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ నటనలోను,సేవలోను చిరంజీవికి మించిన వారెవరూ లేరన్నారు.తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు,దేశాల్లో ప్రజల అభిమానాన్ని చూరగొన్న గొప్ప సేవకుడు చిరంజీవి అని కొనియాడారు.రక్తదాన,నేత్రదాన కార్యక్రమాలతో ఎంతో మందికి పునర్జీవం ప్రసాదించిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు.వైద్య శిబిరంలో రోగులను పరీక్షించిన అనంతరం ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో, ఉత్తరాంధ్ర చిరంజీవి యువత మాజీ అధ్యక్షుడు పేకేటి వెంకట రమణ, మంత్రి మురళీ కృష్ణారావు, విందుల నారాయణరావు, మేడిశెట్టి విజయ్, రాయి రమణ, గోవింద్, వరహాలరావు, కొలిపాక అప్పారావు, చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పాలు, రొట్టెల పంపిణీ

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని గోడిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మెగా యూత్ ఫోర్స్ ఉత్తరాంధ్ర కన్వీనర్ గెడ్డం చైతన్య ఆదేశాలు మేరకు జనసేన పార్టీ నక్కపల్లి మండల ఉపాధ్యక్షులు నల్లల రత్నాజీ ఆధ్వర్యంలో ఆయన అభిమానులు, సేవా నిర్వాహకులు ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి సహాయకులకు పాలు, రొట్టెలు అందజేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ ద్వారా చేస్తున్న సామాజిక సేవలను స్ఫూర్తిగా తీసుకుని తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట వీరబాబు, గర్లంక శ్రీను, గర్లంక దివాణం, కోరుకొండ రామకృష్ణ, చింతరెడ్డి చరణ్, నల్లల శ్రీనివాస్ స్థానిక చిరంజీవి అభిమానులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటికలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

ఆరిలోవ ఆగస్టు 22, ప్రభాతవార్త

ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలు మేరకు 11వ వార్డులో జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ వారు ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం సానిటరీ ఇన్స్పెక్టర్ నమ్మి బంగారు రాజు ఆధ్వర్యంలో డ్రైవర్స్ కాలనీ స్మశానవాటికలో నిర్వహించారు. స్మశాన వాటికలో ఉన్న పిచ్చి మొక్కలను, పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఎన్ఈ డైరెక్టర్ ముగడ రాజారావు, వార్డు ఇన్చార్జ్ రాగతి అచ్యుతరావు, 11వ వార్డు నాయకులు కాకి గంగరాజు, మధుపాడ సన్యాసిరావు, కొల్లి ఏర్రాజీరావు పేపర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

(నక్కపల్లి ,ప్రభాతవార్త)

నక్కపల్లి పట్టణంలో ఉన్న శిరిడి సాయి ఆలయ వార్షికోత్సవం ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. దర్శించుకున్న వారిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, మాజీ ఉప సర్పంచ్ రాజు, చిరంజీవి ఫ్యాన్స్ మండల అధ్యక్షులు కొల్నాటి దుర్గాప్రసాద్, స్కూల్ చైర్మన్ పెద్దిరెడ్డి రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడేటి శంకర్, గంటా తిరుపతిరావు, నున్న సత్తికొండ, కొత్త శ్రీను, సందీప్, కక్కిరాల సురేష్, నున్న నరసింహమూర్తి, గుప్త, వాసు తోపాటు పచ్చిపులుసు నాగేశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు.

ఇంటికి నిప్పు పెట్టిన కేసులో వ్యక్తి అరెస్ట్

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని ఎన్. నరసాపురం గ్రామంలో వ్యక్తిగత కక్షల కారణంగా ఇంటికి నిప్పుపెట్టిన నిందితుడిని సిఐ జె.మురళి ఆధ్వర్యంలో శనివారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని ఎన్.నరసాపురం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున సైనవరపు వరహాలు అనే మహిళకు చెందిన ఇంటిలో అగ్ని ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే.! ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కాకినాడ జిల్లా అవంతి నగర్‌లో ఉంటున్న బాధితురాలి మూడవ కుమారుడు సైనవరపు శ్రీనుపై అనుమానం రావడంతో విచారణ భాగంగా సదరు వ్యక్తిని శనివారం ఉదయం ఉప్మాక ఆర్చి జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా తను తమ్ముడు పెళ్లి నిమిత్తం తన అమ్మ తనకున్న భూమిని అమ్మి పెళ్లి చేయుటకు నిర్ణయించగా,దాన్ని సదరు నిందితుడు వ్యతిరేకిస్తూ కుటుంబ వివాదాల నేపథ్యంలో తన తల్లి , తమ్ముడు పై కోపంతో ఈ ఘటనకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందని సీఐ తెలిపారు. కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని శనివారం రిమాండ్ కు సిఐ మురళి ఆధ్వర్యంలో తరలించినట్లు ఎస్సై సన్నీ బాబు తెలిపారు.

అంగరంగ వైభవంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు ముగింపు.. పలువురుకు సత్కారం

నక్కపల్లి ,ప్రభాతవార్త

నక్కపల్లి మండల కేంద్రంలో మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన దినోత్సవం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఉత్తరాంధ్ర ఫ్యాన్స్ నిర్వాహకులు మీగడ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం అట్టహాసంగా జన్మదిన వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నక్కపల్లిలో ఏర్పాటు చేసిన భారీ కేక్ ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్‌ల చేతుల మీదుగా మండల చిరంజీవి చిరు ఫ్యాన్స్ అధ్యక్షులు కొల్నాటి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కట్ చేశారు.

ఈ సందర్భంగా గత వారం రోజులుగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు పట్ల ముందుకు వచ్చిన మీగడ సత్యనారాయణమూర్తి, కొల్నాటి దుర్గాప్రసాద్, కర్రీ నానాజీతో పాటు పలువురిని రామకృష్ణ వెంకటేష్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. భారతదేశంలో నందమూరి తారకరామారావు తర్వాత సినీ రంగంలో కోట్లాదిమంది అభిమానులను సంపాదించిన వ్యక్తి చిరంజీవిని చిరంజీవి సినిమాల్లో సేవాభావం కనిపిస్తుంది బయట కూడా ఆ సేవాభావం పూర్తిస్థాయిలో కళ్ళతో చూసే విధంగా ఎన్నో సంవత్సరాలుగా నిర్వహిస్తూ వస్తున్నారని అటువంటి నటుడు ఈ భారత గడ్డమీద ఉండడం మనందరి అదృష్టం అని ఆయనకి మంచి ఆరోగ్యం ప్రసాదించాలని రామకృష్ణ, వెంకటేష్‌లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మీగడ సత్యనారాయణ మూర్తి, కొల్నాటి దుర్గాప్రసాద్, కర్రీ నానాజీలు కలసి గ్రామానికి సేవలందిస్తున్న మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, బిజెపి మండల శాఖ అధ్యక్షులు పోలినాటి నానాజీతో పాటు పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కర్రీ వెంకట సత్యనారాయణ (కేవి), పెద్దిరెడ్డి రమేష్, అల్లాడ కొండబాబు, గొడుగులు బంగారాజు, సి హెచ్ ఆర్ ఎస్ ఎన్ రామరాజు, దేవవరపు సత్తయ్య, లోవరాజు, పూసల రమణ, అల్లాడ తాతారావు, ముద్ద పెద్ద బాబ్జి, సన్యాసిరావు, బండారు మణికంఠతో పాటు పలువురు చిరంజీవి అభిమానులు ఉన్నారు.

జిల్లా అధికారుల పనితీరుపై సీఎం చంద్రబాబు అసహనం

అధికారుల పనితీరుతో ప్రజల సంతోషంగా ఉండాలి -జిల్లా అధికారులకు సీఎం చంద్రబాబు దేశా నిర్దేశం

అనకాపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త

అధికారులు పనితీరుతో ప్రజలు సంతోషంగా ఉండాలని, లేని పక్షంలో ఆయా శాఖల అధికారుల పై చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు నాయుడు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులకు హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా కే కోటపాడు మండలం ఏ కోడూరు గ్రామంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సభలో సీఎం చంద్రబాబు శాఖల వారీగా జిల్లా అధికారులను వేదిక పైకి పిలిచి గత ఏడాదికాలంగా వారి పనితీరును ప్రశ్నిస్తూ అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు గల కారణాలను ప్రజలకు తెలియజేయాలని సీఎం చంద్రబాబు సభా వేదిక మీదుగా సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పనితీరుపై ఎప్పటికప్పుడు డేటా తనకు వస్తుందని, దీనికి గల కారణాలు చెప్పకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన సేవలు అందించినప్పుడే మీ పనితీరు బాగున్నట్టు గుర్తిస్తామన్నారు. మరికొన్ని శాఖల అధికారులు పనితీరు పై హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

విద్యార్థులకు అట్టలు పంపిణీ

నక్కపల్లి,ప్రభాతవార్త

నక్కపల్లి మండల కేంద్రంలో మెగాస్టార్ చిరంజీవి 71 వ జన్మదిన దినోత్సవం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఉత్తరాంధ్ర ఫ్యాన్స్ నిర్వాహకులు మీగడ సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు మిఠాయిలు చదువుకునేందుకు అవసరమైన విద్యా సామాగ్రిని అందజేశారు. మండల చిరంజీవి చిరు ఫ్యాన్స్ అధ్యక్షులు కొల్నాటి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జనసేన పట్టణ నాయకులు కర్రీ నానాజీ విద్యార్థులకు సమకూర్చిన అట్టలను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల శాఖ అధ్యక్షులు పోలినాటి నానాజీ, కర్రీ వెంకట సత్యనారాయణ (కేవి), పెద్దిరెడ్డి రమేష్, అల్లాడ కొండబాబు, గొడుగులు బంగారాజు, సిహెచ్ఆర్ ఎస్ఎన్ రామరాజు, దేవవరపు సత్తయ్య, లోవరాజు, పూసల రమణ, అల్లాడ తాతారావు, ముద్ద పెద్ద బాబ్జి, సన్యాసిరావు, బండారు మణికంఠతో పాటు పలువురు చిరంజీవి అభిమానులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో అంటు వ్యాధుల నివారణ

ఆనందపురం, ఆగస్ట్ 22, ప్రభాతవార్త

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటు వ్యాధులను నివారించవచ్చని జిల్లా ప్రోగ్రాం అధికారి డా.ఉమావతి అన్నారు. ఆనందపురం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఉమావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడంతోపాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దాని పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాలాజీ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షబీనా భాను, ఆరోగ్య విస్తరణాధికారి శ్యామలరావు, ఫార్మసీ అధికారి జయకుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం

ఎస్పీ తుహిన్ సిన్హా ప్రశంసలు

అనకాపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త

కె.కోటపాడు మండలం, ఎ.కోడూరు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛంధ్ర' కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన అత్యంత శోభాయమానంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసింది. హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి కి జిల్లా యంత్రాంగం , పోలీసు శాఖ తరపున ఘన స్వాగతం లభించింది. విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలసి, సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యక్ష పర్యవేక్షణలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ పర్యటనను అత్యంత క్రమశిక్షణతో, విజయవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులకు సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేందుకు అంకితభావంతో పనిచేసిన ప్రతీ పోలీసు అధికారికి, సిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు. మీ సమన్వయం, అప్రమత్తత, వృత్తిపరమైన క్రమశిక్షణ అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ నిబద్ధతకు నిదర్శనం. విశేషంగా ఇతర జిల్లాల నుండి విధులకు హాజరై విశేష సేవలందించిన అధికారులకు, సిబ్బందికి నా ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు.

హామీ మేరకు ఇంటి స్థలాలు కేటాయించాలి

డిప్యూటీ తహసిల్దార్ రమేష్ బాబుకు బాధితులు వినతి

రాంబిల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త

మండలంలోని హరిపురం గ్రామంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నివాసం ఉంటున్న తమ కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించినప్పటికీ, ఇంతవరకు ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలాలు కేటాయించలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ శనివారం డిప్యూటీ తహసిల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. హరిపురం గ్రామంలో తమ ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను సేజ్ నిర్వాసితులకు కేటాయించేందుకు అధికారులు ఖాళీ చేయించారని బాధితులు తెలిపారు. ఆ సమయంలో తమ కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న లేఔట్‌లో ఇంటి స్థలాలు కేటాయిస్తామని అప్పటి తహసిల్దార్ సత్యనారాయణ హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. మొత్తం 23 కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని స్పష్టంగా హామీ ఇచ్చినప్పటికీ, నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు స్థలాల కేటాయింపుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇచ్చిన హామీని నమ్మి తమ నివాసాలను ఖాళీ చేశామని, ప్రస్తుతం తమ కుటుంబాలు ఇంటి స్థలాల కోసం ఎదురుచూస్తున్నాయని బాధితులు తెలిపారు. తమ పరిస్థితిని అధికారులు మానవతా దృక్పథంతో పరిశీలించి, గతంలో ఇచ్చిన హామీ మేరకు ఏపీఐఐసీ లేఔట్‌లో 23 కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

టీడీపీ బలోపేతానికి బూత్ కన్వీనర్లే కీలకం : చింతకాయల పద్మావతి

మాకవరపాలెం ఆగస్టు 22 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయడంలో బూతు కన్వీనర్ల పాత్ర ఎంతో కీలకమైందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి అన్నారు.ఈమేరకు శనివారం నర్సీపట్నం స్పీకర్ నివాసంలో మాకవరపాలెం మండలానికి చెందిన పలు బూతు కన్వీనర్లు క్లస్టర్ ఇన్చార్జిలను పద్మావతి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. మాకవరపాలెం మండలంలో తెలుగుదేశం పార్టీ ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా నూటికి నూరుశాతం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పార్టీ శ్రేణులను ఆమె అభినందించారు. మరి ముఖ్యంగా బూత్ కన్వీనర్లను క్లస్టర్ ఇన్చార్జిలను ఈసందర్భంగా పద్మావతి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మాకవరపాలెం మండలంలో జంగాలపల్లి, బి.ఎస్ పేట, తాడపాల, బూరుగుపాలెం బుచ్చన్నపాలెం (ముసిడిపాలెం) పాపయ్యపాలెం, పి.పి అగ్రహారం గ్రామాల చెందిన బూతు కన్వీనర్లను క్లస్టర్ ఇన్చార్జిలను పద్మావతి సాల్వతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గ్రామ గ్రామాన అభివృద్ధి చెందేందుకు బూత్ కన్వీనర్లు క్లస్టర్ ఇన్చార్జీలు సీనియర్ కార్యకర్తలు, బాధ్యతగా పనిచేయడం పట్ల పద్మావతి ప్రత్యేకంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు, రుత్తల నందకిషోర్, పాసేపు సురేష్, రుత్తల రమణమ్మ, సింగంపల్లి రమణ పాసేపు చిట్టినాయుడు, చిరంజీవి, వబ్బలరెడ్డి వరాహలుబాబు, శివ, రుత్తల నూకరాజు (బబ్బులు) దుంగల రమణ తదితరులు పాల్గొన్నారు.

గంభీరంలో నేటి నుంచి ఝులన్ యాత్ర

ఆనందపురం, ఆగస్టు 22, ప్రభాతవార్త

ఆనందపురం మండలంలోని గంభీరంలో ఉన్న హరే కృష్ణ వైకుంఠంలో శ్రీ రాధా మదన్ మోహన్ మందిరంలో ఝులన్ ఉత్సవంను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు హరే కృష్ణ మూవ్ మెంట్ విశాఖపట్నం వైస్ ప్రెసిడెంట్ యదురాజా దాస తెలిపారు. ఆగస్టు 23 నుంచి 28వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రావణ శుక్ల ఏకాదశి (పవిత్రోపణ ఏకాదశి) నుంచి శ్రావణ పూర్ణిమ వరకు జరిగే ఈ ఉత్సవంలో శ్రీ రాధా మదన్ మోహన్ వారికి ప్రత్యేక ఝులన్ సేవలు సమర్పించనున్నట్లు తెలిపారు. బృందావనంలో నిర్వహించే సంప్రదాయాన్ని అనుసరిస్తూ పూలు, ఆకులు, వివిధ అలంకరణలతో ఉయ్యాలను సిద్ధం చేసి రాధాకృష్ణుల దివ్య లీలలను భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు ఈ ఝులన్ ఉత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని యదురాజా దాస కోరారు.

రిపోర్టర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. అనకాపల్లి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రిపోర్టర్లగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు కావలెను.

రిపోర్లర్లు కావలసిన ప్రాంతాలు

ఎస్. రాయవరం, పాయకరావుపేట, పాయకరావుపేట టౌన్,
అడ్డురోడ్డు, మాడుగుల, నర్సీపట్నం

అర్హులైన అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో 24-08-2026 సోమవారం ఉదయం 10గం.కు వార్త యూనిట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో హాజరుకాగలరు.

వార్త కార్యాలయం

జీవీఎంసీ ఎలిమెంటరీ స్కూలు ఎదురుగా, దుర్గా గణపతి గుడి వెనుక రోడ్డు,
సీతమ్మపేట, విశాఖపట్నం, ఫోన్ నెం. 9848306312

విశాఖలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పర్యటన దృశ్యాలు

ఘనంగా శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారికి భక్తజన మంగళస్నానం

గాజువాక,ఆగస్టు 22,ప్రభాతవార్త

రాజీవ్ మార్గ్‌లో వేంచేసియున్న శ్రీ సత్తెమ్మ తల్లి పండగ మహోత్సవాలు ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నా యి. సత్తెమ్మ తల్లి గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం అమ్మవారికి పంచామృ తాలు, సుగంధ ద్రవ్యాలతో భక్తజన మంగళ స్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు సూరిశెట్టి శివ, పెంటకోట వెంకట సత్యనారాయణ, భీశెట్టి సింహాచలం నాయుడు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు ఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు. 28న కలశ ప్రతిష్టాపన, సామూహిక కుంకుమార్చనలు, 29న పాలాభిషేకం, ఏకవార రుద్రాభిషేకాలు, 30న ప్రధాన పండుగ పూజలు జరుపుతున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 27న నెల పండుగ ఉంటుందన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దాల అప్పారావు, దొడ్డి రమణ, కాంద్రేగుల హరినాథ్, మల్ల ఆదిబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో భాగస్వాములవుదాం: మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ

గాజువాక,ఆగస్టు 22,ప్రభాతవార్త

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని 66వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జ్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. శనివారం కొత్తగాజువాక జంక్షన్, కనితి రోడ్డు మార్కెట్ ప్రాంగణంలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. శానిటేషన్ ఎస్ఎస్ కోటేశ్వరరావుతో కలిసి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా పాల్గొని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రతో ప్రజల్లో పరిసరాల పరిశుభ్రతపై మంచి చైతన్యం వచ్చిందన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు, ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సానిటరీ ఇన్స్పెక్టర్ దివ్య, సచివాలయ సిబ్బంది పిల్లి భవాని, సౌజన్య, నవ్య, మురళి, వంశీ, రమణ, శానిటేషన్ సిబ్బంది రామారావు, లక్ష్మణరావు, శ్రీహరి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మోహన్ భగవత్‌ను కలిసిన గంటా

ఆనందపురం, ఆగస్టు 22, ప్రభాతవార్త

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ తో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భేటీ అయ్యారు. గుడిలోవ విజ్ఞాన్ విహార్ లో జరిగిన అఖిల భారత సమన్వయ బైఠక్ లో పాల్గొనడానికి వచ్చిన భగవత్‌ను నార్త్ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజుతో కలిసి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 19 న ప్రారంభమైన సమన్వయ బైఠక్ 21 వరకు జరిగిన సంగతి తెలిసిందే. దేశం పట్ల ఎంతో నిబద్ధత కలిగిన భగవత్ లాంటి గొప్పవ్యక్తిని కలుసుకోవడం సంతోషంగా ఉందని గంటా పేర్కొన్నారు. భగవత్ నిరాడంబర వ్యక్తిత్వం ఆయన్ని ఈ స్థాయికి చేర్చిందన్నారు. భగవత్ సహా ఆర్ఎస్ఎస్ సర్ కార్యవహ దత్తాత్రేయ హోసబలే, ఆర్.ఎస్.ఎస్. ప్రముఖులు వి.భాగయ్య, దూసి రామకృష్ణ తదితరులను కూడా గంటా కలిశారు. అనంతరం వారితో సహ పంక్తి భోజనం చేశారు.

కళ్లకు గంతలు కట్టుకొని వినూతన్న నిరసన తెలిపిన జూడాలు

విశాఖపట్నం, ఆగస్టు 22 ప్రభాతవార్త

జూనియర్ వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం 13వ రోజూ తమ సమ్మెను కొనసాగించారు. దాంతో ఏఎంసీ పరిధిలోని కెజీహెచ్‌తో పాటు అన్ని ప్రభుత్వఆసుపత్రులలో చికిత్స పొందు తున్న అన్ని రకాల రోగుల అందరూ సమ్మె కారణంగా శనివారం కూడా సక్రమంగా వైద్య సేవలు అందక ఇక్కట్లు పడ్డారు. సమ్మె నిరసనలో భాగంగా, ఆంధ్రా వైద్య కళాశాల కేజీహెచ్‌కు చెందిన జూనియర్ డాక్టర్లు రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకునిశనివారం వైద్య కళాశాల ప్రధాన ద్వారం ఎదుట ప్రతీకాత్మక నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎక్కువ గంటలు పనిచేస్తూ, ఆరోగ్య సంరక్షణ పనిభారంలో గణనీయమైన వాటాను మోస్తున్నప్పటికీ, మా ప్రయత్నాలు నిజమైన ఆందోళనలు నిరంతరం గుర్తించబడకుండానే ఉన్నాయని ఈసందర్భంగా ఏపీ జూనియర్ డాక్టర్‌ల సంఘం నాయకులు డాక్టర్ దినకర్ డాక్టర్ రవీంద్ర, డాక్టర్ సిరాజ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాల మధ్య స్టైపెండ్‌లలో ఉన్న వ్యత్యాసం, జూనియర్ డాక్టర్లు అందిస్తున్న పని, బాధ్యతలు సేవలకు ప్రభుత్వ గుర్తింపు లేకపోవడాన్ని వారు తప్పు బట్టారు. "మా పని, మా ఆందోళన మా స్టైపెండ్‌లలోని వ్యత్యాసశీ ప్రభుత్వం కళ్ళకి కనిపించట్లేదని ప్రజల కు తెలియ జేసేందు కోసమే మేము కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వం రోగుల ఇబ్బందులను గమనించి .మా న్యాయమైన డిమాండ్ల పట్ల దృష్టి సారించి, వాటిని పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాము" అని వారు తెలిపారు. కెజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట శనివారం నాటి రిలే నిరాహార దీక్షలో డాక్టర్ కళ్యాణ్ డాక్టర్ చరణ్ డా.సుభాష్ డా.విజేత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల స్వచ్ఛాంధ్రాలో గంటా

మధురవాడ, ఆగస్టు 22, ప్రభాతవార్త

జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన "ఆరోగ్య పాఠశాలలు - ఆరోగ్య ఆంధ్రా" అంశంలో భాగంగా పాఠశాల ను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛాంధ్రా ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చేలా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శిక్షణనివ్వాలని గంటా పేర్కొన్నారు. 627 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఫలితాలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. హాస్టల్‌లో నీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే బోరు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఏ.ఎం.హెచ్.ఓ. రాజా రవికుమార్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, లొడగల జానకిరాం, పోలిశెట్టి నాగేశ్వరరావు, మన్యాల సురేష్, పాల్గొన్నారు.

నడిరోడ్డుపై యువకులు వీరంగం

విచక్షణ రహితంగా నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు కర్రలతో దాడి

విశాఖ క్రైమ్, ఆగస్టు 22 ప్రభాతవార్త

మధురవాడ పరిధి మారికవలసలో యువకుల మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసి పరారయ్యారు. వివరాల్లోకి వెళ్తే పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన చిన్న వివాదం భౌతిక దాడులు చేసుకునే స్థాయికి చేరింది. గత కొన్ని రోజులు క్రితం పదోతరగతి విద్యార్థుల మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఇద్దరిలో ఓ బాలుడి తరపున రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన సుమారు 20 మందికిపైగా యువకులు మారికవలస-ఐటీ సెజ్ రహదారిలో శివశక్తినగర్ మలుపు వద్ద సమావేశమయ్యారు. సరిగ్గా ఇదే సమయంలో శివశక్తినగర్ కు చెందిన నలుగురు యువకులు ద్విచక్రవాహనాలపై అటుగా వచ్చారు. దీంతో వారు ఆగ్రహానికి గురై నలుగురిపై విచక్షణారహితంగా కర్రలతో దాడి చేశారు. ఈ కొట్లాటకు సంబంధించి ఆరుగురుని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల పాఠశాల స్వచ్ఛాంధ్రాలో గంటా

మధురవాడ, ఆగస్టు 22, ప్రభాతవార్త

జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన "ఆరోగ్య పాఠశాలలు – ఆరోగ్య ఆంధ్రా" అంశంలో భాగంగా పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చేలా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శిక్షణివ్వాలని గంటా పేర్కొన్నారు. 627 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఫలితాలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. హాస్టల్ లో నీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే బోరు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ఏ.ఏం.హెచ్.ఓ. రాజా రవికుమార్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల జానకిరాం, పోలిశెట్టి నాగేశ్వరరావు, మన్యాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

ఆలయ ఉద్యోగులతో పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించిన ఈఓ జల్లేపల్లి వెంకట్రావు

సింహాచలం, ఆగస్టు 22, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడవ శనివారం సింహాచలం సింహగిరిపై ప్రత్యేక శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజగోపురం ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో చేపట్టారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శ్రమ దానం చేశారు. అనంతరం ఆలయ ఉద్యోగులు, సిబ్బందితో 'స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓ జల్లేపల్లి వెంకట్రావు, సహాయ కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయగా, ఆలయ ఉద్యోగులు, పరిపాలనా విభాగపు పర్యవేక్షణ అధికారి రాజ్యలక్ష్మి, శానిటరీ పర్యవేక్షణ అధికారి ఎస్.కనకరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాత్ర ఎనలేనిది

విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త

రాష్ట్ర అభివృద్ధిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాత్ర ఎనలేనిదని తెలుగుదేశం పార్టీ రాంబిల్లి మండల అధ్యక్షులు లాలం భరత్ అన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా రాంబిల్లి మండల అధ్యక్షులు లాలం భరత్, డాక్టర్ సప్పా నరేష్ యువ నాయకులు గంటా రవితేజ సమక్షంలో లోకేష్‌కు భారీ చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా లాలం భరత్, డాక్టర్ సప్పా నరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రిగా లోకేష్ చూపిస్తున్న చొరవ ద్వారా గూగుల్, టాటా, ఖాంగిజెంట్, అనేక కంపెనీలు విశాఖపట్నంకు వచ్చాయన్నారు. విశాఖ అభివృద్ధికి లోకేష్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలియజేశారు. రాబోయే కాలంలో విశాఖను మరింత అభివృద్ధిలో చేస్తారని అనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. లోకేష్ ను కలిసిన వారిలో పలువురు యువకులు పాల్గొన్నారు.

నేవీ అమ్ముల పొదిలో ఐఎన్ఎస్ మంగ్రోల్

తూర్పు తీరాన సేవలందించనున్న మంగ్రోల్ సబ్ మెరైన్

జ్ఞానాపురం, ఆగస్టు 22, ప్రభాతవార్త

ఐఎన్ఎస్ మంగ్రోల్ యాంటీ సమ్మేరియన్ వార్ ఫేర్ వాటర్ క్రాఫ్ట్ సబ్మేరియన్ ను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. మాంగ్రోల్ మూడో తరగతి చెందిన యుద్ధ నౌక కోచింగ్ షిప్ యార్డ్ లో రూపుదిద్దుతుంది. ఈ సబ్మేరియన్ ఆత్మ నిర్భన్ భారత్ లో భాగంగా రూపుదిద్దుకుంది. 80 శాతము దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ నౌక రూపుదిద్దుకుంది. ఈ సబ్మేరియన్ కోస్తా సముద్ర జలాల్లో అడుగుబాగాన నిశిత పరిజ్ఞానంతో పరిశీలన చేస్తుంది. నావికా దళానికి ఈ మెరైన్ మంచి ఫలితాలను తీసుకురానుంది. ఐఎన్ఎస్ మంగురోల్ ఇండియన్ నేవీ స్వీపర్గా పిలవబడుతుంది. ఈ తరగతికి చెందిన సబ్ మెరై న్ 2004 వరకు సేవలందించింది. ఈ నౌక టార్పోడోస్, యాంటీ సబ్ మెరైన్ రాకెట్స్, అడ్వాన్స్ రాడార్స్, సోమార్స్ తో నిర్మించబడింది. ఇంత పటిష్టమైన మంగ్రోల్ సబ్ మెరైన్ నేవీ కి సేవలు అందించనుంది.

మోదీ 12 ఏళ్ల సుపరిపాలనే ధ్యేయం: కేఎన్ఆర్

గాజువాక,ఆగస్టు 22,ప్రభాతవార్త

న్యూఢిల్లీలోని బిజేపి జాతీయ కార్యాలయంలో సేవా సంకల్ప్ ఉత్సవ్ 2026 ప్రతినిధుల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వివరాలను బిజేపి నాయకుడు కేఎన్ఆర్ (నర్సింగరావు) వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పిలుపు మేరకు, సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ 2026 నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత 12 ఏళ్ల సుపరిపాలన, సేవలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుండి 7 గురు ప్రతినిధులతో పాటు రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి బిజేపి జాతీయ సంఘటనా మంత్రి బి.ఎల్. సంతోష్, సహ సంఘటనా మంత్రి శివప్రకాష్, జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారని కేఎన్ఆర్ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

గాజువాక జోనల్ కమిషనర్‌కు వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇల్లపు రాము వినతి

గాజువాక,ఆగస్టు 22,ప్రభాతవార్త

జోన్ పరిధిలోని 87వ వార్డులో జరుగుతున్న రహదారి, గెడ్డల అభివృద్ధి పనుల్లో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇల్లపు రాము గాజువాక జోనల్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రధాన రహదారికి ఇరువైపులా చేపడుతున్న ఫుట్ పాత్ నిర్మాణ పనుల్లో తీవ్ర నాణ్యతా లోపం కనిపిస్తోందని ఆరోపించారు. నిబంధనల ప్రకారం కాంక్రీట్ వాల్స్ నిర్మించకుండా పాత గోడలకే ప్లాస్టరింగ్ చేసి స్లాబ్‌లు వేస్తున్నారని, సిమెంట్ మిక్సింగ్ సరిగా లేకపోవడంతో టైల్స్ ఊడిపోతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే ఈ పనులపై థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు చేయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి ప్రమాదాలు నివారించాలని, గెడ్డల ఆధునీకరణ పనులను సైతం త్వరగా పూర్తి చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వైకాపా నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, అప్పిని సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ పగ్గాలు చేపట్టిన కేతన్ గార్గ్

జీవీఎంసీ కమిషనర్‌కే పూర్తి అదనపు బాధ్యతలు -ప్రభుత్వ ఉత్తర్వులతో ఇన్‌ఛార్జి మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరణ



విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త :

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ఇన్‌ఛార్జి మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఆయన పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శుక్రవారం జారీ చేసిన జీఓఆర్‌టీ నంబర్ 1075, తేదీ 21-08-2026 ప్రకారం కేతన్ గార్గ్‌కు వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కొత్త మెట్రోపాలిటన్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించే వరకు ఆయన ఈ అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. జీవీఎంసీతో పాటు వీఎంఆర్‌డీఏ బాధ్యతలు కూడా చేపట్టడంతో విశాఖ మహానగర, మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన పర్యవేక్షణ మరింత విస్తరించనుంది.

చంద్రబాబుకు స్వాగతం పలికిన మాజీ మంత్రి దాడి

అనకాపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త

జిల్లాలోని మాడుగుల నియోజకవర్గం అలమండ కోడూరులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు స్వాగతం పలికారు. దాడిని చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు.

మున్సిపాలిటీకి రూ.24 కోట్ల నిధులు : ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

తాగునీటి వ్యవస్థ బలోపేతానికి మరొక రూ.50 కోట్లు మంజూరు -త్వరలోనే ఎస్టీపీ పనుల ప్రక్రియ వేగవంతం

ఎలమంచిలి, ఆగస్టు 22, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదు పాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ తెలిపారు. శనివారం విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలోని పట్టణాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై సీడీఎంఏ కమిషనర్ పి. సంపత్ కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ సమీక్షించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యలమంచిలి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. 'కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కింద పట్టణానికి రూ.24 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. దీనికి తోడు నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, మంచినీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు వాటర్ స్కీమ్ కింద రూ.50 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే పట్టణంలో వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణంలో తాగునీటి పైప్‌లైన్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే నూతన రహదారుల నిర్మాణ పనులు చేపడతామని స్పష్టం చేశారు.

స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబుని కలిసిన మాజీ ఎంపీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, ఆగస్టు 22, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం అలమండ కోడూరులో నిర్వహించిన స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాజీ పార్లమెంట్ సభ్యులు సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

తర్లువాడ రైతులకు 3 సెంట్ల భూమి ఇవ్వాలి.. మంత్రి లోకేష్‌కు వినతి

ఆనందపురం, ఆగస్టు 22, ప్రభాతవార్త

తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కు కేటాయించిన భూమిలో బంజరు భూమి అభివృద్ధి పథకం కింద రైతులు సాగు చేసిన భూములు కూడా ఉన్నాయని గతంలో హామీ ఇచ్చిన ప్రకారం ఒక్కొక్క రైతుకు మూడు సెంట్ల చొప్పున భూమి కేటాయించాలని కోరుతూ కూటమి నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. తర్లువాడ పంచాయతీ పరిధిలోని 520 మంది రైతులకు మూడు సెంట్ల చొప్పున భూమి అందిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు సంయుక్తంగా హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అయితే ప్రస్తుతం అధికారులు నిర్వహించిన పరిశీలనలో 520 మందిలో కేవలం 150 మంది మాత్రమే అర్హులుగా గుర్తించారని, వారికి మాత్రమే భూమి కేటాయిస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. అర్హత పరిశీలన పేరుతో మిగిలిన రైతులకు భూమి కేటాయించకపోతే వారు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయాలకు అతీతంగా గతంలో హామీ ఇచ్చిన ప్రతి లబ్ధిదారు రైతు విషయంలో న్యాయం చేయాలని, అర్హతలను మరోసారి సమగ్రంగా పరిశీలించి మూడు సెంట్ల చొప్పున భూమి కేటాయించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం మండల టీడీపీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, తర్లువాడ పంచాయతీ మాజీ సర్పంచ్ బి.ఆర్‌బి. నాయుడు, సీనియర్ నాయకులు బంకు రాజు, ఉప సర్పంచ్ బాలి వెంకట్రాజు, మజ్జి సన్యాసిరావు, జనసేన ప్రధాన కార్యదర్శి మజ్జి శ్రీను, మాజీ సర్పంచ్ బాలి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

సింహాగిరికి పోటెత్తిన భక్తులు

సింహగిరిపై పలు ప్రాంతాలను పరిశీలించిన ఈ.ఓ -భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి -ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలన

సింహాచలం, ఆగస్టు 22, ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మీనర సింహస్వామి వారి దివ్యక్షేత్రమైన సింహాచలం నేడు భక్తుల కోలాహలంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శనివారం సెలవు దినం కావడంతో స్వామివారి దర్శనం కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో సింహగిరికి తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు సింహగిరిపై పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భక్తులకు అందుతున్న సౌకర్యాలు, క్యూలైన్ల నిర్వహణ, ప్రసాదాల పంపిణీ, పారిశుద్ధ్యం తదితర అంశాలను సమీక్షించారు.ముందుగా రూ.100, రూ.300 దర్శనం క్యూలైన్లతో పాటు ఉచిత క్యూలైన్లను ఈఓ పరిశీలించారు. క్యూలైన్లలో భక్తుల రద్దీని గమనించి, దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రసాదాల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన ఈఓ, అక్కడ ఏర్పాటు చేసిన హీటర్ల పనితీరును స్వయంగా పరిశీలించారు. ప్రసాదాల పంపిణీ నిరంతరాయంగా, సక్రమంగా జరిగేలా అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే వన్‌స్టాప్ సెంటర్ సమీపంలో ప్రసాదాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిని పరిశీలించిన ఈఓ, అక్కడ కూడా అవసరమైన హీటర్లను ఏర్పాటు చేయాలని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబును ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన ప్రసాదం అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈఓ జల్లేపల్లి వెంకటరావు మాట్లాడుతూ, "సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చే ఏ ఒక్క భక్తుడు కూడా అసౌకర్యానికి గురికాకుండా చూడటమే దేవస్థానం ప్రధాన లక్ష్యం. రద్దీ రోజుల్లో భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా నిరంతర పర్యవేక్షణతో ఏర్పాట్లు చేస్తున్నాం" అని తెలిపారు.

దేశీయ విత్తనాల రాఖీలను వినియోగించండి

ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ రాఖీలు వద్దే వద్దు - జీవరాశితో ఉన్నది ఒక్కటే భూగోళం అని మరవవద్దు-సమస్త జీవరాశిని పరిరక్షించడం మానవాళి బాధ్యత -వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ జెవి రత్నం

విశాఖపట్నం, ఆగస్టు 22 ప్రభాతవార్త

దేశీయ విత్తనాల రాఖీలను మాత్రమే వినియోగించండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం మద్దిలపాలెం లోని అక్షర ఇంగ్లీష్ మీడియం విద్యా సంస్థలో దేశీయ విత్తనాల రాఖీలు ప్రిన్సిపల్ సునీత అధ్యక్షతన నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ఏడాది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు సైతం విత్తనాల రాఖీలు వినియోగించాలని కోరారని ఆయన వివరించారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ తో రాఖీ లు వద్దే వద్దు అని వివరించారు. ఈ ప్లాస్టిక్ ఆధారంగా తయారు చేసిన రాఖీల వల్ల జీవరాశికి హాని కలుగుతుందని వివరించారు. జీవరాశితో ఉన్నది ఒక్కటే భూగోళం అని మరవవద్దు అని వివరించారు. సమస్త జీవరాశినీ పరిరక్షించడం మానవాళి బాధ్యత అని పేర్కొన్నారు. కంపెనీలు తమ లాభం కోసం కృత్రిమ రంగులతో, ప్లాస్టిక్ రాఖీలు నయనానందకరంగా తయారు చేయడం జరిగుతుందని, కానీ మనం వాటిని వినియోగిస్తే మానవాళికే కాదు సమస్త జీవరాశి కి నష్టం కలుగుతుందని వివరించారు. ప్రస్తుతం మనం ఉన్న పర్యావరణ పరిస్థితులలో ప్లాస్టిక్ రహిత రాఖీలు వినియోగించడం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, యాక్షన్ ఏడు సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో సమన్వయకర్త జె రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో పాల్గొని రాఖీలు తయారు చేయడం జరిగింది.

98 తనిఖీలు.. రూ.77,500 జరిమానాలు

ఆహార నాణ్యతపై జీవీఎంసీ ప్రత్యేక బృందాల కొరడా -10 జోన్లలో 20 ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు

విశాఖపట్నం, ఆగస్టు 22, ప్రభాతవార్త

నగర ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యంగా జీవీఎంసీ ప్రత్యేక తనిఖీలను ముమ్మరం చేసింది. ఈట్ రైట్ క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలోని 10 జోన్లలో 20 ప్రత్యేక ఎస్‌హెచ్‌ఈ బృందాలతో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఫుడ్ జాయింట్లు, వీధి ఆహార విక్రయ కేంద్రాలు, చిరు వ్యాపార సంస్థల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 14 నుంచి 21 వరకు నిర్వహించిన తనిఖీల్లో 98 తనిఖీలు చేపట్టి.. 35 ఆహార భద్రతా ఉల్లంఘనలు, 33 సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ ఉల్లంఘనలు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన 18 వ్యాపార సంస్థలకు నోటీసులు జారీ చేసి, మొత్తం రూ.77,500 జరిమానాలు విధించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ప్రస్తుతం 10 జోన్లలో ఒక్కో జోన్‌కు రెండు చొప్పున మొత్తం 20 ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కో బృందంలో శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ కార్యదర్శి, ఆహార తనిఖీ అధికారి ఉంటారు. ఆహార పదార్థాల నాణ్యత, ముడి సరుకుల ప్రమాణాలు, వంటశాలల పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలును ఈ బృందాలు పరిశీలిస్తున్నాయి. గత ఏడాది నుంచి తనిఖీలతో పాటు వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొన్ని సంస్థల్లో నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే చర్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, అవసరమైతే అదనపు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణను మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం తనిఖీల ఉద్దేశం కాదని, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా చూడటమే ప్రధాన లక్ష్యమని కమిషనర్ స్పష్టం చేశారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. హెచ్చరికలు, అవగాహన తర్వాత కూడా పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "సురక్షితమైన ఆహారం – ఆరోగ్యవంతమైన ప్రజలు – పరిశుభ్రమైన, ప్లాస్టిక్ రహిత విశాఖ" లక్ష్య సాధనకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు

పేద కార్యకర్తకు అండగా తెదేపా శ్రేణులు

ఆరిలోవ, ఆగస్టు 22, ప్రభాతవార్త

పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ పార్టీ అధిష్టానం అండగా నిలుస్తుందని, తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న పేద కార్యకర్తకు అండగా పార్టీ శ్రేణులు నిలవడం సంతోషంగా ఉందని తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు అన్నారు. ఈ మేరకు 12వ వార్డ్ సీనియర్ కార్యకర్త రేపాడ బసవ దేవుళ్ళు కుమార్తె వివాహం కోసం పార్టీ యువ నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర 25వేలు ఆర్థిక సాయం చేయడంతో వార్డ్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, క్లస్టర్ ఇంచార్జ్ గాడి సత్యం తో పాటు ముఖ్య నాయకులు కలిసి లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతులు మీదుగా 1,25000 వేల రూపాయలు పేద కార్యకర్త అయిన బసవ దేవుళ్లకు అందజేశారు. దీంతో ఆ కుటుంబం సభ్యులు అందరూ ఆనందం వ్యక్తం చేశారు.

విశాఖ ప్రజలకు రవాణా శాఖ సూచన

మాధవధార, ఆగస్టు 22, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముందుగా ప్రకటించిన ఆగస్టు 25 మంగళవారం సాధారణ సెలవును ఆగస్టు 26 బుధవారంకు మార్చారని ఉప రవాణా కమిషనర్ ఆర్‌సిహెచ్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. అయితే డ్రైవింగ్ టెస్ట్,ఎల్.ఎల్.ఆర్ కోసం ఆగస్టు 26వ తేది బుధవారంకు స్లాట్ బుక్ చేసుకున్న వారందరూ వారి స్లాట్ లను ముందు లేదా తరువాత తేదీలకు తమ స్లాట్‌లను మార్చుకోవాలని ఆయన తెలిపారు.సెలవు కారణంగా రవాణా శాఖ చేసిన మార్పులను గమనించాలని కోరారు.

సీతయ్యపేటలో ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీలు

మండల అధ్యక్షుడిగా గంపల రాజు ఎన్నిక

బుచ్చయ్యపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త

మండలంలోని సీతయ్యపేటలో మాదిగ దండోరా యువజన సేవా సంఘం తొలి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల నూతన మండల కమిటీలను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఆర్‌పీఎస్ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి పూసపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన నాయకులు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా గంపల రాజు, ఎంఎస్‌పీ మండల అధికార ప్రతినిధిగా గంపల రమణ, మాదిగ మహిళా సమైక్య మండల అధ్యక్షురాలిగా పెదమట్ల నాగమణి, వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా ఏలుసూరి పైడ్రాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగిత రెవెన్యూలో భూ బదలాయింపుపై గ్రామసభ నిర్వహించాలి: రైతులు వినతి

నక్కపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త

మండలంలోని కాగిత రెవెన్యూ పరిధిలో ఏఎన్ఎంఎస్‌కు భూములు బదలాయింపు ప్రక్రియను నిలుపుదల చేసేందుకు కాగిత రైతులతో గ్రామసభ నిర్వహించాలని కాగిత గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డి. సీతారామరాజును కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. కాగిత రెవెన్యూ లో చెరువుల గర్భం, గెడ్డ వాగులు, పాత గ్రామకంఠం, రహదారులు, నీటి వనరులు సుమారు 17 ఎకరాల భూమిని ఏ ఎం ఎన్ ఎస్ కు బగలాయింపు చేస్తున్నట్టు తాసిల్దార్ కార్యాలయం నుండి లెటర్ నెంబర్ 221తో ఈనెల 10వ తేదీన కాగిత గ్రామ సచివాలయం వద్ద 1ఏ నోటీసు ప్రదర్శించడం జరిగిందని రైతులు తెలిపారు. దీనిపై ఆక్షేపణలు అభ్యంతరాలు ఉంటే గ్రామసభ ద్వారా తెలియచేయాలని నోటీసులో పేర్కొనడం జరిగిందని తెలిపారు. దీనిపై కాగిత గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతుల అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని భూ బదలాయింపును వ్యతిరేకిస్తున్నట్టు తీర్మానం చేయాలని మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎంపీపీ వీసం నానాజీ, కాగిత గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, రైతులు దేవరపు శివ, పోతంశెట్టి బాబ్జి, దేవవరపు ఉమా, రాజా కోరారు.

VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, BODDU MARY OREEN W/O BODDU AJAY NIRMAL KUMAR previously called BODDU MARY ORINA R/O 54-16-41, YECHURI FORT APTS, KRM COLONY, SEETHAMMADHARA, VISAKHAPATNAM, now changed my name from BODDU MARY ORINA to BODDU MARY OREEN. Henceforth I will be called as BODDU MARY OREEN for all purposes. (Ro.No.21049)

★ I, BEELA YERN NAIDU S/O BEELA SATYANARAYANA, previously called BEELA YERNINAIDU R/O NEAR AADARSH PATASALA, BHOGAPURAM, VIZIANAGARAM, now changed my name from BEELA YERNINAIDU to BEELA YERN NAIDU. Hence forth I will be called as BEELA YERN NAIDU for all purposes. (Ro.No.21052)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

23skl13:23skl13.qxd 22-08-2026 21:42 Page 1

రాష్ట్ర స్థాయి పోటీలకు సమీర బిసాయి

కవిటి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సమీర బిసాయి (17) ఎంపికైంది. ఇటీవల శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జావలిన్ త్రో పోటీల్లో సమీర బిసాయి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. త్వరలో తిరుపతిలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జరుగునున్న రాష్ట్రస్థాయి పోటీల్లో సమీర బిసాయి పాల్గొననుంది. ఈ విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన రవి కుమార్ మహంతి, తోటారావుకు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞలతో పాటు అభినందనలు తెలిపారు.

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

ఇచ్చాపురం, ఆగస్టు 22, ప్రభాతవార్త:

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఇచ్చాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు. చిరంజీవి జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలు, మానవతా విలువలు, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం సభ్యులు పాల్గొని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడంతో పాటు మొక్కలు నాటారు. అభిమానులు, సేవాభిమానులు, కార్యక్రమ నిర్వాహకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 'చిరంజీవి గారి జన్మదినం అంటే అభిమానానికి మాత్రమే కాదు... సేవకు, మానవత్వానికి, సమాజ హితానికి మరో పేరు' అనే సందేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.ప్రసాద్, దాసరి అజయ్, తిప్పిన జనార్ధన రెడ్డి, అజ్జు, ఆరంగి వెంకటరావు, ఆర్.పుణ్యవాసులు, కేత్రీవాసులు, రఘు, కాళీ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ యోగా పోటీలకు సాయి జగదీష్

ఇచ్చాపురం, ఆగస్టు 22, ప్రభాతవార్త :

జిల్లా స్థాయి యోగ పోటీల్లో సత్తా చాటిన సాయి జగదీష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 6వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి యోగ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ యోగ పోటీల్లో సాయి జగదీశ్ పాల్గొననున్నారు. జిల్లా స్థాయిలో సాధించిన విజయాన్ని రాష్ట్ర స్థాయిలోనూ కొనసాగించి ప్రతిభ కనబరచాలని పలువురు క్రీడాకారులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయి జగదీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ కాలనీలో నీరు నిలవడంతో సహాయక చర్యలు

రాజాం, ఆగస్టు 22, ప్రభాతవార్త :

రాజాం పురపాలక సంఘ పరిధిలో గత రెండు రోజుల నుండి పడుతున్న వర్షం కారణంగా శ్రీకాకుళం రోడ్డులో ఉన్న డాక్టర్స్ కాలనీలో వర్షం నీరు నిలిచిపోవడం మున్సిపల్ కమిషనర్ దృష్టికి వచ్చిన వెంటనే కమిషనర్ ఏ.రామచంద్రరావు వారి సిబ్బందితో వెళ్లి సదరు ఏరియాలో రోడ్డుపై నిలిచిపోయిన నీటిని బైపాస్ చేసి కాలువలోకి మళ్లించి సమస్యను పరిష్కరించారు. కమిషనర్ సమస్యను తక్షణమే పరిష్కరించడం ద్వారా డాక్టర్స్ కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ప్రసాద్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

ఎర్రన్న క్రీడా ఉత్సవంలో ఎంపీ కప్-2026 చెస్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

శ్రీకాకుళం, ఆగస్టు 22, ప్రభాతవార్త :

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆలోచన నుండి పుట్టిన ఎర్రన్న క్రీడా ఉత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ఎంపీ కప్-2026 చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ప్రారంభమైన ఈ టోర్నీ రెండు రోజుల పాటు జరగనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని సుజాత, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, ఇతర అతిథులు, చెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సన్నాహక మ్యాచ్‌లో గొండు స్వాతి, మెండ దాసునాయుడులు తలపడ్డారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ క్యాప్‌లను అందించారు. కాగా స్త్రీ, పురుషుల విభాగాల్లో ఓపెన్ కేటగిరీతో పాటు అండర్-10, అండర్-15 విభాగాల్లో చెస్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆగస్టు 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొత్తం 430 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా, ఒక్కో క్రీడాకారుడికి ఆరు రౌండ్ల చొప్పున 1,600కు పైగా మ్యాచ్‌లు జరగనున్నాయి. చదరంగం క్రీడ ద్వారా మెదడుకు లభించే వ్యాయామం ఎంతో విలువైనదని అన్నారు. వ్యూహాత్మక ఆలోచన, ఏకాగ్రత, నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని చెస్ పెంపొందిస్తుందని అతిథులు పేర్కొన్నారు. ఎర్రన్న క్రీడా ఉత్సవం ద్వారా ప్రతి క్రీడాంశంలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు ప్రోత్సాహం లభించడం ఆనందంగా ఉందని, ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులకు ఇలాంటి వేదికలు మరింత ఉపయోగపడతాయని అన్నారు.

ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించండి

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

సీతంపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త :

ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. శనివారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రోగులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు ఇతర సౌకర్యాలపై సంబంధిత అధికారులతో చర్చించి, అవసరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ముదావత్ మల్లికార్జున్ నాయక్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో కలిసి గిరిజన ప్రాంతాలలో ఐటిడిఏ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆరఎంవో డాక్టర్ డి.వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా, మలేరియాపై ప్రత్యేక దృష్టి సారించాలి

-గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి

సీతంపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త :

గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనీమియా బాధితులపై ప్రత్యేక దృష్టి సారించాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ స్పష్టం చేశారు. సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఐటీడీఏ ఎస్సార్ శంకరం సమావేశ మందిరంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందించడంతో పాటు వ్యాధిపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గర్భిణీ స్త్రీలను ప్రసవానికి వారం రోజుల ముందుగానే గర్భిణీల వసతి గృహాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను సెప్టెంబర్ 10వ తేదీ నాటికి 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్, డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈఓ నారాయుడు, ఈఈ రమాదేవి, పీహెచ్‌వో వెంకట గణేష్, ఏవో సునీల్, డీపీఎం ఆర్.వి. రమణ, డీఈ నాగభూషణ్, క్రిష్ణ కుమార్, తహసీల్దార్ శ్రీకన్య, ఎంపీడీఓ మిశ్రో, జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు, జీసీసీ మేనేజర్ నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.

27న వ్యవసాయ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు స్పాట్ కౌన్సిలింగ్

వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ నీలవేణి

ఆముదాలవలస, ఆగస్టు 22, ప్రభాతవార్త :

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 27న మాన్యువల్ స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమదాలవలస మండలం తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపాన నీలవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి అనకాపల్లి ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో స్పాట్ కౌన్సిలింగ్ కొరకు అనుమతులు లభించాయని తెలిపారు. వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్ 7702394824ను సంప్రదించాలని కోరారు. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు పొందని వారు, కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకొని వారు కూడా అర్హులేనని తెలిపారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి

మహిళా భద్రత కమిటీలు గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం

కంచిలి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

కంచిలి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు సుధాకర్‌పై వెంటనే ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సై పారినాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడటం అత్యంత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు విద్యార్థుల్లో భయాందోళనలకు దారి తీస్తుందని అన్నారు. విద్యాసంస్థల్లో మహిళలకు భద్రత ఏమాత్రం ఉందో స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధిత విద్యార్థినికి పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. ఇలాంటి సంఘటనలో ప్రతిరోజు జరుగుతున్న కనీసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించకపోవడం దారుణమని అన్నారు. తక్షణమే విద్యాసంస్థల్లో విద్యార్థినుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థినికి న్యాయం జరిగే వరకు ఎఐఎస్ఎఫ్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, ఏఐఎస్ఎఫ్ నాయకులు లోకనాథం, జయరాం, మనోజ్, సంతోష్, మాధవ్ ,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కలలకు రెక్కలు తొడగాలి..

విజయానికి ఆత్మవిశ్వాసమే ఆయుధం'

చిత్రపరిశ్రమకు చెందిన ప్రదీప్ కొండిపర్తి

టెక్కలి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

విద్యార్థులు కలలను లక్ష్యాలుగా మలచుకుని, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నిరంతర కృషితో విజయ శిఖరాలను అధిరోహించాలని చిత్రపరిశ్రమకు చెందిన ప్రదీప్ కొండిపర్తి అన్నారు. టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ డా. కె.సోమేశ్వరరావు అధ్యక్షతన అలుమ్ని సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2005 నుంచి 2020 వరకు వివిధ బ్యాచ్‌లకు చెందిన సుమారు 350 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రదీప్ కొండిపర్తి విద్యార్థులతో మమేకమై పలు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయం ఒక్కరోజులో దక్కేది కాదని, నిరంతరం నేర్చుకోవడం, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవడం, లక్ష్య సాధనకు పట్టుదలతో ముందుకు సాగడం విజయానికి బాటలు వేస్తాయని అన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మకత, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయన కళాశాల ప్రాంగణాన్ని సందర్శించి విద్యా భవనాలు, ప్రయోగశాలలు, ఉద్యానవనం, క్రీడా మైదానాలు తదితర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను, కళాశాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐతం కళాశాల అభివృద్ధి ప్రస్థానాన్ని వివరించారు. 'వివిధ రంగాల్లో స్థిరపడిన అలుమ్ని విద్యార్థులు ఐతం కళాశాలకు గర్వకారణం. అలుమ్ని క్యాంపస్‌కు చిరస్మరణీయ జ్ఞాపకం.. కళాశాల అభివృద్ధికి బలమైన వెన్నెముక. పూర్వ విద్యార్థుల అనుభవాలు, సూచనలు, సహకారం కళాశాల భవిష్యత్ ప్రగతికి ఎంతో విలువైనవి' అని అన్నారు. చైర్మన్ డా. కె.సోమేశ్వరరావు మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఐతం ప్రస్థానంలో చిరస్మరణీయ ఘట్టమన్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ కళాశాల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ప్రస్తుత విద్యార్థులతో అనుభవాలను పంచుకున్నారు. పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఆత్మీయ కలయికతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, డైరెక్టర్లు కె.మధుకుమార్, నాగశేషు, ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్.శ్రీనివాసరావు, అలుమ్ని కోఆర్డినేటర్ డా. డి.యుగంధర్, డీన్లు, హెచఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన

ఆమదాలవలస, ఆగస్టు 22, ప్రభాతవార్త :

నియోజకవర్గం అభివృద్ధి కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యమని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మండలంలో తురకపేట గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం సంక్షేమ విజయాలు ప్రజా పాలన ఇంటింటికీ అభివృద్ధి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, వండాల ఉదయ్ కుమార్, తమ్మినేని అమర్నాథ్, నాని, మామిడి చిన్నారావు, శెట్టి పద్మ, గురుగుబెల్లి మోహన్‌రావు, అప్పలనాయుడు, అన్నెపు భాస్కర్‌రావు, గోండు రమణమూర్తి, నేతింటి జ్యోతీశ్వరరావు, బెండి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

చింతాడతో పాటు మరో 26 మందిపై అక్రమ కేసులు

కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట : ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

ఆమదాలవలస, ఆగస్టు 22, ప్రభాతవార్త :



ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను ఏపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆయన తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతాడ రవికుమార్‌తో పాటు మరో 26 మందిపై అక్రమంగా కేసులు నమోదు చేసి, ఈ కేసులో సరైన ఆధారాలు లేకపోయినా వారిని అరెస్టు చేసి జైలుకు పంపడం కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు పరాకాష్ట అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సరుబుజ్జిలి జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, బూర్జ మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, వావిలపల్లి మురళి, ఈసాయి వెంకటరావు, బగాది కుబేరుడు, కర్నేన నాగేశ్వరరావు, జల్లు బలరాం, బూరి శ్రీరామ్మూర్తి, జడ్డు మహేష్,జల్లు ఆదినారాయణ, కొంచాడ రమణ మూర్తి, తొత్తడి సురేష్ కుమార్,సాకేటి శ్రీనివాసరావు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుండపోత వర్షం... రైతు కళ్ళల్లో ఆనందం

సంతబొమ్మాళి, ఆగస్టు 22, ప్రభాతవార్త:

బంగాళాఖాతం ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం వేకువజాము నుంచి కురుస్తున్న వర్షం వర్షాకాలం ను తలపిస్తుంది. సంతబొమ్మాళి మండలంలో గత రెండు నెలలుగా ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో ఎట్టకేలకు రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుంది. ఇటీవల కాలంలో అప్పుడప్పుడు వర్షం రావడం వెంటనే ఎండ కాయడం పరిపాటిగా మారింది. అయితే శనివారం ఏకధాటిగా కురుస్తున్న వర్షం వరి చేలకు దాహార్తి తీర్చే విధంగా పడడంతో రైతన్నలు కొంత వరకు ఊపిరి పీల్చుకున్నారు. ఒక పక్క కాలువ నీరు రావడం మరోపక్క ఈ కుండపోత వర్షం రైతంగానికి ఎంతో మేలు చేకూర్చిందని అంటున్నారు.

శ్రీకాకుళం వార్త

పరిష్కారం చూపని శాసనమండలి సమావేశాలు ఎందుకు?

ఎమ్మెల్సీ రామారావు

కవిటి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

సమస్యలకు పరిష్కారం చూపని శాసన మండలి సమావేశాలు ఎందుకు నిర్వహించాలో అర్థం కావటం లేదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శనివారం లండారిపుట్టుగ పంచాయతీ కొత్తపుట్టుగ గ్రామంలో ఎమ్మెల్సీ రామారావు క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా జరిగిన శాసల మండలి సమావేశాల్లో పలు సమస్యలపై ప్రశ్నించి పరిష్కారం చూపడానికి ప్రయత్నం చేస్తే ఎటువంటి అవకాశం లేకుండా ముగిసిపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు డీఎస్సీపై జరిగిన అవకతవకలు గూర్చి ప్రభుత్వాన్ని నిలదీస్తామంటే నాలుగు రోజులు పాటు తప్పించుకునే ధోరణి మండలంలో ప్రదర్శించింది. 2025 డీఎస్సీపై సిబిఐ విచారణకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవసరమని డిమాండ్ చేస్తుంది. సిబిఐ ఎంక్వయిరీ వేసే దానికి ప్రభుత్వం భయపడుతుంది. ఈ ప్రభుత్వం సక్రంగా పరీక్ష నిర్వహించి ఉంటే భయమెందుకు అంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలదీస్తుంది అంటూ ఆయన అన్నారు. ఈ సమావేశాల ద్వారా రాష్ట్ర జిల్లా నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తామంటే సభను సజావుగా ప్రభుత్వం నిర్వహించలేక పోయింది. రాష్ట్రానికి ముఖద్వారంగా ఉన్నటువంటి ఇచ్చాపురం పట్టణానికి ప్రవేశ వంతెన కూలిపోయి మూడు సంవత్సరాలు గడిచిన మా ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి తీసుకొచ్చిన జీవోను రద్దు చేయడం తప్పిస్తే బహుద నదిపై వంతెన నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేసింది ఏమీ లేదని అన్నారు. అందుచేతనే మీడియా ద్వారా మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నామని ఆయన అన్నారు. ఈయనతో పాటు కవిటి మండల వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ పాల్గొన్నారు.

అక్రమ పశువుల రవాణాను అడ్డుకున్న పోలీసులు

కవిటి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

ఒడిస్సా ప్రాంతం నుండి అక్రమంగా తరలిస్తున్న ఆరు గేదెలను తరలిస్తున్న మూడు వాహనాలను కవిటి పోలీసులు అడ్డుకొని స్వాధీనం చేసుకున్న వైనం శనివారం జరిగింది. కవిటి మండలం కొజ్జిరియా జంక్షన్ వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయంలో కవిటి పోలీసులు పర్యవేక్షణ చేస్తుండగా ఒడిస్సా రాష్ట్రం ప్రాంతం నుండి అక్రమంగా మూడు వాహనాల్లో ఆరు గేదెలను తరలిస్తున్నారు. పోలీసులు పరిశీలించి ఈ మూడు వాహనాలతో పాటు గేదెలను తమ అదుపులో తీసుకొని కేసు నమోదు చేశారు. గేదెలను రవాణా చేస్తున్న వ్యక్తులంతా రాజమండ్రికి చెందిన ఐదుగురుగా పోలీసులు గుర్తించారు. గేదెలను అక్రమంగా తరలిస్తున్న వీరిపై కవిటి పోలీసులు కేసు నమోదు చేసి వాహనాలను అదుపులోకి తీసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

దీక్షా యాప్, దీక్ష కోర్సుపై అప్డేట్

జలుమూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త :

మండలంలోని సెకండరీ స్కూల్, హై స్కూల్స్ ఉపాధ్యాయులకు శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ శిక్షణా తరగతులను నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు పేర్కొన్నారు. జడ్పీహెచఎస్ స్కూల్, చల్లవానిపేట నందు గణితం, సాంఘిక శాస్త్రమునకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్లకు, జడ్.పి.హెచ్.ఎస్ జలుమూరు, శ్రీముఖలింగం నందు ఎస్జీటీలకు క్లస్టర్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలో ఉన్న మండల కోఆర్డినేటర్లు సందర్శించి దీక్షా యాప్‌ను డౌన్లోడ్ చేయని ఉపాధ్యాయ మిత్రులు ఉన్నట్లయితే దీక్ష యాప్‌తో పాటు దీక్ష కోర్సెస్ యాప్‌లను డౌన్లోడ్ చేయించి ప్రొఫైల్ అప్డేట్ చేయించి, ఆస్క్ దీక్ష క్యూఆర్ కోడ్ వినియోగము, తదితర విషయాలను ఉపాధ్యాయ మిత్రులకు తెలియజేయాలని తెలిపారు. ఈ సెక్షన్‌లో భాగముగా సెప్టెంబర్‌లో చెప్పవలసిన పాఠ్య ప్రణాళికలపై కు లంకశముగా సిఆర్పిలు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు, ఎం వి ఆర్ ఎస్ ప్రసాదరావు, క్లస్టర్ కాంప్లెక్స్ నిర్వాహకులు, సి ఆర్ ఎం టి లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే సహించేది లేదు

-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

జిల్లాలో ఏ ఒక రైతు ఇబ్బందులు పడకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 4,08,995 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 3,65,604 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సాగు విస్తీర్ణానికి రెండో దశ వరకు 26,440 టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 25,860 టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు తెలిపారు.

గ్రామాల ప్రతిష్ట పెంచేలా అభివృద్ధి : అచ్చెన్న

టెక్కలి, ఆగస్టు 22, ప్రభాతవార్త :

గ్రామాల ప్రతిష్ట పెరిగేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని భగవాన్ పురం, చింతల గార గ్రామాల్లో శనివారం మంత్రి పర్యటించారు. చింతల గారా గ్రామంలో రూ. 17.60 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో రక్షితమైంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. భగవాన్‌పురం, చింతల గారా గ్రామాల్లో రూ.268 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే జిల్లా సమగ్ర ప్రగతికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.వర్షపాతం లోటు ఉన్నప్పటికీ వంశధార నీటిని కాలువల ద్వారా రైతాంగానికి సాగునీరు అందించి, రైతులకు అండగా నిలిచామని తెలిపారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేల చొప్పున అందిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న పట్టు మహాదేవా కోనేరులో ఏర్పాటు చేయనున్న స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులు బాగాది శేషగిరిరావు, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, మండల అభివృద్ధి అధికారి అలివేలు మంగ, తహసిల్దార్ రాంబాబు, ఎంపీడీవో రేణుక, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పలాస రైల్వే స్టేషన్‌లో ఏడిఆర్‌ఎం ఆకస్మిక తనిఖీ



పలాస, ఆగస్టు 22, ప్రభాతవార్త :

విశాఖపట్నం రైల్వే డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ కుందు రామారావు పలాస రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో సీనియర్ రైలు మేనేజర్ (సీనియర్ టిఎంఆర్ / సీనియర్ గార్డ్) కె. భాస్కరరావు మద్యం సేవించి విధులకు హాజరైనట్లు అధికారులు గుర్తించారు. ప్రయాణికుల భద్రత, రైళ్ల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించినందుకు గానూ తక్షణమే సస్పెండ్ చేస్తూ ఏడిఆర్‌ఎం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడిఆర్‌ఎం మాట్లాడుతూ... రైల్వే శాఖలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, క్రమశిక్షణా రాహిత్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. విధుల్లో అజాగ్రత్తగా ఉండే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటా యని హెచ్చరించారు. రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియజేశారు.

రాఖీ మధురిమలు !

'అన్నా చెల్లెలు..అక్కా తమ్ముడు.. ఎంత అందమైన అనుబంధం కదూ! ఊహ తెలిసింది మొదలు ఆటపాటలతో, అల్లరి చేష్టలతో, కబుర్లా కాలక్షేపాలతో గడిచిపోతుంది. పెళ్లిళ్లయ్యి ఎవరి దారిన వారెళ్లినా. ఆ ప్రేమ అంతే తియ్యందనం పంచుతుంది. కొండంత ఆలంబన అందిస్తుంది. రాఖీ వేళ మీకిష్టమైన సోదరుల కోసం ఈ మధుర మిఠాయిలు..

మటర్ బర్ఫీ..

పచ్చి బఠాణీలు-పావుకిలో, పాలపొడి, జీడిపప్పు పొడి,ఎండుకొబ్బరి పొడి-కప్పు చొప్పున, పంచదార-2 కప్పులు, నెయ్యి-అరకప్పు, బాదం పలుకులు-చెంచా

తయారీ : పచ్చి బఠాణీలను ఉడికించి.. చల్లారాక నీళ్లు తీసేసి గ్రైండ్ చేయాలి. ఒక పాత్రలో నెయ్యి వేసి బఠాణీ గుజ్జును వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాత్రలో పంచదార తీగ పాకం తయారుచేసి.. అందులో వేయించిన బఠాణీ పేస్టు వేసి, సన్న సెగ మీద ఉడికిస్తూ తర్వాత పాలపొడి వేయాలి. ఉండ కట్టకుండా కలియ తిప్పుతుండాలి. దగ్గరపడిన తర్వాత ఎండుకొబ్బరి పొడి, జీడిపప్పు పొడి వేయాలి. పాత్రకు అంటుకోకుండా ఉన్నప్పుడు దించేయాలి. పళ్లెంలో నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని సమంగా సర్ది, పైన బాదం పలుకులు వేయాలి. చల్లారాక ముక్కలుగా చేసుకోవడమే.

బాదం పేడా..

బాదం పప్పు-రెండు కప్పులు, పంచదార-కప్పు, పాలపొడి, నెయ్యి- అరకప్పుచొప్పున, కుంకుమ పువ్వు-కొద్దిగా. **తయారీ :** బాదంపప్పు రెండు నిమిషాలు ఉడికించాలి. పొట్టు తీసి మిక్సీ జార్‌లో వేసి, అరకప్పు పంచదార, రెండు చెంచాల నీళ్లు, కుంకుమ పువ్వు జతచేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని అడుగు భాగం మందంగా ఉన్న గిన్నె లో వేసి అరకప్పు పాల పొడి, చెంచా నెయ్యి వేసి కలియతిప్పుతూ దగ్గరపడేలా చేయాలి. చల్లారాక.. చిన్న ఉండలుగా తీసుకుని పేడాల్లా చేయాలి. వాటి మధ్యలో బాదం పప్పు అలంకరిస్తే సరి.. మధురమైన బాదం పేడా రెడీ

డ్రై ఫ్రూట్స్ మోదక్ ..

కావలసినవి : అంజీర-10, గింజలు లేని ఖర్జూరపండ్లు-20, బాదంపప్పు-కప్పు, వాల్‌నట్స్, పల్లీలు, ఎండుకొబ్బరికోరు- పావుకప్పు చొప్పున, జీడిపప్పు-15, పిస్తా-పది, నువ్వులు, గసగసాలు-చెంచా చొప్పున, నెయ్యి-తగినంత, యాలకుల పొడి-పావు చెంచా **తయారీ :** అంజీర, ఖర్జూర పండ్లను రెండు గంటలు నానబెట్టాలి. బాదంపప్పు, పిస్తా, వాల్‌నట్స్, పల్లీలు, జీడిపప్పులను కచ్చాపచ్చా దంచి కడాయిలో వేయించి పక్కన పెట్టుకోవాలి. నువ్వులు, గసగసాలు వేయించి అవి కాస్త వేగాక, ఎండు కొబ్బరికోరు వేసి వేయించాలి. నానబెట్టిన డ్రైఫ్రూట్స్‌ను గ్రైండ్ చేసి, నేతిలో వేయించాలి. అందులో తక్కినవి వేసి సన్నసెగ మీద కలియ తిప్పుతూ నాలుగు నిమిషాలు ఉంచాలి. చివర్లో యాలకుల పొడి వేసి దించేయాలి. మోదకాలు చేసే అచ్చులో (మౌల్డ్) నెయ్యి రాసి ఈ మిశ్రమం ఉంచి నొక్కి తీస్తే సరి. నోరూరించే డ్రై ఫ్రైట్స్ మోదక్‌లు సిద్ధం.

కాజు కలశ్

జీడిపప్పు-2 కప్పులు, పంచదార-కప్పు, కుంకుమ పువ్వు-కొద్దిగా, నెయ్యి-అరకప్పు. **తయారీ :** జీడిపప్పును గ్రైండ్ చేసి పక్కన ఉంచుకోవాలి. కొన్ని నీళ్లు పోసి పంచదారను తీగ పాకం పట్టాలి. అందులో జీడిపప్పు పొడి వేసి కలియతిప్పుతూ సన్న సెగ మీద గట్టిపడేలా చేసి, చివర్లో కుంకుమ పువ్వు వేయాలి. స్టవ్వు కట్టేసి చల్లారాక మిశ్రమం మరింత మృదువుగా అయ్యేట్లు కలపాలి. చిన్న ఉండలుగా చేసి, ఒక్కో దాన్నీ కలశంలా చేయాలి. పిండి ఎండినట్లయితే కొద్దిగా నెయ్యి జోడించవచ్చు. కలశం మధ్యలో బాదంపప్పు, పిస్తాలు అలంకరిస్తే రుచితో పాటు అద్వితీయమైన అందం వస్తుంది. పూజలు, వేడుకల్లాంటి సందర్భాల్లో ఈ కలశాకృతి మిఠాయి ప్రత్యేకంగా ఉం టుంది.

కొబ్బరి లడ్డు

కొబ్బరి తురుము-పావు కిలో, కండెన్స్‌డ్ మిల్క్, ముప్పావు కప్పు, నెయ్యి- పెద్ద చెంచా, ఇలాచీ పొడి-అర చెంచా, కాజు-గుప్పెడు. **తయారీ :** పొయ్యి మీద పాన్ పెట్టి కాస్తంత నెయ్యి వేయాలి. దీంట్లో కాజు వేసి వేయించాలి. ఇవి లేత బంగారు రంగులోకి వచ్చాక తాజా కొబ్బరి తురుము వేసి చిన్న మంటపై రెండు,మూడు నిమిషాలు వేయించాలి. దీంట్లో కండెన్స్‌డ్ మిల్క్ అందుబాటులో లేకపోతే పాలు, పంచదార రెండింటినీ కలిపి వాడుకోవచ్చు. ఈ వంటకం పూర్తి అయ్యే వరకు మంట చిన్నగానే ఉండాలి. పాలు కలిపాక కాసేపువేయించి, యాలకుల పొడి వేసి మరికాసేపు కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చి చేతులకు నెయ్యి రాసుకుని లడ్డూలను తయారు చేసుకోవాలి. ఈ కమ్మని కొబ్బరి లడ్డూను రుచి చూసేయండి మరి. □

కోకోనట్ బర్ఫీ

కొబ్బరికోరు-3 కప్పులు, పంచదార-2 కప్పులు, పాలు-అరకప్పు,మలై క్రీమ్-2 చెంచాలు, యాలకుల పొడి-పావు చెంచా, డ్రై ఫ్రైట్స్ పలుకులు-కొద్దిగా **తయారీ :** కొబ్బరికోరు, పాలు, పంచదారలను అడుగు భాగం మందంగా ఉన్న గిన్నెలో వేసి కలియ తిప్పుతూ సన్న సెగ మీద ఉడికించాలి. దగ్గరపడ్డాక మలై క్రీమ్ వేయాలి. పాత్రకు అతుక్కోకుండా ఉందంటే చక్కగా తయారైనట్లు. అప్పుడు యాలకుల పొడి వేసి, అర నిమిషం ఉంచి దించేయాలి. ఒక ట్రేలో నెయ్యి రాసి మిశ్రమాన్ని సమంగా పరిచినట్లు సర్దాలి. పదినిమిషాల తర్వాత నడ్రై ఫ్రూట్స్ పలుకులు పైన అద్ది నచ్చిన ఆకృతిలో ముక్కలుగా చేసుకోవాలి. కేవలం అరగంటలో తయారయ్యే కోకోనట్ బర్ఫీ అద్భుత రుచితో ఆకట్టుకుంటుంది.

నీళ్లకూ ఓ లెక్కుంది !

ఒక మనిషి రోజు కెన్ని నీళ్లు తాగాలి. అసలు తాగాలా? వద్దా? తాగాల్సివస్తే ఎన్ని తాగాలి అన్న అంశంపై వివరణాత్మక వ్యాసాలకే మీ కొదువలేదు. అయినా ఎంత మంది వాటిని పాటిస్తున్నారు. అన్నది సదేహాస్పదమే. మన శరీరానికి నీటితో ఎంత పని ఉందో? దాహం వేస్తేనే వాళ్ల అవసరం ఉన్నట్లు కాదు. దాహం వేయకపోయినా శరీరానికి తగినంత నీరు అవసరమే. ఐదు సంకేతాలతో బేరీజు వేసుకుని నీటిపై శ్రద్ధ చేయండి. చేతి వెనుక భాగంలో కొద్దిగా చర్మాన్ని వేళ్లతో మెల్లగా పైకి లాగి వదలాలి. అది వెంటనే మునుపటి స్థితికి వస్తే సాధారణంగా శరీరంలో నీరు తగినంతగా ఉందని అర్థం. చర్మం కొంతసేపు పైకి లేచినట్టే ఉండిపోతే నీటి కొరతకు సంకేతం కావచ్చని నిపుణురాలు చెబుతున్నారు.పెదాలు తరచూ పొడిబారి పగిలిపోవడం, పొట్టు ఊడటం వంటివి కనిపిస్తే ద్రవాలు తీసుకోవడంపై దృష్టి పెట్టాలి. తగినంత నీరు తీసుకునే వారిలో పెదాలు సాధారణంగా మృదువుగా, తేమగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు.నీటి కొరత వల్ల కొంతమందిలో తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. తరచూ తలనొప్పి లేదా మైగ్రేన్ రావడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ.. శరీరానికి తగినంత ద్రవాలు అందకపోవడం కూడా వాటిలో ఒకటి కావచ్చని నిపుణురాలు చెబుతున్నారు.శరీరంలో నీటి స్థాయిని అంచనా వేయడానికి సులభమైన మార్గాల్లో మూత్రం రంగును గమనించడం ఒకటి. సాధారణంగా లేత పసుపు లేదా గడ్డి రంగులో ఉంటే నీరు తగినంతగా తీసుకుంటున్నట్టుగా భావించవచ్చు. ముదురు పసుపు రంగులో ఉంటే ద్రవాల అవసరం ఉండొచ్చని సూచిస్తుంది. అయితే ఎప్పుడూ పూర్తిగా రంగులేనట్టుగా ఉండే మూత్రం మాత్రం అవసరానికి మించి నీరు తాగుతున్నారనే సంకేతం కావచ్చని నిపుణురాలు తెలిపారు.నీళ్లు తాగిన ప్రతిసారీ వెంటనే మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంటే.. రోజంతా తీసుకుంటున్న ద్రవాల పరిమాణాన్ని గమనించాలని నిపుణురాలు సూచిస్తున్నారు. నీరు తాగిన తర్వాత శరీరం కొంతసేపు దానిని నిలుపుకోగలగడం సాధారణమేనని పోషకాహార నిపుణురాలు దీపశిఖా జైన్ పేర్కొన్నారు. □

చిట్కా

భుక్త్వోపా విసస్థాంద్: ఆహారాన్ని తీసుకున్న తర్వాత ఎప్పుడూ పనిలేకుండా కూర్చోవద్దు. కనీసం 100 అడుగులు అయినా నడవండి.
క్షుత్ సాధూతం జనయతి: ఆకలి, ఆహార రుచిని పెంచుతుంది. (ఇంకా చెప్పాలంటే, ఆకలితో ఉన్నప్పుడు మాత్రమే తినండి.)
చింతా జరానామ్ మనుష్యానమ్: చింతించడం అనేది వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. కనుక అనవసరపు చింతలతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోకు.
సతం విహాయ భోక్తవ్యం: ఆహారం తీసుకొనే సమయం వచ్చినప్పుడు, ఎంతటి పనినైనా కూడా పక్కన పెట్టండి. నిదానంగా భోజనం చేయండి. వేగంగా తినడం, పని ఉందని అసలు భోజనమే మానివేయడం చాలా అనర్థదాయకం, **సర్వ ధర్మేశు మధ్యమామ్:** ఎల్లప్పుడూ మధ్యే మార్గాన్ని ఎంచుకోండి. దేనిలోనైనా విపరీతంగా వెళ్లడం మానుకోండి. ఈ ఆరోగ్య సూత్రాలు పాటించిన వారికి చిరాయువు, నిత్య ఆరోగ్యం తప్పక లభిస్తాయి □

ఉత్తమగతులే దానఫలం

ఎలా సంపాదిస్తేనేం .. సంపాదించడమే ముఖ్యమని కొందరు భావిస్తారు. అలా సంపాదించిన దానిలో కొంత దానం చేస్తూనే వున్నాం కదా అనుకుంటారు. అలా దానం చేయడం వలన పాపమేదైనా వుంటే కొంతవరకూ నశిస్తుందనీ, పైగా పుణ్యరాశి పెరుగుతుందని భావిస్తారు. కానీ ఇలాంటి దానాలు చేయడం వలన పుణ్యరాశి ఎంతమాత్రం పెరగదని శాస్త్రాలు చెబుతున్నాయి. దానం అంటే ఇవ్వడం అని అర్థం. భగవంతు డు మనకి ఇచ్చిన దాంట్లో ఎంతో కొంత ఇతరులకి సాయం చేయాలి. అలా చేసే దానం .. మనం ధర్మబద్ధంగా సంపాదించి నదై ఉండాలి. అవతలవారు ఆపదలో వున్నప్పుడు, ధర్మబద్ధమైన ధనాన్ని దానంగా ఇవ్వడం వల్లనే అది నిజమైన దానం అవుతుంది. అలాంటి దానం వల్లనే పుణ్యరాశి పెరుగుతుంది. దానగుణమంత గొప్పది ఏదీ లేదని శాస్త్రాలు చెబుతున్నాయి. ఒక బీజం నాటితే అది ఎన్నో ఫలాలను ఇచ్చినట్టుగా, దానం కూడా అనేక రెట్ల ఫలాలను ఇస్తుందని స్పష్టం చేస్తున్నాయి. భగవంతుడిని చేరుకోవడానికీ .. పరలోకంలో ఉత్తమగతులు కలగడానికి దానానికి మించిన మార్గం లేదనేది మహర్షుల మాట. కర్ణుడు ..శిబి చక్రవర్తి .. బలి చక్రవర్తి వంటి వారెందరో, దాన గుణం వల్లనే శాశ్వతమైన కీర్తిని సంపాదించుకున్నారు. □

తెర

సెప్టెంబర్ 3న వస్తున్న 'రోమాంచకం'

బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం' సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తు న్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ సునీల్ నారంగ్ మాట్లాడుతూ 'రోమాంచకం' సక్సెస్ పై మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ సినిమా డెఫనెట్ గా హిట్ అవుతుంది. నటి కీర్తన మాట్లాడుతూ ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన డైరెక్టర్ వేణుగోపాల్ గారికి థ్యాంక్స్.డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమా కథను రెండు గంటల పాటు సందీప్, ప్రణయ్‌లకు చెప్పాను. వాళ్లిద్దరు కథ విన్న వెంటనే మనం ఈ సినిమా చేస్తున్నామని చెప్పారు. సందీప్ వంగా ఏ రోజూ మా పనిలో జోక్యం కలిగించుకోలేదు. ఇది నీ విజన్, నీ సినిమా, నీ లైఫ్ అని చెప్పి జస్ట్ డూ ఇట్ అనేవారు. ఫస్ట్ కట్ చూశాక సందీప్ వంగా ఒక బీర్ ఓపెన్ చేసి ఆస్కార్ అవార్డ్ లా నా చేతికి అందించారు. హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్ మాట్లాడుతూ మా రోమాంచకం సినిమా సెప్టెంబర్ 3న రిలీజ్ అవుతోంది. ప్రొడ్యూసర్ ప్రణయ్‌రెడ్డి వంగా మాట్లాడుతూ డైరెక్టర్ వేణుగోపాల్ పదిహేను నెలల క్రితం ఈ కథ చెప్పారు. స్క్రిప్ట్ మొత్తం హిలేరియస్‌గా నెరేట్ చేశారు. అన్ని క్యారెక్టర్స్ ను తనే పర్ ఫార్మ్ చేసి చూపించారు. స్క్రిప్ట్ మమ్మల్ని ఇంప్రెస్ చేసింది.

'మహావీర్ కర్ణ' డిసెంబర్ 4న విడుదల

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు పెన్ మూవీస్, శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్.. ఆర్‌వీ స్టూడియోస్‌తో కలిసి 'మహావీర్ కర్ణ'అనే ఎపిక్ హైబ్రిడ్ లైవ్ యాక్షన్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాయి. భారతీయ సినిమాను సరికొత్త విజువల్ ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రూపొందిస్తు న్నారు. ఈ చిత్రాన్ని జయంతీలాల్ గడా సమర్పిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు రమేష్ వర్మ ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్, థ్రిల్లర్, కమర్షియల్ సినిమాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ రమేష్ వర్మ.. ఇప్పుడు సరికొత్త జోనర్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. మహాభారతంలోని చిరస్మరణీయమైన కర్ణుడి కథను ఆధారంగా చేసుకుని మహావీర్ కర్ణను తెరకెక్కిస్తు న్నారు. ఈ ప్రయోగాన్ని మరింత ఆసక్తికరంగా మార్చే అంశం కర్ణుడి కథనే ఈ చిత్రానికి భావోద్వేగ కేంద్రంగా ఎంచుకోవడం. కర్ణుడి కథ కేవలం కీర్తి కోసం పోరాడిన ఓ యోధుడి కథ మాత్రమే కాదు.. అన్నింటికంటే ఎక్కువగా తన మాటకే విలువ ఇచ్చిన ఓ మహా వీరుడి కథ. కుంతీ దేవికి జన్మించినప్పటికీ రాజకుటుంబానికి దూరంగా పెరిగిన కర్ణుడు.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, తన అపారమైన దానగుణంతో వీరుడైన కర్ణుడు తనలోని ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని చాటుకున్నాడు. లేటెస్ట్‌గా 'మహావీర్ కర్ణకు సంబంధించిన టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్‌లోనే కర్ణుడి ఈ ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని బలంగా చూపించారు. యోధులు, రాజ్యాలు, ఆయుధాలు, అద్భుతమైన విజువల్స్ వంటి భారీ అంశాలు ఆకట్టుకున్నప్పటికీ.. ప్రేక్షకుల మనసులో నిలిచేది మాత్రం తాను ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబడే కర్ణుడి వ్యక్తిత్వమే.

మెగాస్టార్ చిరంజీవి పవర్‌ఫుల్ టైటిల్ 'కాకా'

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ మూవీ Mega158 / ChiruBobby2, వెంకట్ కే నారాయణ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా ప్రకటన నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. కె. సత్యం, సూపర్‌వైజర్‌గా చిరంజీవి ఆక్వా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. చెన్నై టీమ్‌కు ఫోన్ చేసి లోడ్ సమయానికి వస్తుందని చెబుతూ అందరినీ పలకరిస్తారు. సునీల్ లీవ్ అడగగా, తమ టార్గెట్ ఫెస్టివల్ అని చెప్పి లీవ్‌ను తిరస్కరి స్తారు. గెటప్ శ్రీను స్కూటర్ కీస్ గురించి చెప్పగా సత్యం వాటిని విసరమని చెబుతారు. ఆ తర్వాత కళ్లద్దాలు పెట్టుకున్న చిరంజీవిని చూపిస్తూ 'కాకా టైటిల్‌ను రివీల్ చేయడం ఆదరిపోయింది. "కాకా' టైటిల్ 'పవర్‌ఫుల్‌గా ఉంది. టైటిల్ గ్లింప్స్ కూడా స్ట్రైకింగ్ విజువల్స్, డిఫరెంట్ సెటప్‌తో వెంటనే ఆకట్టుకుంటుంది. చిరంజీవిని అభిమానులకు, మాస్ ఆడియన్స్‌కు బలంగా కనెక్ట్ అయ్యేలా ప్రజెంట్ చేయడంలో బాబీ కొల్లి మరోసారి తన మార్క్ చూపించారు. చిరంజీవి తన స్క్రీన్ ప్రెజెన్స్ తో మెస్మరైజ్ చేశారు. బాబీ మెగాస్టార్‌ను రెండు విభిన్నమైన లుక్స్‌లో ప్రజెంట్ చేశారు. మిడిల్ క్లాస్ అవతార్‌లో చిరంజీవి చాలా సహజమైన చార్మ్ తో కనిపించగా, యంగ్ వెర్షన్‌లో ఆయన యాటిట్యూడ్, ఎనర్జీ ఆకట్టుకుంటాయి. గన్ ఫైరింగ్ సీక్వెన్స్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, ఈజీగా చూపించే స్వాగ్ మంచి మాస్ మూమెంట్‌ను క్రియేట్ చేశాయి. ముఖ్యంగా చివరి షాట్ బలమైన ఇంపాక్ట్‌ను ఇస్తుంది.సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ తన డైనమిక్ విజువల్ లాంగ్వేజ్‌తో గ్లింప్స్‌ను మరింత ఆసక్తికరంగా మలిచారు. ప్రారంభ సన్నివేశాల్లో కెమెరా దాదాపు చిరంజీవి పాత్రతో పాటు ప్రయాణిస్తున్నట్టుగా ఇమ్మర్సివ్ ఫీల్‌ను కలిగిస్తుంది. ఆ తర్వాత గ్లింప్స్ ముందుకు వెళ్లే కొద్దీ హై ఎనర్జీ ఫ్రేమ్స్, మాస్ ఎలివేషన్స్‌తో విజువల్స్ ఆకట్టుకున్నాయి.

తొలివారంలో 5 కోట్ల గ్రాస్ సాధించిన' హుషార్ పిట్టలు'

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు అన్షు, వాసవి గణేషన్ జంటగా రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషార్ పిట్టలు' పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించిన ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేశాయి. మౌత్‌టాక్‌తో హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో బ్లాక్‌బస్టర్ విజయంగా నిలిచింది. తొలివారంలో ఈ చిత్రం 5 కోట్ల 27 లక్షల గ్రాస్‌ను సాధించి విజయవంతంగా రెండోవారంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా మూవీ టీమ్ థ్యాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో దర్శకుడు బిక్షు మాట్లాడుతూ చిన్న సినిమాగా వచ్చి పెద్ద సినిమాల మధ్యలో హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతోంది. రెండవారంలో కూడా అడుగుపెట్టినందుకు ఆనందంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి బర్త్‌డే రోజు మా సినిమా థ్యాంక్స్ మీట్ జరగడం ఎంతో సంతోషంగా ఉంది. హీరో అన్షు మాట్లాడుతూ నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాను ప్రేక్షకులకు రీచ్ కావడానికి కారణమైన సురేష్‌బాబు, బెక్కెం వేణుగోపాల్ కు థ్యాంక్స్. అన్నారు.నిర్మాత కె.వెంకట్ యాదవ్ మాట్లాడుతూ నన్ను నమ్మి ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి సినిమా చూసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. తొలి సినిమాతోనే నిర్మాతగా మంచి గుర్తింపు వచ్చింది. పెద్ద సినిమాల మధ్యలో మా చిన్న సినిమా హుషార్ పిట్టలు విడుదలై తొలివారంలో 5 కోట్ల 27 లక్షల గ్రాస్‌ను వసూలు చేసి రెండోవారంలోకి అడుగుపెట్టడం హ్యాపీగా ఉంది.

'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి 'సరస్వతమ్మ'గా రాధిక ఫస్ట్ లుక్

'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌తో పాటు రొమాన్స్, ఎమోషన్స్ తో రూపొంది స్తున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ లిలిశ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992లో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌తో పాటు తొలి రెండు పాటలకు మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ 'సరస్వతమ్మగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.'జై బాలయ్య హెడ్‌బ్యాండ్ కట్టుకుని, సీరియస్ లుక్‌లో కనిపిస్తున్న రాధికా శరత్‌కుమార్ పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ఆమె బాడీ లాంగ్వేజ్ సరస్వతమ్మ పాత్రకు కథలో మంచి ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమా టోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కామ్రేడ్ కళ్యాణ్ అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

'సహ'(లైఫ్ ఆఫ్ సంజు) సెప్టెంబర్ 4న రిలీజ్



నిశాంత్ దోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ డ్రామా సహా (లైఫ్ ఆఫ్ సంజు) ప్రస్తుతం ప్రమోషన్స్‌తో సందడి చేస్తోంది. శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు, జీవితంలో ఎదురయ్యే భావోద్వేగ సంఘర్షణల చుట్టూ సాగనుంది. సుమైరా స్టూడి యోస్ బ్యానర్‌పై తేజ వెల్పుచర్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తి పెంచుకున్న 'సహా' సెప్టెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ జర్నీలో ఆత్మీయంగా కనిపించారు. ఈ విజువల్ ఇద్దరి మధ్య ప్రేమ, అనుబంధాన్ని సహజంగా చూపిస్తూ సినిమా నేపథ్యంపై ఆసక్తిని పెంచుతోంది.సంజు జీవితంలోని వివిధ దశలను ఈ సినిమా ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, విడిపోవడం, మధురమైన జ్ఞాపకాలు, కష్టాలను అధిగమించేందుకు అవసరమైన మనోధైర్యం వంటి అంశాలను కథలో చూపించనున్నారు. పాత్రలు, వాటి మధ్య ఉండే అనుబంధాల ద్వారా ఒక మనసుకు దగ్గరయ్యే ఎమోషనల్ జర్నీగా అందించనున్నాయి. ఈ చిత్రంలో ప్రజనా పాండ్యా, మహిపాల్, అప్పాజీ, భారతి, మేఘన సునీల్, బాంబే పద్మ, కొండారెడ్డి, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా కరుణాకర్ కె, ఎడిటర్‌గా దినేష్ పెద్ది, సంగీత దర్శకుడిగా శేఖర్ చంద్ర పనిచేస్తున్నారు.

23vzm15:23vzm15.qxd 22-08-2026 21:04 Page 1

భోగాపురంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

పాల్గొన్న ఎమ్మెల్యే లోకం మాధవి

భోగాపురం, ప్రభాతవార్త :

భోగాపురంలో "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి బొల్లు వీధి వరకు ర్యాలీగా సాగుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి నెల్లిమర్ల నియోజకవర్గ శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి హాజరై ప్రజలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇంటింటి నుంచి వెలువడే చెత్తను రోడ్లపై పడేయకుండా చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలని కోరారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, స్వచ్ఛత విషయంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి గాయత్రి, పంచాయతీ ఈవో రమణమ్మ, నాయకులు పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్, పడాల శ్రీనివాసరావు వరుపులగిరి, వరుపుల సుధాకర్, ఆళ్ళ వెంకటేశ్వరరావు, పల్ల రాంబాబు, గుండపు సూరిబాబు, జక్కపు రవి, సవరం రాంబాబు, అధికార సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళామతల్లి పులకరించిన వేళ

బొబ్బిలిలో ఘనంగా ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం

బొబ్బిలి, ఆగస్టు 22, ప్రభాతవార్త:

ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ ఆర్ కె రంగారావు (బేబీ నాయన) సౌజన్యంతో కళాభారతిలో వంజరాపు రవిశంకర్(సినీ కళాకారుడు) పుల్లెల శ్రీనివాసరావు సత్యనారాయణ, తూముల అచ్యుతవల్లి, గెశీబలి శ్రీనివాసరావు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళాకారులకు జ్ఞాపక తో పాటు సన్మాన పత్రాలను అందజేసి వారికి వారి కలలను మరింత ఆధునికరించుకోవాలని వారిని దీవించారు. ఇప్పుడే వచ్చా ఎప్పుడు వచ్చింది. రెండో బ్యాచ్ కోళ్ల బలరాం మాస్టర్. సుంకరి సాయి రమేష్ ఆధ్వర్యంలో శ్రీకాకుళము విజయనగరము పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న వివిధ జానపద కళాకారుల డప్పు వాయిద్యాలతో వేణుగోపాల స్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో కళాబృందాలతో బిందెల డాన్స్ కోలాటం చెక్కభజన నృత్యాల తో పురవీధులలో ఆహుతులను అలరింప చేశారు పట్టణ ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విశేష కలలైన జానపద నృత్యాలను పరిచయం చేస్తూ ప్రజల మనలను పొందారు వీరందరికీ సన్మాన పత్రాలు అందజేసి వారి కలలకు మరింత ప్రోత్సహించాలని కోరారు. బొబ్బిలి రాజుల కళాపోషకులుగా ఇదొక నిదర్శనం అని చెప్పవచ్చు. కళాకారులతో పాటు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ (టిడిపి)పుట్టినరోజు వేడుకలు

రామభద్రపురం, ఆగష్టు 22,ప్రభాత వార్త:

రామభద్రపురం మండల టీడీపీ కార్యాలయంలో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు కర్ణం భాస్కరరావు పుట్టినరోజు వేడుకలు నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కోసి ఘనంగా సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ మాజీ కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో భాస్కరరావుకు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వసంత సన్యాసినాయుడు రమేష్ నల్ల కూర్మారావ్ చంద్రావు ప్రసాద్ లక్ష్మం నాయుడు లంకా తిరుపతిరావు, శ్రీనివాసరావు వెంకటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుపై అవగాహన : తహశీల్దార్

సాలూరు, ఆగష్టు 22, ప్రభాతవార్త :

సాలూరు మండలం సారికగ్రామ సచివాలయంలో శనివారం సర్ ప్రోగ్రంలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు పై బిఎల్ఓలకు అవగాహన కల్పించామని ఎమ్మార్వో ఎం సురేష్ స్థానిక విలేకరులకు తెలిపారు.అలాగే ఓటర్లు ఇచ్చిన నోటిసుల మేరకు వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంతేకాకుండా వారి ఫిర్యాదులు పూర్తిగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ప్రత్యేక ఓటర్ల సవరణ దినంలో భాగంగా మామిడిపల్లి 22,23,24 పోలింగ్ స్టేషన్లకు తాహశీల్దార్ వెళ్లి పరిశీలించి ఓటర్లకు ఓటుహక్కు కల్పించే అవకాశాల గురించి పలుసూచనలు చేశారు.ఇంకా మండ లంలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇచ్చిన నోటీసులు పునః పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ఆర్ఐ మౌళాల, బిఎల్ఓలు విజేయ్ కుమార్, మధుబాల,శంకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ఛాంపియన్షిప్ బ్యాడ్మింటన్ కోచ్‌గా శ్రీరాములు

శృంగవరపుకోట,ఆగష్టు22,ప్రభాతవార్త :

అమరావతి ఛాంపియన్షిప్ బాడ్మింటన్ కోచ్ గా జిల్లా బాడ్మింటన్ టీమ్ కోచ్,ఎస్.కోట నియోజకవర్గ క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఎంపికయ్యారు.అమరావతి చాంపియన్స్ -2026 రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు తిరుపతిలో జరుగనున్నాయి.అందులలో శ్రీరాములుటీమ్ కోచ్ గా వ్యవహరిస్తున్నారు. ఈసందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఉండే 26 జిల్లాల నుండి 12 అంశాలలో క్రీడాకారులు పాల్గొంటారని అందులో అండర్ 17, 23 విభాగాలలో పురుషులు,స్త్రీలు పాల్గొంటారని తెలిపారు.క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందనన్నారు.ఈక్రీడలకు మొత్తం 99 లక్షల రూపాయలు బహుమతిగా అందిస్తుందని అన్నారు. క్రీడలు ఆగస్టు 29 హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జన్మదిన పురస్కరిం చుకొని జరుగుతున్నాయని ఆయన తెలిపారు.ఈనెల 29వ తేదీన విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందని కోచ్ శ్రీరాములు తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షునిగా అనిల్ కుమార్

కురుపాం,ఆగస్టు22,ప్రభాతవార్త :

భారతీయ జనతా పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యక్షులుగా బోటు అనిల్ కుమార్ ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. శనివారం జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు కురుపాం బిజెపి నాయకులు బోటు అనిల్ కుమార్ ను జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

తేలికపాటి వర్షాలతో రైతుల్లో ఆనందం

లక్కవరపుకోట, ఆగష్టు 22, ప్రభాతవార్త :

మండలంలో గత కొంతకాలంగా వరుణుడు కరుణించకపోవడంతో వరునాట్లు పూర్తిస్థాయిలో పడకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. వరి నాట్లు వేసేందుకు ఇప్పటికే రైతులు పొలాల్లో వరి ఆకు సిద్ధం చేసుకున్నప్పటికీ వర్షాలు ఇప్పటికే ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో ఆకుమడులు ముదిరిపోతున్న వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇప్పటికే మండలంలో బోర్ల సహాయంతో ఐదు శాతం మాత్రమే వరి నాట్లు వేసినప్పటికీ, వర్షాలు కురుస్తాయి అన్న ఆశలు రైతుల్లో వ్యక్తం అవుతూనే ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఎండలు మండిపోతున్న తరుణంలో వేసిన కొద్దిపాటి వరి నాట్లు కూడా నీరు చాలక రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తాజాగా శుక్రవారం రాత్రి నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తుం డడంతో రైతుల్లో ఆశలు మరలా చిగురిస్తున్నాయి.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన

గరివిడి, ఆగస్టు 22,ప్రభాత వార్త:

ప్రకాష్ మణి దాధీజీ 19వ పుణ్యతిథిని పురస్కరిం చుకుని గరివిడి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో స్థానిక బ్రహ్మ కుమారీ సేవా కేంద్రంలో శనివారం నిర్వహిం చిన ఉచిత రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో 32 మంది రక్తదాతలు రక్త దానం చేశారు. దాతలు నుండి విజయనగరం రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. బ్రహ్మ కుమారీ ప్రతినిధులు, విద్యార్థులు, విశ్వ భారత్ సేవా ట్రస్ట్ ప్రతినిధులు, యువత రక్త దానం చేసి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు.కార్యక్రమంలో స్థానిక బ్రహ్మ కుమారీ సేవాకేంద్రం ఇంచార్జి బ్రహ్మ కుమారీ హేమలత, విశ్వ భారత్ సేవా ట్రస్ట్ గరివిడి శాఖ ప్రతినిధి మేదరమెట్ల వేంకటేశ్వర రావు, సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ చంద్రశేఖర్‌కు లెఫ్ట్‌నెంట్ హోదా

నెల్లిమర్ల, ఆగస్టు 22,ప్రభాతవార్త:

మండలంలోని మొయిద నారాయణపట్నం గ్రామానికి చెందిన డాక్టర్ జమ్ము చంద్రశేఖరరావుకు పాండిచ్చేరి రాష్ట్రంలోని యానాంలో అరుదైన గౌరవం దక్కింది. యానాంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు నాగపూర్‌లో ఎన్ సిసి ఆఫీసర్స్ ట్రైనింగ్ విభాగంలో మూడు నెలలు శిక్షణ కోర్సు పూర్తి చేసుకున్న అనంతరం నాగపూర్ ఎన్సీసీ విభాగం లెఫ్ట్ లెంట్ హోదాను ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. చంద్రశేఖర్కు లెఫ్టినెంట్ హోదా రావడం కళాశాలకు గర్వకారణమని వక్తలు కొనియాడారు. కళాశాలలో ఉత్తమ ఎన్సీసీ కాండెట్లను తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తండ్రి జమ్ము త్రినాథ్ రావును కూడా ఈ సందర్భంగా కళాశాలలో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల. జువాలజీ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలత, శాంతి కుమారి, కే. ప్రసాదు , సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ.డా.జమ్ము చంద్రశేఖర్ను శాసనమండలి సభ్యులు డాక్టర్ పి వి వి సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు), వైస్సార్సీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ధవళ లక్ష్మణరావు, గ్రామ పెద్దలు అభినందించారు.

రాజేష్ మాస్టార్‌కి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

నెల్లిమర్ల,ఆగస్టు 22, ప్రభాతవార్త:

నెల్లిమర్ల మండలం గుషిణి పంచాయతీ చనమల్లుపేట ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కౌలూరి రాజేష్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ మేరకు కేంద్ర విద్యా వనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజేష్ మాస్టారు ఒక్కరే ఎంపిక కావడం విశేషం. బోధనలో నూతన వరవడి అమలు చేయడంతో పాటు విద్యారంగంలో ప్రభుత్వ అమలు చేస్తున్న పలు కార్యక్రమాలకు సంబంధించి రాజేష్ మాస్టారు గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా రాష్ట్రస్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.ఏఐ పాఠ్యాంశ బోధన, టి.ఎల్.ఎం పరికరాలు తయారీ తదితర విషయాల్లో రాజేష్ మాస్టారు దిట్ట. రాజేష్ మాస్టారు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి యు. మాణిక్యంనాయుడు, నెల్లిమర్ల మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు సూర్యనారాయణమూర్తి, సిద్ధాంతం త్రినాథరావు, పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందించారు.

మొండెంఖల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో

కురుపాం,ఆగస్టు22,ప్రభాతవార్త :

మొండెంకళ్ పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో జై ఉమామహేశ్వరి శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక వస్తువులు ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలు పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె అన్నారు. కార్యక్రమంలో బిఎల్‌వోలు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భీమసింగి ఫ్యాక్టరీ లిక్విడేషన్ చట్ట విరుద్ధం

గజపతినగరం, ఆగస్టు 22,ప్రభాతవార్త :

కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను రైతుల జనరల్ బాడ్ ఆమోదం లేకుండా లిక్విడేషన్ చేయడం చట్ట విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ గజపతినగరం నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చిత్రాడ దుర్గాప్రసాద్ విమర్శించారు. ఆయన గజపతినగరంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం అనకాపల్లి జిల్లాలోని తాండవ, ఏటి కొప్పాక షుగర్ ప్యాక్టరీలు, విజయనగరం జిల్లాలోని భీమ సింగ్ ఫ్యాక్టరీ మొత్తం మూడు ఫ్యాక్టరీలను లిక్విడేషన్ చేసినట్టుగా గురువారం ప్రకటించిందని. ప్రభుత్వ నిర్ణయం దారుణమని ఆయన ఎద్దేవా చేశారు. మూడు ప్రాక్టరీల పరిదిలోని భూములు, ఏపిఐఐసికి అప్పగించి, అక్కడ ఉన్న బకాయిలను ఏపిఐఐసి చెల్లిస్తుందని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు.ప్రభుత్వ నిర్ణయం అన్యాయమని, అప్రజాస్వామ్యని డాక్టర్ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. సహకార రంగం అంటే రైతుల సమిష్టి ఆస్తి అని ప్రభుత్వ ఆస్తి కాదని అయన వ్యాఖ్యానించారు. కోపరేటివ్షుగర్ ప్యాక్టరీలను వేలాది మంది రైతులు తమ స్వంత పెట్టుబడులు పెట్టి, షేర్లతో నిర్మించుకున్న సంస్థలని. అలాంటి సంస్థలను ప్రభుత్వం తన ఇష్టాను సారంగా రైతులు జనరల్ బాడ్ ఆమోదం లేకుండా లిక్విడేషన్ చేయడం అన్యాయని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపీడీవో

దత్తిరాజేరు, ఆగస్టు 22, ప్రభాతవార్త :

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో ఎస్. తాత అన్నారు. మండల కేంద్రమైన దత్తిరాజేరు గ్రామ పంచాయతీలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అత్యంత అవసరం అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నేల నీరు జీవ వైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వస్తువులు వాడకంపై అవగాహన కల్పించారు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. ఏవో శివాజీ మండల కోఆర్డినేటర్ రౌతు గోవింద, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్.కోటలో ఎమ్మెల్యే కోళ్ల ఇంటికి విచ్చేసిన సీఎం

లక్కవరపు కోట, ఆగస్టు 22, ప్రభాతవార్త :

ఎల్.కోటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. రంగరాయపురం గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎంకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్వగృహానికి సీఎం చేరుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి రాంప్రసాద్ దంపతులు, కుటుంబ సభ్యులు సీఎంకు స్వాగతం పలికారు. అధికారులు కల్పించిన అవకాశం మేరకు కుటుంబ సభ్యులు మాత్రమే సీఎంను కలిశారు. పెళ్లి కుమార్తెను సీఎం ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగారు.సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాం సుందర రెడ్డి, ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా, మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రత, ట్రాఫిక్, భద్రతా చర్యలను పర్యవేక్షించారు. రంగరాయపురం హెలిప్యాడ్ నుంచి ఎల్.కోటలోని ఎమ్మెల్యే ఇంటి వరకు టీడీపీ, జనసేన నాయకులు స్వాగత కటౌట్లు ఏర్పాటు చేశారు. సీఎం తిరిగి హెలికాప్టర్‌లో సురక్షితంగా బయలుదేరడంతో అధికారులు, నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. సీఎం రెండోసారి ఎల్.కోటకు రావడంతో ఎమ్మెల్యే కోళ్ల దంపతులతో పాటు స్థానిక నాయకులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన

భట్రాజుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రాజు

విజయనగరం, ఆగస్టు 22, ప్రభాతవార్త :

జిల్లా పర్యటన నిమిత్తం శనివారం విజయనగరం చేరుకున్న రాష్ట్ర ఐటీ, విద్యా శాఖా మంత్రి, తెలుగు దేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ను ఆంధ్రప్రదేశ్ భట్రాజు సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ సి.ఎస్.వి.రాజు (సతీష్ రాజు) మర్యాదపూర్వకంగా సాదర స్వాగతం పలికారు. రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్‌లో డైరెక్టర్ల నియామకం, శ్రీశైలం దేవస్థానం లో భట్రాజు సంక్షేమ సంఘం నిత్య అన్నదాన సత్రం కోసం స్థలం కేటాయింపు కోసం ప్రత్యేకంగా మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

రామభద్రపురంలో జ్ఞానజ్యోతి : సిడిపివో సుజాత

రామభద్రపురం, ఆగష్టు 22, ప్రభాత వార్త:

అంగన్వాడీ టీచర్ల మూడో సంవత్సరం శిక్షణ ప్రారంభం చిన్నారుల వికాసమే ప్రధాన లక్ష్యం సిడిపిఓ సుజాత రామభద్రపురం మండలంలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు, వారి సమగ్ర వికాసానికి దోహదపడేలా నిర్వహిస్తున్న 'జ్ఞానజ్యోతి' మూడో సంవత్సరం శిక్షణ కార్యక్రమం మండల కేంద్రంలో పూడివీధి, ఎంపీపీ స్కూల్ శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. మండల పరిధిలో నిర్వహించిన ఈ శిక్షణలో మండలానికి చెందిన అంగన్వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.శిక్షణ కార్యక్రమానికి బాడంగి ఐసిడిఎస్ సీడీపీఓ సుజాత హాజరై.అంగన్వాడీ టీచర్లకు అవసరమైన మార్గదర్శకాలను అందించారు. ఈ సందర్భంగా 'జ్ఞానజ్యోతి' శిక్షణలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడం, వయస్సుకు అనుగుణంగా వారి మేధో, శారీరక, సామాజిక, భావోద్వేగ వికాసాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా సమ్మేళిత విద్య (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్) కు ప్రాధాన్యతనిస్తూ ప్రతి చిన్నారిని విద్యా ప్రక్రియలో భాగస్వామ్యం చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. పిల్లలకు బోధనను మరింత ఆసక్తికరంగా, సులభంగా అందించేందుకు యాక్టివిటీ ఆధారిత బోధనా పద్ధతులు, ప్రయోగాత్మక అభ్యసన విధానాలు, ఆటల ద్వారా నేర్పించే పద్ధతులు తదితర అంశాలను శిక్షణలో వివరించారు. అంగన్వాడీ టీచర్లు కేవలం బోధకులుగా కాకుండా చిన్నారుల ప్రాథమిక వికాసానికి మార్గదర్శకులుగా వ్యవహరించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. తొలిరోజు శిక్షణ విజయవంతంగా పూర్తవడంతో అంగన్వాడీ టీచర్లు ఉత్సాహంగా పాల్గొని, శిక్షణలో అందించిన అంశాలను కేంద్రాల్లో ఆచరణలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో 'జ్ఞానజ్యోతి' శిక్షణ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. సూపర్వైజర్ కృష్ణకుమారి సూర్య కుమారి రత్నకుమారి మండలానికి చెందిన అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బోధనలో నైపుణ్యం మెరుగుపరుచుకోవాలి

నెల్లిమర్ల, ఆగష్టు 22, ప్రభాతవార్త :

మండలంలోని పారసాం ఉన్నత పాఠశాల లో సెకండరీ గ్రేడ్ టీచర్ల క్లస్టర్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో 23 పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రిసోర్స్ పర్సన్స్ మాదిరి పార్టీ అంశ బోధన, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, కరికిలమ్ తదితర అంశాల గురించి ఉపాధ్యాయులు తెలుసుకున్నారు. ఈ సమావేశానికి పరిశీలకులుగా మండల విద్యాశాఖ అధికారి 2 సిద్ధాంతం త్రినాధ రావు హాజరయ్యారు. కాంప్లెక్స్ ఇన్చార్జిగా కొండగుంపం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ వ్యవహరించారు. క్లస్టర్ కాంప్లెక్స్ ఆవశ్యకత గురించి విద్యాశాఖ అధికారి త్రినాథరావు తెలియజేశారు. ఈ సమావేశానికి రిసోర్స్ పర్సన్ గా కడలి సత్యసాయి గణేష్, కిరణ్, రాము శంకర్రావు వ్యవహరించారు. రామతీర్థం ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల హెచ్ఎం, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ అయిన ఎం. నగేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. కాంప్లెక్స్ పర్యవేక్షకులుగా మండల విద్యా శాఖాధికారి 1 ఉపాధ్యాయుల సూర్యనారాయణ మూర్తి, సారిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మావతి హాజరయ్యారు.

రష్యా ఉప క్రీడల మంత్రికి ఘన స్వాగతం

విజయనగరం, ఆగష్టు 22, ప్రభాతవార్త:

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 2వ బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ మినిస్టీరియల్ మీటింగ్స్--2026లో పాల్గొనేందుకు ఈరోజు భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంకు చేరుకున్న రష్యా ఉప క్రీడల మంత్రి అలెక్సీ మొరోజోవ్ కు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రోటోకాల్, లైజన్ అధికారులు హోసింగ్ పిడి మురళి మోహన్, విశాఖపట్నం పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ వి ఆదిశేషు విమానాశ్రయంలో మంత్రికి సాదరంగా స్వాగతం పలికి, వసతి, రవాణా తదితర ఏర్పాట్లను సమన్వయం చేశారు. బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనే ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పర్యవేక్షిస్తోంది.

ఎమ్మార్ అగ్రహారం పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో

తెర్లాం, ఆగష్టు 22, (ప్రభాత వార్త) :

మండలం ఎమ్మార్ అగ్రహారం గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 282ను బొబ్బిలి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జి.వి.ఎస్.ఎస్. మోహన్‌రావు శనివారం తనిఖీ చేశారు. ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ గౌరీశంకర్, తెర్లాం తహశీల్దార్ ఆర్. ధనంతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత బూత్ లెవల్ అధికారులకు ఓటరు జాబితా సవరణపై పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన కొత్త ఓటర్ల నుంచి ఫారం-6, తొలగింపులకు ఫారం-7, వివరాల సవరణకు ఫారం-8 క్లెయిమ్‌లను స్వీకరించాలని ఆదేశించారు. స్వీకరించిన అన్ని క్లెయిమ్‌లను బి ఎల్ ఓ యాప్‌లో వెంటనే అప్‌డేట్ చేయాలని సూచించారు. అదేవిధంగా ఏ ఎస్ డి డి జాబితాల్లో ఇంట్లో ఎప్పుడూ ఉండని వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన వారు, ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల నమోదైన వారి వివరాలను పరిశీలించాలని తెలిపారు. విచారణ నోటీసులను పరిశీలించి, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం విచారణలను పూర్తి చేయాలని బి ఎల్ ఓ లను ఆదేశించారు.

ముందస్తు ప్రణాళికతో

ప్రశాంతంగా ముగిసిన సీఎం పర్యటన

విజయనగరం, ఆగష్టు 22, ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలు జిల్లా పోలీసుశాఖ చేపట్టిన ముందస్తు ప్రణాళిక, పటిష్టమైన భద్రతా చర్యలు, అధికారుల సమన్వయంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ - ఎల్.కోటలో ముఖ్యమంత్రి పర్యటనతో పాటు, విజయనగరం పట్టణంలోని దాసన్నపేట ప్రభుత్వ పాఠశాల, చెల్లూరులో పార్టీ కార్యకర్తలతో నారా లోకేష్ సమావేశం, అలాగే విటి అగ్రహారం వై-జంక్షన్ వద్ద స్వాగత కార్యక్రమాల నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సుమారు 1,000 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.ఎల్.కోటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెలిప్యాడ్, ఎమ్మెల్యే నివాసం, హెలిప్యాడ్ నుంచి ఎమ్మెల్యే నివాసం వరకు ఉన్న మార్గం, రూఫ్‌టాప్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ బృందాలతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అదేవిధంగా జిల్లా కేంద్రానికి చేరుకున్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి విటి అగ్రహారం వై-జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టారు. నారా లోకేష్ విద్యార్థులతో మమేకమయ్యే దాసన్నపేట ప్రభుత్వ పాఠశాల, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యే చెల్లూరు ప్రాంతాలను జిల్లా ఎస్పీ ముందుగానే సందర్శించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు భద్రతాపరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రివర్యుల పర్యటనలు జరగడంతో జిల్లా పోలీసుశాఖ ముందస్తుగా సమగ్ర ప్రణాళిక రూపొందించి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు చర్యలను సమర్థవంతంగా నిర్వహించింది.పర్యటనలకు ముందుగానే చేపట్టిన భద్రతా చర్యలు, నిరంతర పర్యవేక్షణ, అధికారులు-సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించడం వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ తెలిపారు.

23-08pg10exHMNWJQE.qxd OK OK:23-08pg10exHMNWJQE.qxd 1/1/02 7:18 AM Page 1

ఆట

బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్..
ట్రీసా-గాయత్రికి రెండో డబుల్స్ పతకం

న్యూఢిల్లీ: భారత మహిళల డబుల్స్ స్టార్లు ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్‌ల అద్భుత ప్రస్థానం శనివారం బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్స్‌లో ముగిసింది. ప్రపంచ నంబర్ 1 ఆటగాళ్ళైన చైనాకు చెందిన లియు షెంగ్ షు-టాన్ నింగ్‌లతో జరిగిన పోరులో ఈ జంట మూడు గేమ్‌లలో 21-18, 13-21, 8-21 తేడాతో పోరాడి ఓడిపోయి, చారిత్రాత్మక కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ట్రీసా-గాయత్రి చైనా ద్వయాన్ని ఇబ్బంది పెట్టారు. ముఖ్యంగా ట్రీసా నెట్ వద్ద అద్భుతంగా రాణించడంతో, తొలి గేమ్‌లో 7-2 ఆధిక్యాన్ని సాధించారు. అయితే చైనా జోడి ఎదురుదాడి చేసి ఒత్తిడి పెంచుతూ తిరిగి ఆధిక్యాన్ని చేజిక్కించుకుంది. భారత బ్యాక్‌కోర్ట్‌లో పదేపదే ఖాళీలను కనుగొంటూ, వారు వరుసగా 10 పాయింట్లు సాధించి 12-7తో తొలిసారి ఆధిక్యంలోకి వచ్చారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీ, చివరి దశకు చేరుకునే సమయానికి చైనా 18-16 స్వల్ప ఆధిక్యంలో ఉంది. అయితే, భారత్ జంట జోరు పెంచి, తర్వాతి 5 పాయింట్లు గెలుచుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నారు. రెండవ గేమ్‌లో భారత్ ద్వయం కొన్ని అనవసర తప్పిదాలతో చైనా ఆరంభంలోనే ఆధిక్యం సాధించింది. ట్రీసా-గాయత్రి కోలుకుని 11-10తో స్వల్ప ఆధిక్యంలోకి వచ్చారు. అయితే, విరామం తర్వాత ఆట గమనం ఒక్కసారిగా మారిపోయింది. ట్రీసా-గాయత్రి అనవసర తప్పిదాలు చోటుచేసుకోవడంతో, వారు తర్వాతి 13 పాయింట్లలో కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకోగలిగారు. దీంతో చైనా జట్టు మ్యాచ్‌ను సమం చేసి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్‌లో, భారత జోడీ ఇబ్బంది పడింది. చైనా బౌలింగ్ దాడితో వారు క్రమంగా తడబడటంతో, వారి ఆటలో వరుసగా బలహీనమైన షాట్లు చోటుచేసుకున్నాయి. లియు-టాన్ ఆటపై పట్టు సాధించి, చివరికి మ్యాచ్‌ను ముగించారు.

నేడే శ్రీలంకతో కీలక రెండో టెస్ట్

కొలంబో: శ్రీలంకపై టెస్ట్ సిరీస్ క్లీన్ స్వీప్ చేసేందుకు టీమిండియా రెడీ అవుతోంది. తొలి టెస్టులో 165 పరుగుల భారీ తేడాతో గెలిచిన భారత్, ఇప్పటికే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబోలోని ఎస్ఎస్‌సీ స్టేడియం వేదికగా ఈ నెల 23 నుంచి రెండో టెస్ట్ ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు మరింత మెరుగుపరుచుకోవాలని గిల్ సేన చూస్తోంది. మరోవైపు సిరీస్ సమం చేయాలంటే ఆతిథ్య శ్రీలంక తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో టెస్టులో భారత బౌలింగ్ విభాగంలో ఒక మార్పు చోటుచేసుకోనుంది. తొలి మ్యాచ్‌లో రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ స్పిన్ మాయాజాలంతో లంకను దెబ్బకొట్టగా, కుల్దీప్ యాదవ్ మాత్రం లయ అందుకోలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం ఒకే వికెట్ తీశాడు. కుల్దీప్‌ను గిల్ కేవలం మూడో స్పిన్నర్‌గా చూస్తున్నట్లు అర్థమవుతోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కుల్దీప్‌కు సపోర్ట్‌గా ఉన్నా ఇప్పటికే సిరీస్‌లో ఆధిక్యం ఉండటంతో అతనికి విశ్రాంతినిచ్చి ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌ను తుది జట్టులోకి తీసుకోనేందుకు సిద్ధమవుతోంది. జైన్ జట్టులోకి వస్తే బ్యాటింగ్ ఆర్డర్ మరింత బలోపేతం అవుతుంది. మరోవైపు శ్రీలంక జట్టును గాయాల సమస్య వేధిస్తోంది. సీనియర్ ఆటగాళ్లు కుశాల్ మెండిస్, దినేష్ చండిమాల్ గాయాల కారణంగా ఈ టెస్టుకు అందుబాటులో లేకపోవడం ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. వారి స్థానంలో యువ ఆటగాళ్లను రంగంలోకి దించాల్సి వస్తోంది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ 53.33 పాయింట్ల శాతంతో ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక 33.33 శాతంతో ఆరో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరు జట్లకు ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. భారత్ తుది జట్టు అంచనాకు వస్తే కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్/సారాంశ్ జైన్, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ. అలాగే శ్రీలంక జట్టులో లహిరు ఉదార, కమిల్ మిశార, పసిందు సూర్యబండార, కమిందు మెండిస్, ధనంజయ డిసిల్వా, నిరోషన్ డిక్వెల్లా, సోనాల్ దినూష, కేశర నువాంత, ప్రభాత్ జయసూర్య, అసిథ ఫెర్నాండో, లహిరు కుమార ఉన్నారు.

డబ్ల్యూటీసి ఫైనల్స్ నుంచి 4 జట్లు ఔట్
టీమిండియాకు కఠిన పరీక్షే

న్యూఢిల్లీ: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సైకిల్ తుది దశకు చేరుకుంటున్న వేళ పాయింట్ల పట్టిక సమీకరణాలు ఉత్కంఠ రేపుతున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ 2027 పోరు కోసం ప్రధాన జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే కొన్ని జట్లు రేసు నుంచి పూర్తిగా తప్పుకోగా, అగ్రస్థానం కోసం కీలక జట్ల మధ్య అసలైన సమరం మొదలైంది. మొత్తం తొమ్మిది జట్లలో వెస్టిండీస్ అధికారికంగా నిష్క్రమించగా, ఇంగ్లండ్, పాకిస్తాన్, శ్రీలంకలకు దారులు మూసుకుపోయినట్లే కనిపిస్తున్నాయి. సాధారణంగా ఫైనల్ చేరాలంటే కనీసం 65 శాతం పాయింట్ల శాతం (పిసిటి) సాధించడం తప్పనిసరి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఆస్ట్రేలియా (77.78), రెండో స్థానంలో దక్షిణాఫ్రికా (75.00), మూడో స్థానంలో న్యూజిలాండ్

(72.22) ఉన్నాయి. మరో 13 టెస్టులు ఆడాల్సిన ఆసీస్‌తో పాటు, చేతిలో పది టెస్టుల చొప్పున ఉన్న సఫారీలు, కివీస్ జట్లు ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకునేందుకు గట్టి పోటీనిస్తున్నాయి. ఈ లీగ్ దశలో వెస్టిండీస్ ప్రయాణం దాదాపు ముగిసింది. ఆడిన 12 టెస్టుల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి 20.83 శాతంతో 9వ స్థానానికి పడిపోయిన కరేబియన్ జట్టుకు మిగిలిన 2 మ్యాచ్‌ల్లో గెలిచినా ముందంజ వేసే అవకాశం లేదు. మరోవైపు పాకిస్తాన్, ఇంగ్లండ్, శ్రీలంక జట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎనిమిదో స్థానంలో ఉన్న పాకిస్తాన్ పాయింట్ల ఖాతాలో 22.22 శాతం మాత్రమే ఉంది. ఆ జట్టు ఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే మిగిలిన 7 టెస్టుల్లో దాదాపు అన్నింట్లోనూ విజయం సాధించాల్సిందే. 13 మ్యాచ్‌లాడి 24.36 శాతంతో ఉన్న ఇంగ్లండ్‌కు మిగిలిన 8 టెస్టులు గెలిచినా అగ్రస్థానాలకు చేరుకోవడం కష్టమే. భారత్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడుతున్న శ్రీలంక 33.33 శాతంతో నిలిచి, మిగిలిన 7 టెస్టులను తప్పక గెలవాల్సిన ఒత్తిడిలో పడింది. ఇక అనూహ్యంగా పుంజుకున్న బంగ్లాదేశ్ ప్రత్యర్థి ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం సాధించి 66.67 శాతంతో నాలుగో స్థానానికి చేరుకుంది. చేతిలో మరో ఏడు టెస్టులు ఉండటం వారికి కలిసొచ్చే అంశం. ఇక టీమిండియాకు కఠిన పరీక్షే. ఇప్పటివరకు ఆడిన 10 టెస్టుల్లో 5 విజయాలు సాధించి 53.33 శాతంతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. మొత్తం 18 టెస్టుల షెడ్యూల్‌లో మిగిలిన ఎనిమిది మ్యాచ్‌ల్లో నిలకడగా రాణిస్తేనే భారత జట్టు వరుసగా మరోసారి ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉంటాయి.



వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..
భారత్ ఖాతాలో మూడు పతకాలు
మాన్సీ రజతం, తన్వి, కోమల్ కాంస్యం

స్లోవేకియా: అండర్ 20, ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లర్లు మాన్సీ లాథర్ రజతం గెలుచుకోగా, తన్వి గుండేష్ మగ్దుమ్, కోమల్ కాంస్యం కైవసం చేసుకున్నారు. స్లోవేకియాలో శనివారం జరిగిన ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల రెజ్లింగ్ బృందం తమ ఖాతాలో ఒకే రోజు మరో మూడు పతకాలను చేర్చుకుంది. చైనాకు చెందిన చెన్లింగ్ సాంగ్‌తో హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో ఓడిపోవడంతో, 68 కేజీల విభాగంలో మాన్సీ స్వర్ణ పతకాన్ని తృటిలో కోల్పోయింది. ఈ రక్షణాత్మక పోరులో 1-2 తేడాతో ఓడిపోయిన ఈ భారత రెజ్లర్ రజత పతకంతో సరిపెట్టుకుంది. ఇక ప్లేఆఫ్‌లలో విజయాల ద్వారా భారత్ రెండు కాంస్య పతకాలను జోడించింది. 57 కేజీల విభాగంలో తన్వి గుండేష్ మగ్దుమ్, కెనడాకు చెందిన ఆగ్నియా క్రాకోవ్స్కాను 10-4 తేడాతో ఓడించి కాంస్యం కైవసం చేసుకుంది. ఆ తర్వాత 59 కేజీల విభాగంలో కోమల్, హంగేరీకి చెందిన ఎడా బాలాజ్‌పై 5-2 తేడాతో విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

రెండో టెస్ట్‌లో 64 రన్స్‌కే కుప్పకూలిన బంగ్లా
101 రన్స్ ఆధిక్యంలో ఆస్ట్రేలియా

క్వీన్స్‌లాండ్: ఆస్ట్రేలియాతో రెండు టెస్టుల సిరీస్‌లో సంచలన విజయంతో తొలి టెస్ట్‌లో శుభారంభం చేసిన బంగ్లాదేశ్ రెండో టెస్ట్‌లో ఆ జోరును కొనసాగించలేకపోయింది. తొలి టెస్ట్ పరాజయంతో పూర్తిగా పేస్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌ను ఆస్ట్రేలియా సిద్ధం చేయడంతోనే బంగ్లా బ్యాటర్లు తేలిపోయారనే వాదన తెరముందుకొచ్చింది. 41.5 ఓవర్లలోనే 13 బాంగ్లా వికెట్లు పడ్డాయంటేనే పిచ్ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మెకాయ్ వేదికగా శనివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (6/12) ఆరు వికెట్లతో బంగ్లాదేశ్ పతనాన్ని శాసించాడు. ప్యాట్ కమిన్స్ (3/25) మూడు వికెట్లు తీయగా, జోష్ హేజిల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. తొలి టెస్ట్ సెంచరీ హీరో తాంజిద్ హసన్(0), షాద్‌మన్ ఇస్లాం(0) డకౌట్‌గా వెనుదిరిగారు. మెహిదీ హసన్ మీరాజ్(11), హసన్ మహ్మూద్(10), తైజుల్ ఇస్లామ్(11 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో మొత్తం నలుగురు బ్యాటర్లు డకౌటయ్యారు. షోరిఫుల్ ఇస్లామ్(14), తైజుల్ ఇస్లామ్ ఆఖరి వికెట్‌కు 25 పరుగులు జోడించి జట్టుస్కోర్‌ను 64కు చేర్చారు. లేదంటే ఆ జట్టు చెత్త రికార్డ్‌ను మూటగట్టుకునేది. అనంతరం ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో తొలి రోజు ఆట ముగిసే సరికి 8 వికెటున కోల్పోయి 165 పరుగులు చేసింది. 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. మ్యాట్ రేన్ షా(8), మార్నల్ లబుషేన్(4), అలెక్సీ క్యారీ (5), వెబ్‌స్టర్ (0), పాట్ కమిన్స్ (0), మిచెల్ స్టార్క్ (1) తీవ్ర నిరాశపర్చారు. అయితే కామెరూన్ గ్రీన్ (51 నాటౌట్) అర్ధ సెంచరీ చేయగా, స్టీవ్ స్మిత్ (42) ట్రావిస్ హెడ్(22) రాణింగా, నాదన్‌లేన్ (10 నాటౌట్)తో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా 8 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసి బంగ్లాదేశ్ కంటే 101 పరుగుల ఆధిక్యంలో ఉంది.

రూ.3828 కోట్లకు టిక్‌టాక్ అమెరికాతో ఒప్పందం..!



వాషింగ్టన్, ఆగస్టు 22: చైనా సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్, దాని మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ అమెరికాలో ఓ కీలక వివాదానికి ముగింపు పలికేందుకు సిద్ధమయ్యాయి. పిల్లల ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్ (సీఓపీపీఏ)ను ఉల్లంఘించి, వారి డేటాను అక్రమంగా సేకరించాయన్న ఆరోపణలపై యూఎస్ న్యాయ శాఖ దాఖలు చేసిన దావాను పరిష్కరించుకునేందుకు 400 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 3,828 కోట్లు చెల్లించడానికి అంగీకరించాయి. ఈ ఒప్పందం ప్రకారం టిక్‌టాక్ ముందుగా 300 మిలియన్ డాలర్లు చెల్లిస్తుంది. గతంలో టిక్‌టాక్ యాప్ అయిన మ్యూజికల్లీకి సంబంధించిన కోర్టు ఉత్తర్వులను రద్దు చేసిన తర్వాత అదనంగా మరో 100 మిలియన్ డాలర్లు చెల్లించనుంది. ఈ ఒప్పందానికి కోర్టు ఆమోదం లభించాల్సి ఉంది. పిల్లల గోప్యతకు సంబంధించిన కేసుల్లో ఇది అతిపెద్ద సెటిల్‌మెంట్లలో ఒకటని యూఎస్ న్యాయ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సెటిల్‌మెంట్ అమెరికన్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు లభించిన గొప్ప విజయం. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని తీసుకునే కంపెనీలు చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చేలా చూడటమే మా ప్రాధాన్యతని అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ వుడ్‌వార్డ్ తెలిపారు. ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) తరఫున యూఎస్ న్యాయ శాఖ 2024లో టిక్‌టాక్‌పై దావా వేసింది. 13 ఏళ్లలోపు వయసున్న లక్షలాది మంది పిల్లలను తల్లిదండ్రుల అనుమతి లేకుండా ఖాతాలు తెరిచేందుకు అనుమతించిందని ఆరోపించింది. దీనివల్ల ఆ ఖాతాలను తొలగించమని అభ్యర్థించడం తల్లిదండ్రులకు కష్టతరంగా మారిందని న్యాయ శాఖ వాదించింది. గత కొన్నేళ్లుగా జాతీయ భద్రతా కారణాలతో టిక్‌టాక్ అమెరికాలో తీవ్రమైన నియంత్రణ సవాళ్లను ఎదుర్కొంది. అమెరికన్ వినియోగదారుల డేటాను చైనా ప్రభుత్వం దుర్వినియోగం చేయవచ్చని, చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రచారానికి యాప్‌ను వాడుకోవచ్చని ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

ఆర్బీఐ ఫారెక్స్ స్వాప్‌తో 72.85 బిలియన్ డాలర్లు రాక

న్యూఢిల్లీ, ఆగస్టు 22: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రవేశపెట్టిన ప్రత్యేక డాలర్‌రూపాయి ఫారెక్స్ స్వాప్ సదుపాయం వల్ల ఈనెల 21వ తేదీనాటికి మొత్తం 72.85 బిలియన్ డాలర్ల విదేశీ కరెన్సీ నిధులు వచ్చినట్లు తేలింది. శనివారం ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. ఈ సదుపాయాన్ని ఆర్‌బీఐ గత జూన్8వ తేదీ ప్రారంభించింది. దేశంలోకి విదేశీ కరెన్సీ నిధుల రాకను పెంచేందుకు మూడు మార్గాలను ఇందులో చేర్చింది. అవి ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంక్) లేదా ఎఫ్‌సిఎన్ఆర్ డిపాజిట్లు, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ ఈసీబీస్, ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్ వోఎఫ్‌సిబీ, ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్లదే సింహభాగం. మొత్తం విదేశీ కరెన్సీ ప్రవాహాల్లో ఎఫ్‌సిఎన్ఆర్‌బి డిపాజిట్లు 65.40 బిలియన్ డాలర్లతో సింహభాగాన్ని ఆక్రమించాయి. మొత్తం ప్రవాహాల్లో ఇవి దాదాపు 90 శాతంగా ఉన్నాయి. ఇక వోఎఫ్‌సిబి ద్వారా 4.86 బిలియన్ డాలర్లు, ఈసీబిలద్వారా 2.59 బిలియన్ డాలర్లు విదేశీ కరెన్సీ దేశంలోకి వచ్చినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఎఫ్‌సీఎన్ఆర్ విండోకు ఆగస్టు 31తో ముగింపు ఎఫ్‌సిఎన్ఆర్-బి డిపాజిట్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విండో ఆగస్టు 31, 2026తో ముగియనుంది. అయితే ఈసీబీలు, ఓఎఫ్‌సిబిలకు సంబంధించిన సదుపాయం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కొనసాగనుంది.

80వేల డాలర్లకు చేరువగా బిట్‌కాయిన్

న్యూయార్కు, ఆగస్టు 22: క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ భారీగా పుంజుకుంది. శనివారం ఉదయం 9.10 గంటలకు 78,588 డాలర్ల వద్ద ట్రేడైంది. గత 24 గంటల్లో గరిష్ఠంగా 4.8 శాతం పెరిగింది. గత వారం రోజుల్లో 24.5 శాతం లాభపడింది. 2023 మార్చి తర్వాత ఇదే అత్యంత బలమైన వారపు ర్యాలీగా నిలిచింది. అమెరికా ట్రెజరీ దీర్ఘకాలిక బాండ్ల బైబ్యాక్‌లను రెట్టింపు చేయనున్నట్లు ప్రకటించడం బిట్‌కాయిన్ జోరుకు ప్రధాన కారణాల్లో ఒకటిగా మార్కెట్ నిపుణుల అంచనా. ఈ ప్రకటనతో దీర్ఘకాలిక బాండ్ రాబడులు తగ్గాయి. మార్కెట్లలో రిస్క్ తీసుకునే ఆసక్తి పెరిగింది. బిట్‌కాయిన్ ధర పెరగడంతో పతనాన్ని అంచనా వేసి తీసుకున్న భారీ షార్ట్ పొజిషన్లు లిక్విడేట్ అయ్యాయి. దీంతో క్రిప్టో ధర మరింత వేగంగా పెరిగింది. మరోవైపు బంగారం ధర కూడా మే తర్వాత గరిష్ఠ స్థాయికి చేరింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిప్టో సంస్థల ప్రతినిధులతో సమావేశం కావడం కూడా మార్కెట్‌కు సానుకూల సంకేతంగా మారింది. అమెరికాలో నమోదైన స్పాట్ బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌ల్లోకి సంస్థాగత పెట్టుబడులు మళ్లీ పెరిగాయి. 13 ఈటీఎఫ్‌ల్లోకి ఈ వారం ఇప్పటివరకు బిలియన్ డాలర్లకు పైగా నిధులు వచ్చాయి. 2025 అక్టోబర్‌లో బిట్‌కాయిన్ దాదాపు 1.26 లక్షల డాలర్ల గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత భారీ పతనం నమోదైంది. 2026 జూన్ చివర్లో 58,642 డాలర్లకు పడిపోయింది. ప్రస్తుతం 80 వేల డాలర్లకు చేరువగా దూసుకెళుతోంది.

వారానికి రూ.3.9 కోట్ల రాబడి నష్టం!
రతన్‌టాటా ట్రస్ట్, ట్రస్టీల వివాదంపై మరో ఫిర్యాదు

ముంబయి, ఆగస్టు 22: టాటా సన్స్ వార్షిక సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడిన నేపథ్యంలో సర్ రతన్ టాటా ట్రస్ట్ ట్రస్టీలు తమ చట్టబద్ధ, విశ్వసనీయ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారా అనే అంశంపై మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్‌కు ముంబైకి చెందిన అడ్వకేట్, సొలిసిటర్ కిరణ్ డోయిఫోడ్ ఫిర్యాదును అందచేసారు. ఫిర్యాదు ప్రకారం, టాటా సన్స్ బోర్డు సుమారు రూ.4,479 కోట్ల డివిడెండ్‌ను సిఫారసు చేసింది. ఇందులో దాదాపు రూ.2,900 కోట్లు టాటా ట్రస్టులకేచెందుతాయి. టాటా సన్స్‌లో టాటా ట్రస్టులకు కలిపి దాదాపు 66 శాతం వాటా ఉంది. రూ.2,900 కోట్ల మొత్తానికి ఏడాదికి 7 శాతం పెట్టుబడి రాబడి లభిస్తుందని అంచనా వేస్తే, ఒక్క రోజుకు సుమారు రూ.55.6 లక్షలు, వారానికి దాదాపు రూ.3.9 కోట్ల పెట్టుబడి ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని డోయిఫోడ్ పేర్కొన్నారు. 60 రోజుల జాప్యం జరిగితే సుమారు రూ.33.4 కోట్ల అవకాశ వ్యయం ఏర్పడవచ్చని ఫిర్యాదులో వివరించారు. ఈ నిధులు సాధారణంగా దాతృత్వ కార్యక్రమాలకు ఉపయోగించాల్సినవని తెలిపారు. ఈ నిధులను వ్యక్తిగత ట్రస్టీలకు చెందిన ప్రైవేటు వాణిజ్య ఆస్తిగా పరిగణించరాదని, అవి ప్రజా ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న చారిటబుల్ సంస్థల వనరులని ఫిర్యాదు స్పష్టం చేసింది. ట్రస్టీలు ఆ నిధులకు సంరక్షకులుగా వ్యవహరించాల్సి ఉంటుందని, వ్యక్తిగత అభిప్రాయ భేదాలు లేదా అంతర్గత విభేదాల కారణంగా లబ్ధిదారులకు ఆర్థిక నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని పేర్కొంది.

అలాగే సర్‌రతన్‌టాటా ట్రస్టీల మధ్య ఉన్న విభేదాలు, వ్యక్తిగత ప్రయోజనాలు లేదా ప్రయోజనాల సంఘర్షణలు ట్రస్ట్ సమావేశాలు కొనసాగకపోవడానికి కారణమయ్యాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ధార్మిక ట్రస్ట్ ట్రస్టీలు సంస్థ, లబ్ధిదారుల ప్రయోజనాలను చురుకుగా, బాధ్యతాయుతంగా పరిరక్షించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని డోయిఫోడ్ పేర్కొన్నారు.

వాణిజ్యం

టెస్లా సహా భద్రతా లోపాలతో 40 లక్షల కార్ల రీకాల్

బీజింగ్, ఆగస్టు 22: భద్రతా లోపాల కారణంగా టెస్లా సహా పలు చైనా కార్ల తయారీ సంస్థలు భారీ సంఖ్యలో వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. ప్రధానంగా కార్ల డోర్ హ్యాండిల్స్‌కు సంబంధించిన సమస్యలే ఇందుకు కారణం. మొత్తంగా 40 లక్షలకు పైగా వాహనాలపై రీకాల్ ప్రభావం పడుతోంది. చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ ప్రకారం టెస్లా చైనాలో తయారు చేసినవి, దిగుమతి చేసుకున్నవి కలిపి సుమారు 29.8 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను రీకాల్ చేస్తోంది. ఇందులో మోడల్ 3, మోడల్ వై, మోడల్ ఎక్స్, మోడల్‌ఎస్ ఉన్నాయి. తీవ్రమైన ప్రమాదం జరిగి విద్యుత్ వ్యవస్థ పనిచేయకపోతే డోర్‌హ్యాండిల్స్ సరిగా స్పందించకపోవచ్చని చైనా నియంత్రణ సంస్థ తెలిపింది. దీంతో కారులో ఉన్నవారు త్వరగా బయటకు రావడం కష్టమవుతుందని పేర్కొంది. వచ్చే ఏడాది నుంచి కొత్త వాహనాల్లో ఇలాంటి హ్యాండిల్స్‌ను నిషేధించనున్నట్లు ఫిబ్రవరిలో ప్రకటించింది. టెస్లాతో పాటు షియోమీ 3.9 లక్షలకు పైగా వాహనాలను వెనక్కి పిలుస్తోంది. లీప్‌మోటార్ 3.7 లక్షలకు పైగా కార్లను రీకాల్ చేస్తోంది. గీలీ, ఎక్స్‌పెంగ్ సహా మరికొన్ని చైనా సంస్థలు కూడా వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. రీకాల్ అనేది ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ ఎదుగుదలలో సహజమైన దశ అని చైనా ప్యాసింజర్ కార్ అసోసియేషన్ అధిపతి కుయ్ డోంగ్షు పేర్కొన్నారు. డిజైన్ కంటే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

రిటైల్ క్రెడిట్‌లో పసిడి రుణాలే టాప్!

ముంబయి, ఆగస్టు 22: భారత్‌లో గోల్డ్ లోన్లు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రిటైల్ రుణ విభాగంగా మారుతున్నాయని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ జేపీ మోర్గాన్ పేర్కొంది. రానున్న ఐదేళ్లలో మొత్తం వ్యవస్థాగత రుణాల్లో గోల్డ్ లోన్ల వాటా ప్రస్తుత 5 శాతం నుంచి సుమారు 10 శాతానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. 2024లో ఈ వాటా కేవలం 2 శాతంగా ఉండేది. బంగారం ఇక కేవలం కుటుంబ వారసత్వ ఆభరణంగా కాకుండా అవసరమైనప్పుడు నగదుగా మార్చుకోగల ఆస్తిగా మారుతున్న నేపథ్యంలో గోల్డ్ లోన్లకు దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు ఉన్నాయని జేపీ మోర్గాన్ తన నివేదిక ఇచ్చింది. తక్కువ వడ్డీతో రుణాలుగోల్డ్ లోన్లు భద్రత కలిగిన రిటైల్ రుణాలుగా ఉండటంతో పాటు బలమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయని జేపీ మోర్గాన్ తెలిపింది. ఈ విభాగం తదుపరి దశలో చక్రీయ పరిణామాలపై కాకుండా నిర్మాణాత్మక వృద్ధిపై ఆధారపడుతుందని పేర్కొంది. వ్యక్తిగత రుణాలు వంటి అరక్షిత రుణాలతో పోలిస్తే గోల్డ్ లోన్లపై వడ్డీ రేట్లు 3-6 శాతం పాయింట్లు తక్కువగా ఉండటం రుణగ్రహీతలకు ప్రయోజనం కలిగిస్తోందని తెలిపింది. అదే సమయంలో రుణదాతలకు తక్కువ రిస్క్‌తో కూడిన సెక్యూర్డ్ లోన్ బుక్‌ను పెంచుకునే అవకాశం లభిస్తోందని వివరించింది. దేశంలోని దిగువ 60 శాతం ఆదాయ వర్గాల కుటుంబాల వద్ద ఉన్న బంగారంలో ప్రస్తుతం కేవలం 11 శాతం మాత్రమే రుణాల కోసం తాకట్టు పెట్టినట్లు జేపీ మోర్గాన్ అంచనా వేసింది. ఇందులో ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా తాకట్టు పెట్టిన బంగారం వాటా కేవలం 3 శాతం మాత్రమేనని తెలిపింది. దక్షిణ భారతదేశంలో దేశంలోని కుటుంబాల వద్ద ఉన్న బంగారంలో దాదాపు 40 శాతం ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో గోల్డ్ లోన్ మార్కెట్ సంతృప్త స్థాయికి చేరిందన్న అభిప్రాయాన్ని జేపీ మోర్గాన్ తోసిపుచ్చింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే దక్షిణ భారతదేశంలోనూ గోల్డ్ లోన్ వినియోగం దాదాపు సమానంగానే ఉందని, అందువల్ల ఇంకా విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. పర్సనల్, చిన్న వ్యాపార రుణాలకు ప్రత్యామ్నాయంకుటుంబాలు, చిన్న వ్యాపారాలు వ్యక్తిగత రుణాలు, బిజినెస్ రుణాలకు బదులుగా గోల్డ్ లోన్లను ఎంచుకోవడం పెరుగుతోందని జేపీ మోర్గాన్ తెలిపింది. రిటైల్ క్రెడిట్ డిస్బర్స్‌మెంట్లలో గోల్డ్ లోన్ల వాటా 2023లో 18 శాతం నుంచి 2026లో 41 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో అరక్షిత వ్యక్తిగత, చిన్న వ్యాపార రుణాల వాటా 55 శాతం నుంచి 41 శాతానికి తగ్గింది. తక్కువ వడ్డీ రేట్లు, పెరుగుతున్న ఆర్థిక అవగాహన ఈ మార్పుకు ప్రధాన కారణాలని బ్రోకరేజ్ తెలిపింది. విద్య, వైద్య అత్యవసరాలు, ప్రయాణాలు వంటి స్వల్పకాలిక అవసరాలకు కుటుంబాలు తమ వద్ద ఖాళీగా ఉన్న బంగారు ఆభరణాలను నగదుగా మార్చుకోవడానికి సిద్ధమవుతున్నాయని పేర్కొంది. చిన్న వ్యాపారాలు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కూడా గోల్డ్ లోన్లను వినియోగిస్తున్నాయని తెలిపింది. ముఖ్యంగా తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న సబ్ ప్రైమ్ రుణగ్రహీతల్లో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోందని జేపీ మోర్గాన్ పేర్కొంది. గోల్డ్ లోన్లలో మొండి బకాయిలు తక్కురిటైల్ క్రెడిట్ విభాగాల్లో గోల్డ్ లోన్లకు అత్యల్ప బ్యాడ్ లోన్ నిష్పత్తి ఉందని జేపీ మోర్గాన్ తెలిపింది. ఇది సుమారు 0.2 శాతంగా ఉండగా, గృహ, వాహన రుణాల్లో 0.5-0.6 శాతం, అరక్షిత రుణాల్లో 1 శాతానికి పైగా ఉంది. సాధారణంగా 55-65 శాతం లోన్‌టువాల్యూ వద్ద రుణాలు ఇవ్వడం వల్ల రుణదాతలకు తగిన భద్రత ఉంటుందని వివరించింది. 2026 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ద్వారా బంగారం తాకట్టుపై రుణాలకు సంబంధించిన గరిష్ఠ విలువకు తగ్గరుణం ఎల్టీవీ పరిమితులను వివిధ స్థాయిల్లో పెంచడంతో పాటు, తాకట్టు బంగారం విలువ నిర్ధారణ విధానాన్ని కఠినతరం చేశారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.